thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 191 కరీంనగర్ గురువారం, 18 సెప్టెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## 'తుంగభద్ర'పై కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం..

బెంగళూరు : తుంగభద్ర డ్యాం కు గతేడాది కొట్టుకుపోయిన 19వ క్రస్ట్ గేటు స్థానంలో కొత్త గేటును అమర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని బీజేపీ నాయకులు ఆరోపించారు. టీబీడ్యాంపై కొప్పళ జిల్లా బీజేపీ బృందం పర్యటించింది. ప్రతిపక్ష నాయకుడు దొడ్డనగౌడ పాటిల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బసవరాజ్ కావటూర్, రమేష్, గణేష్, మంజునాథ్, మల్లికార్జున తదితర నాయకులు బృందంలో ఉన్నారు. దెబ్బతిన్న 19వ క్రస్ట్ గేటు స్థానంలో కొత్త గేటు అమర్చేందుకు రూ.2 కోట్ల వ్యయంతో టెండర్ పిలిచారని, కానీ మళ్లీ రద్దు చేశారన్నారు. ఇక మిగిలిన గేట్లకు ఎప్పుడు టెండర్ పిలుస్తారో.. ఎప్పుడు మరమ్మతుచేస్తారో ఆయోమయంగా ఉందని మండిపడ్డారు. డ్యాంకు నీరు వస్తున్న తరుణంలో గేట్లు పటిష్టంగా లేకుంటే నీరు ఎలా నిలుస్తాయని ప్రశ్నించారు. ఇది పూర్తిగా సర్కార్ వైఫల్యమేనన్నారు. పలువురు బీజేపీ నాయకులు డ్యాంను పరిశీలించారు.



## 'తెలంగాణ రాజ్యాధికార పార్టీ'

## కొత్త రాజకీయ పార్టీ పెట్టిన తీన్మార్ మల్లన్న

హైదరాబాద్: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేశారు. తన పార్టీకి 'తెలంగాణ రాజ్యాధికార పార్టీ' అని పేరు పెట్టినట్లు ప్రకటించారు. తాజ్‌కృష్ణ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొత్త రాజకీయ పార్టీ పేరును ప్రకటించారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17వ తేదీ బీసీల తలరాత మారే దినంగా తాను భావిస్తున్నానన్నారు. తెలంగాణలో మెజార్టీ సంఖ్యలో ఉన్న బీసీలకు రాజకీయ పార్టీ అవసరం ఉందన్న ఉద్దేశంతో పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

# పటేల్ కలలుగన్న దేశాన్ని నిర్మించేందుకు ప్రధాని మోదీ కృషి: రాజ్‌నాథ్ సింగ్




హైదరాబాద్: నిజాం పాలనలో రజాకార్లు అనేక దారుణాలు చేశారని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన తెలంగాణ విమోచన దినోత్సవంలో జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. "నిజాం పాలనలో రజాకార్లు అనేక దారుణాలు చేశారు. వారి ఆగడాలు తట్టుకోలేక ప్రజలు తిరగబడ్డారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ సమర్థత వల్ల హైదరాబాద్ రాజ్యం భారత్‌లో కలిసింది. ఆపరేషన్ పోలో దేశ చరిత్రలో గొప్ప ఘట్టం. పటేల్ ముందు నిజాం తన ఓటమిని ఒప్పుకొన్నారు.

**ఇవాళ భారత్ అంటే సాదాసీదా దేశం కాదు...** ఎన్ని ఆటంకాలు ఎదురైనా ధర్మ మార్గంలోనే నడుస్తాం. జాతీయ సమగ్రతను దెబ్బతీసే కుట్రలను తిప్పికొట్టాలి. పటేల్ కలలుగన్న దేశాన్ని నిర్మించేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారు. దేశాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆర్టికల్ 370ని తొలగించి జమ్మూకశ్మీర్‌ను అభివృద్ధి చేస్తున్నాం. మనలో ఎన్ని విభేదాలున్నా దేశం విషయంలో అందరిదీ ఒకటే మాట. దేశ రక్షణ, భద్రత విషయంలో ప్రజలమంతా ఏకతాటిపైకి వస్తాం. ఇవాళ భారత్ అంటే సాదాసీదా దేశం కాదు. ప్రపంచాన్ని శాసించే స్థాయికి చేరుకుంటున్నాం. ఆపరేషన్ సిందూర్‌లో మన సైనికులు సత్తా చాటారు. ఉగ్రవాది మసూద్ అజార్ కుటుంబ సభ్యులను హతమార్చాం. పహల్గాంలో మతం పేరు అడిగి మరీ చంపిన వారికి బుద్ధి చెప్పాం. ఆపరేషన్ సిందూర్‌లో భారత శక్తిసామర్థ్యాలు, సైనిక సత్తాను ప్రపంచం చూసింది. ఉగ్రవాదుల స్థావరాల్లోకి వెళ్లి మరీ వారిని హతమార్చాం. ఆపరేషన్ సింధూర్ ముగియలేదు. ఇప్పుడు చిన్న పాజ్ మాత్రమే. ఆపరేషన్ సింధూర్ కొనసాగుతుంది" అని రాజ్‌నాథ్ అన్నారు.

**మజ్లిస్‌కు భయపడి చరిత్రను కనుమరుగు చేస్తున్నారు: కిషన్‌రెడ్డి...** ఖాసిం రజ్వీ నేతృత్వంలోని రజాకార్లు పల్లెలపై పడి దోచుకున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గ్రామాలపై పడి హత్యలు, అత్యాచారాలు చేశారన్నారు. కర్ణాటక, మహారాష్ట్రలో ముక్తి దివస్ చేసుకుంటే.. ఇక్కడెందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. పేర్లు మార్చి కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి పార్టీలు వేడుకలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. మజ్లిస్‌కు భయపడి చరిత్రను కనుమరుగు చేస్తున్నారని ఆరోపించారు.

**ఆపరేషన్ పోలోతో హైదరాబాద్‌కు విముక్తి: గజేంద్ర సింగ్ షెకావత్...** ప్రధాని మోదీ ఆదేశాలతో విమోచన దినోత్సవాన్ని కేంద్రం అధికారికంగా నిర్వహిస్తోందని కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. తెలంగాణ విముక్తి కోసం పోరాడిన వారిని కేంద్రం గుర్తించి గౌరవిస్తుందని చెప్పారు. నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం పాడేందుకు ఎంతో మంది ప్రాణాలు అర్పించారన్నారు. ఆపరేషన్ పోలోతో సర్దార్ వల్లభాయ్ పటేల్ హైదరాబాద్‌కు విముక్తి కల్పించారని వివరించారు.

**నిజాం.. బలవంతపు మతమార్పిడులు చేశారు: బండి సంజయ్...** నిజాం నిరంకుశ పాలన తలచుకుంటే ప్రజల రక్తం మరుగుతుందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఉర్దూను ప్రజలపై రుద్దేందుకు నిజాం ప్రయత్నించారన్నారు. బలవంతపు మతమార్పిడులు చేశారని.. మతం మారని వారికి ఎక్కువ పన్నులు వేసి ఇబ్బంది పెట్టారని ఆరోపించారు. ఓటు బ్యాంకు రాజకీయాలతో రాష్ట్ర పాలకులు విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడంలేదని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటులో రాజ్‌నాథ్ సింగ్ ప్రముఖ పాత్ర పోషించారని చెప్పారు.

# తిరుగులేని శక్తిగా తెలంగాణ

## ప్రపంచ ఐకానిక్ సిటీగా హైదరాబాద్!

## తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి




హైదరాబాద్: ప్రజలే రాసుకున్న పోరాట చరిత్ర మనదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రపంచ పటంలో తిరుగులేని శక్తిగా తెలంగాణ ఎదుగుతుందని, హైదరాబాద్ వరల్డ్ ఐకానిక్ సిటీగా ఎదుగుతుందని సీఎం ఉద్ఘాటించారు. పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన ప్రసంగించారు. "ప్రపంచ ఉద్యమాల్లో సువర్ణాక్షరాలతో లిఖించదగిన పోరాటం మనది. సాయుధ పోరాటస్ఫూర్తితో నిన్నటి నియంత పాలనను పక్కనపెట్టాం. బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతానికి మా పాలనలో తావులేదు. స్వేచ్ఛ, సమాన అవకాశాలు, సామాజిక న్యాయంలో రోల్‌మోడల్‌గా ఉన్నాం. ఉన్నత చదువుల ద్వారా మన యువత సత్తా చాటాలి. భవిష్యత్తులో పాఠశాలల రూపురేఖలు మారబోతున్నాయి. విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. త్వరలో రాష్ట్ర విద్యా విధానం తెస్తున్నాం. సాయుధ పోరాటంలో మహిళల పాత్ర ఎనలేనిది. చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి సత్తాచాటారు. డ్వాక్రా ఉత్పత్తుల విక్రయానికి మరిన్ని మహిళా మార్టులు ఏర్పాటు చేస్తాం. రైతుల కోసం తెచ్చే పథకాలు సరికొత్త ఒరవడిని సృష్టిస్తున్నాయి. ఏ రాష్ట్రం చేయని విధంగా వారికి మేలు చేస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులున్నా రైతుల సంక్షేమం విషయంలో రాజీ పడలేదు. సాగు మోటార్లకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. పారదర్శకంగా పోటీ పరీక్షలు నిర్వహించి వేగంగా ఫలితాలు వెల్లడించాం. సివిల్స్ పరీక్షలు రాసేవారికి ఆర్థిక సాయం అందిస్తున్నాం.

**కృష్ణా, గోదావరి నదీజలాలపై రాజీ పడేది లేదు...** గత ప్రభుత్వం తెచ్చిన 'ధరణి' వల్ల రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తమైంది. మా ప్రభుత్వం వచ్చాక భూభారతి చట్టం తెచ్చి సమర్థంగా అమలు చేస్తున్నాం. పేదల ఆత్మగౌరవాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నాం. పేదలకు సన్నబియ్యం ఇస్తున్న ఏకైక రాష్ట్రం మనదే. కృష్ణా, గోదావరి నదీజలాలపై రాజీ పడేది లేదు. దీనిపై న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నాం. 904 టీఎంసీల సాధనకు ట్రైబ్యునల్ ఎదుట బలమైన వాదనలు వినిపిస్తాం. కృష్ణా జలాల హక్కుల కోసం పక్కా ప్రణాళికతో ముందుకెళ్తాం. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి చేసి ఫ్లోరైడ్ సమస్య పరిష్కరిస్తాం. ఎవరెన్ని అడ్డంకులు కల్పించినా వెనకడుగు వేసేది లేదు.

**హైదరాబాద్ నగరాన్ని గేట్‌వే ఆఫ్ వరల్డ్‌గా తీర్చిదిద్దుతాం...** హైదరాబాద్ అంటేనే ఒక బ్రాండ్. ఈ నగరాన్ని గేట్‌వే ఆఫ్ వరల్డ్‌గా తీర్చిదిద్దుతాం. 2047 నాటికి మన రాష్ట్రం 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదగాలి. హైదరాబాద్‌కు గోదావరి జలాలు తీసుకొస్తున్నాం. కాలుష్యం లేని నగరంగా మారుస్తున్నాం. మూసీ నది పక్కన జీవించే పేదలకు మంచి జీవన ప్రమాణాలు కల్పిస్తాం. ఈ పరిధిలో ఉన్నవారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. పర్యాటకులను ఆకర్షించేలా మూసీ నదిని మారుస్తాం. ఈ ఏడాది డిసెంబర్ 9 లోగా అనేక అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం.

**త్వరలోనే మెట్రో విస్తరణ పనులు...** త్వరలోనే మెట్రో విస్తరణ పనులు ప్రారంభిస్తాం. తెలంగాణ అంటేనే పోరాటాలు, త్యాగాలకు వేదిక. యువత పాలిట శాపంగా మారిన డ్రగ్స్ సమస్యను అరికడతాం. మాదకద్రవ్యాలు, గంజాయి నిర్మూలనకు ప్రజలు సహకరించాలి. వీటిని అరికట్టడంలో మన పోలీసులు సత్తా చాటారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేస్తున్నాం. డిసెంబర్ 9న రాష్ట్ర ప్రజలకు దీన్ని అందిస్తాం. దేశానికి గొప్ప నగరం నిర్మించాలనే ఉద్దేశంతో 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ తెస్తున్నాం.

దీంతో రాష్ట్ర ఆదాయం బాగా పెరుగుతుంది. రీజినల్ రింగ్ రోడ్డు కూడా అభివృద్ధి సూచిక కానుంది. 12 రేడియల్ రోడ్లు వేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నాం" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

# మోదీ స్మార్ట్ గేమ్!

## అమెరికా 'జీ7' ప్లాన్‌కు..

## తెలివిగా చెక్ పెడుతోన్న భారత్!!




ప్రపంచ దేశాలతో వాణిజ్య యుద్ధానికి తెరలేపిన అమెరికా.. టారిఫ్ బూచిని చూపిస్తూ ఆధిపత్యం చెలాయించాలని ప్రయత్నిస్తోంది. మిత్ర, శత్రు దేశాలు అనే తేడా లేకుండా సుంకాలు విధిస్తామని దారికి తెచ్చుకుంటోంది. మాట వినని వాళ్లను ఒంటరి చేయడానికి ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తోంది. ముఖ్యంగా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాపై టారిఫ్ బాంబులు పేలుస్తోంది అమెరికా. ఉక్రెయిన్ యుద్ధానికి సుంకాలను లింక్ పెడుతూ ఈ దేశాలను బదనాం చేస్తోంది. ఇటీవల తన బెదిరింపులతో పని జరగడం లేదని.. ధనిక జీ7, నాటో దేశాలపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు చేస్తోంది. అమెరికా బెదిరింపులకు బెదరని చైనా.. మాపై టారిఫ్‌లు విధిస్తే మీ సంగతి అంతే అంటూ.. మళ్లీ జీ7 దేశాలకు వార్నింగ్ ఇస్తోంది. ఈ రెండు ప్రపంచ శక్తుల మధ్య జీ7 దేశాలు నలిగిపోతున్నాయి! మూడో శక్తిగా ఎదుగుతున్న భారత్ మాత్రం స్మార్ట్‌గా గేమ్ ప్లే చేస్తోంది. తన వ్యూహాత్మక నిర్ణయాలతో జీ7 దేశాలను ఇరకాటంలో పెడుతోంది!

ఈ క్రమంలో జీ7 దేశాలపై అమెరికా, చైనా వార్నింగ్‌లు ఏంటి? జీ7 దేశాల పరిస్థితి ఏలా ఉంది? ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో భారత్ ఎలా వ్యవహరిస్తోంది? అనే వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం. ఉక్రెయిన్ యుద్ధాన్ని సాకుగా చూపిస్తూ.. 'మాగా' లక్ష్యాన్ని నెరవేర్చుకుంటున్నట్లుగా అనిపిస్తోంది అమెరికా వ్యవహారం చూస్తుంటే. అందుకే రష్యాపై ఒత్తిడి తెస్తేనే యుద్ధం ఆగుతుందని చెబుతోంది. అందులో భాగంగా జీ7, నాటో దేశాలపై ఉక్రెయిన్ సెంటిమెంట్ రాజేస్తోంది. ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు మీరు నిజంగా కట్టుబడి ఉంటే.. రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకు ముందుకు రావాలి అంటూ.. ఇటీవల అమెరికా వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్ అన్నారు. జీ7 దేశాల ఆర్థిక మంత్రులు వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ముగించాలంటే.. చమురు కొనుగోలు చేస్తూ రష్యాకు ఆర్థిక దన్నుగా నిలుస్తున్న భారత్, చైనాపై టారిఫ్‌లు విధించాలన్నారు. రష్యా నుంచి చమురు కొంటున్న మిగతా దేశాలపై కూడా 50 నుంచి 100 శాతం టారిఫ్‌లు విధించాలని. ఇది డొనాల్డ్ ట్రంప్ ప్రదిపాదనగా జీ7 ఆర్థిక మంత్రులకు చేరవేశారు జామిసన్ గ్రీర్. ఇప్పటికే భారత్‌పై తాము టారిఫ్‌లు విధించామని.. మీరు కూడా అలాగే చేయాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. సమావేశం తర్వాత ఉక్రెయిన్ యుద్ధం ముగించడానికి కట్టుబడి ఉన్నామని.. 'అందరితో గోవింద అన్నట్లు' టారిఫ్‌లపై సానుకూలంగా స్పందిచాయి జీ7 దేశాలు.

**మాపై టారిఫ్‌లు విధిస్తే మీ సంగతి అంతే!...** రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న వారిపై టారిఫ్‌లు విధించాలని నాటో, జీ7 దేశాలకు అమెరికా పిలుపునివ్వడంపై చైనా తీవ్రంగా స్పందించింది. ఏకపక్షంగా వేధించేందుకే అమెరికా ఇలా చేస్తోందని ఆరోపించింది. ఇది అమెరికా ఆర్థిక బలప్రదర్శన తప్ప మరొకటి కాదని చెప్పింది. అమెరికా చెప్పినట్లు తమపై టారిఫ్‌లు విధిస్తే.. తాము ప్రతి చర్యలు తీసుకుంటామని.. దానికి పర్యవసనాలుంటాయని జీ7 దేశాలను హెచ్చరించింది చైనా. ప్రపంచంలో ఇతర దేశాల మాదిరిగానే తమకు రష్యాతో కూడా సంబంధాలున్నాయని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్ జిన్ అన్నారు. వాషింగ్టన్ వ్యవహరిస్తున్న తీరు.. అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం, ప్రపంచ వాణిజ్యంపై ఇది ప్రతికూల ప్రభావం చూపిస్తుందని చెప్పారు. భయపెట్టడం, ఒత్తిడి చేయడం వంటి చర్యల వల్ల సమస్యలు పరిష్కరించలేరని.. కేవలం చర్చలు, సంప్రదింపులతోనే ఉక్రెయిన్ యుద్ధానికి పరిష్కార మార్గం లభిస్తుందని తాము నమ్ముతున్నట్లు తెలిపారు. ఇప్పటికే తాము అమెరికా, యూరప్ దేశాలతో మంచి వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

**భారత్ స్మార్ట్ గేమ్!...** అమెరికాతో పాటు కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, యూకే.. జీ7 కూటమిలో సభ్యులుగా ఉన్నాయి. గతంలో జస్టిన్ ట్రూడో ప్రధానిగా ఉన్న సమయంలో కెనడాతో భారత్ సంబంధాలు దెబ్బతిన్నాయి. ఇప్పుడిప్పుడే మళ్లీ ద్వైపాక్షిక సంబంధాలు గాడిలో పడుతున్నాయి. గత కొద్దిరోజులుగా ట్రంప్ విధించిన టారిఫ్‌లతో భారత్– అమెరికా వాణిజ్య యుద్ధం జరుగుతోంది. ఈ రెండు దేశాలు తప్ప ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, యూకేతో భారత్‌కు మంచి సంబంధాలే ఉన్నాయి. అమెరికా జీ7 దేశాలపై చేసిన టారిఫ్ ప్రకటన వెలువడిన వెంటనే.. భారత్ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. 114 రఫేల్ విమానాలు కొనుగోలు చేయాలని భారత సైన్యం సమర్పించిన ప్రతిపాదనను.. రక్షణ మంత్రిత్వ శాఖ పరిశీలించనున్నట్లు ప్రకటనలు వెలువడ్డాయి.

రఫేల్‌ను యుద్ధ విమానాలను తయారు చేసేది ఫ్రాన్స్‌కు చెందిన డసాల్ట్ ఏవియేషన్ అనే కంపెనీ. దాదాపు రూ. 2 లక్షల కోట్ల విలువైన ఈ డీల్ ప్రకటన.. ఫ్రాన్స్‌కు చాలా కీలకం. ట్రంప్ చెప్పినట్లు భారత్‌పై ఫ్రాన్స్ టారిఫ్‌లు విధించకుండా ఇరకాటంలో పెట్టిన ప్రకటనగానే దీన్ని చూడొచ్చని నిపుణలు చెబుతున్నారు.




## విద్యాశాఖ సమూల ప్రక్షాళన.. సీఎం రేవంత్ కీలక నిర్ణయం..

హైదరాబాద్: విద్యా విధానంలో సమూల మార్పులు, ప్రక్షాళన చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిందని సీఎం రేవంత్ తెలిపారు. నూతన పాలసీ వల్ల విద్యా విధానంలో మార్పులతో పాటు పేదరిక నిర్మూలన జరుగుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఇవాళ(బుధవారం) తెలంగాణ నూతన విద్యా విధానంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో తెలంగాణ విద్యలో ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలు కీలక పాత్ర పోషించాయని గుర్తు చేశారు.

**విద్యలో ప్రభుత్వ పాత్ర తగ్గిపోతుంది..** రాష్ట్రంలో ఓపెన్ మార్కెట్ కారణంగా అంతర్జాతీయ స్థాయికి మన విద్యా విధానం సరితూగడం లేదని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ప్రతి సంవత్సరం 1.10 లక్షల మంది ఇంజనీరింగ్ విద్యార్థులు ఉత్తీర్ణులు అవుతున్నారని తెలిపారు. వారిలో 15 శాతం మంది మాత్రమే ఉద్యోగాలు పొందుతున్నారని పేర్కొన్నారు. విద్యలో ప్రభుత్వ పాత్ర తగ్గిపోతుందని అసహనం వ్యక్తం చేశారు. విద్యా శాఖకు రూ.21 వేల కోట్లు కేటాయిస్తే.. అందులో 98 శాతం జీతాలకే ఖర్చు అవుతుందని వ్యాఖ్యానించారు.

**పేదరిక నిర్మూలన జరగాలంటే విద్య ఒక్కటే మార్గం..** పేదరిక నిర్మూలన జరగాలంటే విద్య ఒక్కటే మార్గమని రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకురావడమే తన ధ్యేయమని నొక్కిచెప్పారు. అందుకు కావాల్సిన సలహాలు, సూచనలు ఇవ్వాలని అధికారులను కోరారు. 73 లక్షల మంది యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. దేశ విద్య విధానాన్ని మార్చేలా తెలంగాణ కొత్త విద్యా విధానం ఉండాలని పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం అధికారులు ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని సూచించారు.

**స్కూల్ ఎడ్యుకేషన్‌లో లోపాలు ఉన్నాయి..** స్కూల్ ఎడ్యుకేషన్‌లో లోపాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి తెలిపారు. 11 వేల ప్రైవేట్ స్కూల్స్‌లో 34 లక్షల మంది విద్యార్థులు చదువుతే.. 27 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 18 లక్షల మంది విద్యార్థులు మాత్రమే చదువుకుంటున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్య కోసం తీసుకునే రుణాలకు ఎఫ్ఆర్‌బీఎం పరిధి నుంచి మినహాయింపు ఇవ్వాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరినట్లు చెప్పారు.

1 నుంచి 12 తరగతుల వరకు సమూల మార్పులు రావాలని ఆయన సూచించారు. విద్య విషయంలో సమాజానికి మేలు జరుగుతుందంటే.. రాజకీయంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురుకోవడానికైనా తాను సిద్ధమని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.



## తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం..

### పబ్లిక్ గార్డెన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన సీఎం రేవంత్

హైదరాబాద్: పబ్లిక్ గార్డెన్‌లో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కళా బృందాలు రాష్ట్ర గీతం జయజయహే తెలంగాణను ఆలపించాయి. అంతకు ముందు గన్‌పార్క్‌లో అమర వీరులకు సీఎం నివాళి అర్పించారు. వారి సేవలను గుర్తుచేసుకున్నారు.

## రాచరికం నుంచి ప్రజాస్వామ్యంలోకి తెలంగాణ బిడ్డలు అడుగుపెట్టిన రోజు ఇది: కేటీఆర్



హైదరాబాద్: రాచరికం నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థలోకి తెలంగాణ బిడ్డలు అడుగుపెట్టిన రోజు ఇదని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన జాతీయ సమైక్యతా వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. వేలాది మంది ఆనాటి రాచరిక వ్యవస్థపై పోరాటం చేసి ప్రాణాలు అర్పించారన్నారు. పోరాట యోధులకు, అమర వీరులందరికీ శిరస్సు వంచి నివాళులు అర్పిస్తున్నట్లు చెప్పారు. "తెలంగాణ అంటేనే త్యాగాల గడ్డ, పోరాటాల అడ్డా. ఆనాటి సాయుధ రైతాంగ పోరాటం నుంచి మొదలుకొని 1969 తెలంగాణ ఉద్యమం, ఆ తర్వాత కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రజాస్వామిక తెలంగాణ ఉద్యమం.. అన్నింటినీ తెలంగాణ చూసింది. చాకలి ఐలమ్మ, షేక్ బందగి, రావి నారాయణరెడ్డి వంటి ఎందరో అమరవీరులు ఈ తెలంగాణలో జన్మించారు. రాష్ట్రంలో మరోసారి సంక్షేమ, అభివృద్ధి రాజ్యం రావాలని కేసీఆర్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తూనే ఉంటాం. ఒకవైపు రైతన్నలు యూరియా లేక ఇబ్బందులు పడుతుంటే.. రాష్ట్ర ప్రభుత్వం ఒలింపిక్స్ గురించి మాట్లాడుతోంది. ఇలాంటి ప్రజా వ్యతిరేక ప్రభుత్వంపైన భారత రాష్ట్ర సమితి పోరాడుతూనే ఉంటుంది" అని కేటీఆర్ అన్నారు.

## గ్రూప్-1 అంశం.. హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించిన టీజీపీఎస్సీ




హైదరాబాద్: గ్రూప్ 1 అంశంపై హైకోర్టు డివిజన్ బెంచ్‌ను టీజీపీఎస్సీ ఆశ్రయించింది. సింగిల్ బెంచ్ తీర్పును డివిజన్ బెంచ్‌లో సవాల్ చేసింది. గ్రూప్ 1 ఫలితాలు, ర్యాంకులు రద్దు చేస్తూ ఈ నెల 9న హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించి మార్చి 10న విడుదల చేసిన ఫలితాలను, మార్చి 30న ప్రకటించిన జనరల్ ర్యాంకులను రద్దు చేస్తూ హైకోర్టు సింగిల్ బెంచ్ ఈ నెల 9న సంచలన తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా ఇచ్చిన ఆదేశాల్లో... టీజీపీఎస్సీకి రెండు ఆప్షన్లను ఇచ్చింది. "మెయిన్స్ జవాబు పత్రాలను పునర్ మూల్యాంకనం చేయాలి. సంజయ్‌సింగ్ వర్సెస్ యూపీఎస్సీ కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన మార్గదర్శకాల ప్రకారం మాన్యువల్(సాధారణ పద్ధతి)గా మూల్యాంకనం చేసి, ఆ ఫలితాల ఆధారంగా 563 పోస్టులను భర్తీ చేయాలి. లేదంటే... 2024 అక్టోబరు 21 నుంచి 27 మధ్య జరిగిన మెయిన్స్‌ను రద్దు చేసి, పరీక్షలను తిరిగి నిర్వహించాలి. ఈ ప్రక్రియను ఎనిమిది నెలల్లో పూర్తి చేయాలి" అని హైకోర్టు స్పష్టంచేసింది. ఈక్రమంలో సింగిల్ బెంచ్ తీర్పును సవాల్ చేస్తూ టీజీపీఎస్సీ హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది.




హైదరాబాద్ : గ్రూప్-1 పరీక్షల అంశంపై తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చిత్తశుద్ధితో ముందుకు వెళ్తోందని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన వేడుకలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. గ్రూప్-1 పరీక్షల విషయంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగుల విషయంలో రాజీపడే ప్రసక్తి ఉండదన్నారు. కష్టపడి ఉద్యోగం సాధించి ముందుకు వెళ్తున్న ప్రతిభావంతులను కించపరుస్తూ మాట్లాడటం సరికాదని హితవు పలికారు. మరోవైపు రాష్ట్రానికి సరిపడా యూరియాను కేంద్ర ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు.




హైదరాబాద్: ఆర్టీసీలో డ్రైవర్లు, శ్రామిక్ పోస్టుల భర్తీకి తెలంగాణ పోలీసు నియామక మండలి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆర్టీసీలో 1000 డ్రైవర్, 743 శ్రామిక్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

అక్టోబరు 8 నుంచి 28 వరకు దరఖాస్తు గడువు తేదీగా నిర్ణయించారు. డ్రైవర్ పోస్టులకు 22 నుంచి 35ఏళ్లు, శ్రామిక్ పోస్టులకు 18నుంచి 30ఏళ్ల వయసు వారు అర్హులని తెలిపింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరి వారికి 5 ఏళ్లు, ఎక్స్ సర్వీస్ మెన్ అయితే 3ఏళ్లు వయో పరిమితి సడలింపు ఉంటుందని బోర్డు తెలిపింది. స్కిల్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు పేర్కొంది. పూర్తి వివరాల కోసం www.tgprb.inలో చూడాలని పోలీసు నియామక మండలి తెలిపింది.

## చేసిన పనులను చెప్పలేకపోయాం... కాబట్టే ఓడిపోయాం...



హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియంతలా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ఈరోజు మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. సుందరయ్య విజ్ఞాన వేదికలో విద్యార్థులు రౌండ్ టేబుల్ పెట్టుకుంటే అరెస్ట్ చేశారని మండిపడ్డారు. సర్కార్ నడపడం లేదు సర్కస్ నడుపుతున్నారని వ్యాఖ్యలు చేశారు. మంత్రులు ఒక మాట.. ముఖ్యమంత్రి మరొక మాట అంటూ ఎద్దేవా చేశారు. సృజన్ రెడ్డికి సింగరేణిలో 300 కోట్ల టెండర్లు ఇచ్చారని.. గుత్తా అమిత్ రెడ్డికి కాంట్రాక్టర్లు ఇచ్చారని ఆరోపించారు. ఫీజ్ రీయింబర్స్ మెంట్, ఆరోగ్యశ్రీ కి డబ్బులు ఉండవని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా కొత్త పార్టీ పెట్టుకోవచ్చున్నారు. కేసీఆర్ చేసిన పనులను చెప్పలేకపోయాం కాబట్టే ఓడిపోయామని వెల్లడించారు.

**నాపై కోపం సిరిసిల్లపై చూపిస్తున్నారు..** రేషన్ కార్డ్ ఉన్న ప్రతి ఒక్కరికి బతుకమ్మ చీరలు ఇచ్చామని గుర్తు చేశారు. కేటీఆర్‌పైన కోపం సిరిసిల్లపైన చూపిస్తున్నారని మండిపడ్డారు. ముంబై పోలీస్‌లు వచ్చి డ్రగ్స్ పట్టుకుంటే తెలంగాణ పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రతి పక్షంలో రేవంత్ నోటికి వచ్చినట్టు మాట్లాడారని.. ఇప్పుడు అధికారంలో వచ్చినాక తెలిసిందన్నారు. పది నియోజకవర్గాల్లో పార్టీ మారిన ఎమ్మెల్యేలతో అక్కడి స్థానిక కాంగ్రెస్ నేతలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పార్టీ మారిన వారితో రాజీనామా చేయించి ఎన్నిలకు పోవాలని సవాల్ విసిరారు. బీసీ బిల్లుతో బీసీలను మోసం చేస్తుంది కాంగ్రెస్ అంటూ మండిపడ్డారు.

**ఫ్యూచర్ సిటీ అంటూ డ్రామాలు...** ఆర్ఆర్ఆర్‌లో సౌత్ సైడ్ అలైన్‌మెంట్ మార్చారని.. సీఎం రేవంత్ బంధువులు 2,500 ఎకరాల భూములు కొన్నారన్నారు. అలైన్ మెంట్ మార్చితే ఆర్ఆర్ఆర్‌కు డబ్బులు ఇవ్వమని కేంద్రం చెప్పిందని గుర్తుచేశారు. సౌత్ సైడ్ ఆర్ఆర్ఆర్ తామే కడతాం అని రేవంత్ కేంద్రానికి చెప్పారని.. సౌత్ సైడ్ ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ మార్చడం వల్ల మిగతా ప్రాంతాల్లో కూడా అలైన్‌మెంట్ మార్చే పరిస్థితి వచ్చిందని చెప్పుకొచ్చారు. రేవంత్ రెడ్డి బంధువుల భూములు రేట్లు పెంచేందుకు ఆర్ఆర్ఆర్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చారని ఆరోపించారు. ఫ్యూచర్ సిటీ అంటూ రేవంత్ రెడ్డి, వారి బంధువుల డ్రామాలు ఆడుతున్నారంటూ మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

**కుడితిలో పడ్డ ఎలుకల్లా వారి పరిస్థితి..** పార్టీ మారిన ఎమ్మెల్యేల పరిస్థితి కుడితిలో పడిన ఎలుకలా ఉందంటూ కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు. ఏ పార్టీలో ఉన్నామో చెప్పుకోలేనీ దుస్థితిలో ఉన్నారన్నారు. ఆర్ఆర్ఆర్‌లో రేవంత్ రెడ్డి పెద్ద అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. 'త్వరలో ప్రెస్ మీట్ పెడతా. ఫోర్త్ సిటీ లేదు ఏం లేదు. మొత్తం వసూళ్లే. ప్రజల అందరికీ త్వరలోనే అర్థం అవుతుంది' అని మాజీ మంత్రి అన్నారు. తీన్మార్ మల్లన్న పార్టీపై మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పార్టీ పెట్టుకోవచ్చున్నారు. ప్రజలు ఎవరిని ఆదరిస్తే వారికి అధికారం దక్కుతుందని చెప్పుకొచ్చారు. రేవంత్ రెడ్డి సెక్రటేరియట్ కు వస్తున్నారా అని ప్రశ్నించారు. కేసీఆర్‌ను విమర్శించిన రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ప్యాలెస్ నుంచి పాలన నడుపుతున్నారని ఆరోపించారు. ఫీజు రియంబర్స్ మెంట్ ఇవ్వక కాలేజీలు బంద్, ఆరోగ్యశ్రీ రాక హాస్పిటల్ సేవలు బంద్, యూరియా లేక వ్యవసాయం బంద్ అంటూ వ్యాఖ్యలు చేశారు.

**బుల్డోజర్ గుర్తు పెట్టుకోండి..** 'మా హయాంలో గ్రూప్1పేపర్ లీక్ అయిందని తెలిస్తే పరీక్ష రద్దు చేశాం. నీ హయాంలో అవకతవకలు జరిగితే ఎందుకు రద్దు చేయవు ఎవరిది నియంత పాలన. రేవంత్ రెడ్డి పాలనలో కుటుంబ పాలన లేదంటే కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, సృజన్ రెడ్డి నవ్వుతారు. రేవంత్ రెడ్డి బామ్మర్ది సృజన్ రెడ్డికి మరో రెండు కాంట్రాక్టులు ఇచ్చారు. రేవంత్ రెడ్డి పని దోచుకోవడం డిల్లీకి మూటలు పంపడం' అంటూ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ 3 సర్వేలు చేయించిందన్నారు.

మూడ సర్వేల్లోనూ బీఆర్ఎస్ గెలుస్తుందని రిపోర్ట్ వచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ చేయి గుర్తు తీసేసి.. బుల్డోజర్ గుర్తు పెట్టుకోవాలని కేటీఆర్ హితవుపలికారు.

## ఆరోగ్యశ్రీ సేవలను యథాతథంగా కొనసాగించాలి: దామోదర రాజనర్సింహ



హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలను యథాతథంగా కొనసాగించాలని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్‌ను తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కోరారు. గత తొమ్మిదిన్నరేళ్లలో చేయని సమ్మె ఇప్పుడు ఎందుకు చేయాల్సి వస్తోందని ప్రశ్నించారు. "గత ప్రభుత్వంలో నెలకు రూ.50కోట్లు కూడా రిలీజ్ అవ్వలేదు. మేం రూ.100 కోట్లు ఇచ్చేందుకు అంగీకారం తెలిపాం. ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో లేకపోవడంతో మేం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నాం. ప్రజలకు ఆరోగ్య సేవలో ఎలాంటి అంతరాయం కలగదు" అని దామోదర రాజనర్సింహ తెలిపారు.




## నిరుద్యోగులకు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మద్దతు.. హామీలు నెరవేర్చాలని డిమాండ్

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రకారం యువతకు ఉద్యోగ అవకాశాలు భర్తీ చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇవాళ(బుధవారం) ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా గన్‌పార్క్ వద్ద ఉన్న అమరవీరుల స్తూపానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు భర్తీ చేయాలని నిరుద్యోగ యువత చేస్తున్న డిమాండ్ సరైనదే అని ఎమ్మెల్యే తెలిపారు. నిరుద్యోగులకు దారి చూపించే బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. నిరుద్యోగులను కాపాడుకునే బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. గ్రూప్-1 అవకతవకలపై ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తామని చెప్పారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత కష్టాల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌ను గద్దె దించడంలో యువత పాత్ర కీలకమని పేర్కొన్నారు. అమరవీరుల సాక్షిగా నిరుద్యోగులకు అండగా ఉంటానని తెలిపారు. వారి సమస్యలు వినేందుకు తానే వస్తానని వివరించారు. నిరుద్యోగుల నిరసనలకు తన పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు ఆయన ప్రకటించారు. నిరుద్యోగుల పట్ల ఏ సమస్య ఎదురైనా దానిని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్తానని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రాంతానికి అన్యాయం జరగవద్దని సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి గుర్తు చేశారు.

# ఫీజు రీయింబర్స్మెంట్ సంక్షోభం...సమయ పాలనలో ప్రభుత్వ వైఫల్యం

## ఆందోళనలో విద్యార్థులు, ఆలస్యమవుతున్న ప్రభుత్వ చర్యలు

## విద్యార్థుల కోసం పథకమా, రాజకీయాల కోసం వాగ్దానమా?

## విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ పథకంపై నీలి నీడలు




విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ పథకం తెలుగు రాష్ట్రాల్లో విద్యా రంగంలో ఒక పెద్ద సంస్కరణగా నిలిచింది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఉన్నత విద్య అందుబాటులోకి రావాలనే ఉద్దేశంతో 2008లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి దీన్ని ప్రవేశపెట్టారు. ప్రారంభంలో రెండు వేల కోట్ల రూపాయల వ్యయం ఉండగా, కాలక్రమంలో విద్యార్థుల సంఖ్య పెరగడం, కోర్సుల విస్తరణ జరగడం వల్ల ఇది ఏటా ఎనిమిది నుండి పది వేల కోట్ల వరకు చేరింది. ఈ పథకం ద్వారా ఇంజనీరింగ్, మెడిసిన్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ తదితర కోర్సుల్లో చదివే సుమారు ఇరవై లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందారు. ఇంజనీరింగ్ కళాశాలల్లోనే ఏడు నుండి ఎనిమిది లక్షల మంది విద్యార్థులు పూర్తిగా ఈ పథకం ఆధారంగానే చదువులు కొనసాగించారు. మొదట్లో ఇది సామాజిక సమానత్వానికి దారి తీసే గొప్ప ఆలోచనగా నిలిచింది కానీ చెల్లింపులు ఆలస్యమవడం, బడ్జెట్ కేటాయింపులు తగినంతగా లేకపోవడం వల్ల సమస్యలు తలెత్తాయి. ప్రభుత్వం నుంచి సమయానికి నిధులు రాక విద్యాసంస్థలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నాయి. ఉపాధ్యాయులకు జీతాలు ఆలస్యమయ్యాయి, లైబ్రరీలు, లాబ్‌లు వంటి మౌలిక సదుపాయాల నిర్వహణ దెబ్బతింది. నాణ్యత తగ్గిపోవడంతో పాటు అనేక కళాశాలలు మూతపడ్డాయి. గత దశాబ్దంలో రెండు వందలకు పైగా ఇంజనీరింగ్, ఫార్మసీ, డిగ్రీ కళాశాలలు తలదాచుకోలేక మూసివేయబడ్డాయి. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో విడివిడిగా అమలు చేసినప్పటికీ రెండు రాష్ట్రాల్లోనూ బకాయిలు వేల కోట్లలో పేరుకుపోయాయి. ఈ నేపథ్యంతో విద్యార్థుల ఆందోళనలు తెలంగాణలో మరింత ఉధృతమయ్యాయి. బకాయిలు సకాలంలో చెల్లించాలని, కాలేజీల ఆర్థిక సంక్షోభం పేరుతో విద్యార్థులు నష్టపోకూడదని విద్యార్థి సంఘాలు నిరసనలు వ్యక్తం చేశాయి. కళాశాల యాజమాన్యాలకు కాకుండా నేరుగా విద్యార్థుల ఖాతాల్లో ఫీజు రీయింబర్స్మెంట్ డబ్బులు జమచేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై తెలంగాణ ప్రభుత్వం కూడా కొత్త ఆలోచనతో ముందుకు వచ్చింది. విద్యాసంస్థలకు కాకుండా నేరుగా విద్యార్థుల వ్యక్తిగత ఖాతాల్లోనే నిధులు జమ చేసే విధానం పరిశీలనలో ఉంది. దీని వల్ల డబ్బుల దుర్వినియోగం తగ్గి విద్యార్థులకే ప్రయోజనం నేరుగా అందుతుంది. అయితే ఇలాంటి విధానం అమలు చేయాలంటే విద్యార్థులు నిజంగా కళాశాలల్లో చేరారన్నది, వారు తరగతులు హాజరవుతున్నారన్నది, కోర్సులు కొనసాగిస్తున్నారన్నది కచ్చితంగా నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. లేకుంటే ఈ సదుపాయం కూడా లోపాల పాలయ్యే ప్రమాదం ఉంటుంది. ప్రస్తుతం తెలంగాణలో సుమారు ఎనిమిది వేల కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయని యాజమాన్యాలు చెబుతుండగా, విద్యార్థులు విద్య కొనసాగించడానికి తల్లిదండ్రులు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి వెనుకాడుతున్నాయి. ఫలితంగా అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. మరోవైపు చెల్లింపులు ఆలస్యమవడం వల్ల ఉపాధ్యాయులు జీతాలు సమయానికి పొందలేక నిరాశలో ఉన్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# సోషల్ మీడియాలో ఆ పోస్టులు పెట్టారో ఇక అంతే !



సోషల్ మీడియా ఈ రోజు మెయిన్ స్ట్రీం మీడియాను సైతం అధిగమించి ముందుకు సాగుతోంది. ఇది ఒక సామాజిక విప్లవంగా ఉంది సామాన్యుడే పాత్రికేయుడు అయిన వైనంగా ఉంది.

ఇదివరకూ మీడియాలో పేరు చూసుకోవాలంటే ఎంతో చేయాల్సి వచ్చేది. కానీ ఈ రోజు తామే ఒక మీడియాగా ప్రతీ ఒక్కరూ మారిపోయిన పరిస్థితి ఉంది ఒక విధంగా అంతా మెచ్చాల్సింది ఇది. ఆహ్వానించాల్సిన పరిణామం కూడా ఇది.

**పదునైన అస్త్రంగా :** అయితే చిత్రమేంటి అంటే మంచితోనే చెడు ఉంటుంది. కత్తితో కూర తరగవచ్చు పీక కూడా కోయవచ్చు అన్నట్లుగా సోషల్ మీడియా ఆరంభంలో వింతంగా ఉంటూ మంచిగానే కనిపించింది కానీ తరువాత అది చిత్రాతిచిత్రమైన మలుపులు తిరుగుతోంది. చేతిలో పవర్ ఫుల్ ఆయుధంగా ఉండాల్సిన దానిని కోరి పాడు చేసుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. తమ వెతలు తమ కథలు తమ బాధలు తమ గొప్పలు తమ ప్రతిభలు తమ చుట్టూ ఉన్న వారి జీవితాలు ఇలా ఎన్నో చెబుతూ పది మందిలోకి విషయం వెళ్ళేలా చేయాల్సిన సోషల్ మీడియా కాస్తా వ్యక్తిత్వ హననాలకు తిట్లకు చీవాట్లకు అనుచితమైన భాషకు కేరాఫ్ గా మారుతోంది.

**అందరూ బాధితులే :**దాంతో సోషల్ మీడియాకు అందరూ బాధితులే అయిపోయారు. అంతే కాదు అందరూ ఏదో విధంగా ఈ పరిస్థితికి కారకులు అయిపోయారు. రాజకీయ పార్టీలకు విపరీతమైన ప్రచారం అవసరం. దాంతో సోషల్ మీడియా వారికి ఒక బ్రహ్మాండమైన వేదికగా మారింది. అదే సమయంలో బయట సాగినట్లుగా అక్కడ కూడా తిట్ల పురాణాలు వారిని వీరు వీరిని వారూ లంకించుకోవడంతోనే మొత్తం కథ అడ్డం తిరుగుతోంది. ఇంట్లో ఉన్న వారిని ఏ పాపం ఎరుగని ఆడవారిని సైతం సోషల్ మీడియా లాగి అన్యాయం చేస్తోంది. దాంతో దీనికి ఎక్కడో ఒక చోట ఫుల్ స్టాప్ పెట్టాల్సిన అవసరం ఉందని మేధావుల నుంచి అంతా అనుకునే నేపథ్యం ఉంది.

**మంత్రి వర్గ ఉప సంఘం :** సోషల్ మీడియా ద్వారా కావాలని మహిళలను కించపరచే వారి మీద చర్యలు తీసుకోవడానికి సంబంధించి విధి విధానాలను ఖరారు చేసేందుకు మంత్రి వర్గ ఉప సంఘాన్ని కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ ఉప సంఘంలో మంత్రులు వంగలపూడి అనిత, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, కొలుసు పార్ధసారధి ఉంటారు. దీని మీద ప్రభుత్వం ఒకటి రెండు రోజులలో అధికారిక ఉత్తర్వులు జారీ చేయనుంది అని అంటున్నారు. మహిళలను కించపరుస్తూ అసభ్యంగా పెట్టే పోస్టుల మీద ఏ రకమైన చర్యలు తీసుకోవాలి అన్న దాని మీద ఉప సంఘం అధ్యయం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది అని అంటున్నారు.

**అసెంబ్లీలో బిల్లుగా :** ఇక మూడు నెలల పాటు మంత్రివర్గ ఉప సంఘం ఈ విషయం మీద కసరత్తు చేసిన మీదట సమగ్రమైన నివేదికను ప్రభుత్వానికి అందచేస్తుంది. ఆ నివేదికను ఆధారంగా చేసుకుని అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో అంటే ఈ ఏడాది డిసెంబర్ లో అసెంబ్లీలో సోషల్ మీడియా పోస్టులు అసభ్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకునేలా పదునైన చట్టాన్ని తీసుకుని వస్తారు అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే గతంలోలా ఎవరిని పడితే వారిని పట్టుకుని పోస్టులు పెడుతూ రెచ్చిపోయే బ్యాచులకు ఇక కళ్ళెం పడినట్లే అంటున్నారు. పోస్టులు ఈ తరహావి పెట్టినా లేక వీడియోలు చేసినా అలా వీడియోలను అప్ లోడ్ చేసినా వైరల్ చేసినా వీరంతా ఇక మీదట చట్టానికి చిక్కి విలవిలలాడాల్సిందే అని అంటున్నారు.

# అందరూ సుఖ సంతోషాలతో ఉండేలా ప్రజాపాలన: పొన్నం ప్రభాకర్

సిద్దిపేట, సెప్టెంబర్ 17: జిల్లాలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ సాయుధ పోరాట, తెలంగాణ అమరవీరులకు జోహార్లు.. జై తెలంగాణ అంటూ మంత్రి తన ప్రసంగాన్ని ప్రారంభించారు. బైరాన్ పల్లి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించి వస్తున్నట్లు తెలిపారు. 1948 ఆగస్టు 27న వందలాది మంది అసువులు బాసిన అమరులకు నివాళులర్పించారు మంత్రి. సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రజా పాలన దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. తెలంగాణ ఉద్యమంలో నీళ్ళు, నిధులు, నియామకాలు ప్రజల ఆకాంక్షలతో ఏర్పడిన ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వంలో వారి ఆశయాలు ముందుకు తీసుకుపోతోందని చెప్పుకొచ్చారు. తెలంగాణ సాధన కోసం సకలజనులు పోరాడారని గుర్తుచేశారు. 2023 డిసెంబర్ 7న అందరి ఆశీర్వాదంతో ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిందని..ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని తెలిపారు. ఇప్పటి వరకు 200 కోట్లు ఉచిత ప్రయాణాలు దాటాయన్నారు. 'ఆరోగ్య శ్రీ 5 నుంచి 10 లక్షలకు పెంచుకున్నాం. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. 10 సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న రేషన్ కార్డులు అందించాం. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా మహిళా సంఘాల ద్వారా సున్నా వడ్డీ ద్వారా మహిళ పథకాలు అమలు చేస్తున్నాం. ప్రతి పౌరుడు సన్న బియ్యం తినాలని సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా 23 వేల కోట్ల రూపాయలు రైతు రుణమాఫీ చేశాం. సన్న వడ్లకి 500 బోనస్ ఇస్తున్నాం. 10 సంవత్సరాలుగా డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం ఎదురు చూశారు.. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. వెన్యూ ప్రక్షాళన చేస్తూ భూ భారతి తీసుకొచ్చాం. భూగ్రామ పరిపాలన అధికారులను నియమించాం. తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా పాడుకుంటున్నాం. చరిత్రలో నిలిచే విధంగా పెండింగ్‌లో ఉన్న అమరవీరుల స్థూపాన్ని పూర్తి చేస్తాం.. చాకలి ఐలమ్మ, తొలి తరం, మలితరం ఉద్యమకారులను గుర్తు చేసుకుంటున్నాం. తెలంగాణ కవులను కళాకారులను గౌరవించుకుంటున్నాం' అని మంత్రి వెల్లడించారు. సాధించుకున్న తెలంగాణలో అందరూ సుఖ సంతోషాలతో ఉండేలా ప్రజా పాలన అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం ఇస్తున్న కార్యక్రమాలు సూక్ష్మ స్థాయిలో ప్రజలకు చేరాలా అందించాలన్నారు. ముఖ్యమంత్రి చెప్తున్నట్టు గతంలో పేదలకు పంపిణీ చేయడానికి భూములు, నిధులు ఉండేవని.. ఇప్పుడు ప్రభుత్వం ఇవ్వగలిగేది సంపూర్ణ విద్య అని..100 శాతం అక్షరాస్యత అని.. విద్యకు ప్రథమ ప్రాధాన్యత ప్రభుత్వం అందిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# సాహిత్య దార్శనికుడు ఎస్వీ రామారావు

## తెలుగు విమర్శకు పునాదులు వేసిన మార్గదర్శి ఎస్వీ



తెలుగు సాహిత్యంలో దార్శనిక దృష్టిని, పరిశోధనా వైశిష్ట్యాన్ని సమన్వయ పరిచిన ఆచార్య ఎస్వీ రామారావు పేరు సాహిత్య విమర్శా సంప్రదాయంలో చిరస్మరణీయంగా నిలిచిపోతుంది. 1941 జూన్ 5న వనపర్తి జిల్లాలోని శ్రీరంగాపూర్ గ్రామంలో రామచూడమ్మ, వాసుదేవరావు దంపతులకు జన్మించిన ఆయన చిన్ననాటి నుంచే విద్యాభిలాష, సాహిత్యాసక్తి కలిగిన వ్యక్తిగా ఎదిగాడు. తెలుగు భాషా సాహిత్యంలో ఉన్నత విద్యను పూర్తి చేసి ఎం.ఫిల్., పి.హెచ్.డి. డిగ్రీలను పొందిన ఆయన విద్యా రంగంలో బోధనతో పాటు పరిశోధనలోనూ, విమర్శలోనూ, దార్శనికతలోనూ తనదైన ముద్ర వేశారు. ఆచార్య రామారావు పరిశోధన పర్యవేక్షకుడిగా అరుదైన ఖ్యాతి పొందారు. ఆయన మార్గదర్శకత్వంలో 19 పి.హెచ్.డి., 15 ఎం.ఫిల్. పరిశోధనలు పూర్తికావడం ఆయన పాండిత్యం, విశ్లేషణా సామర్థ్యం, శిష్యులపై చూపిన శ్రద్ధను స్పష్టంగా తెలియజేస్తుంది. శిష్యులకు ఆయన కేవలం అధ్యయన సహకారం మాత్రమే కాకుండా, ఆలోచనలో విస్తృత దృష్టి, విమర్శలో స్వతంత్ర వైఖరి పెంపొందించేలా మార్గనిర్దేశనం చేశారు. అందువల్ల ఆయన శిష్యులు తెలుగు విశ్వవిద్యాలయాల గోడలకే పరిమితం కాకుండా, దేశ విదేశాల్లోనూ తెలుగు సాహిత్య పట్ల గౌరవాన్ని పెంచారు. సాహిత్య విమర్శను సిద్ధాంతాత్మకంగా ఆవిష్కరించిన "తెలుగులో సాహిత్య విమర్శ" ఆయన ప్రధాన కృషి. ఈ గ్రంథంలో ఆయన పాశ్చాత్య విమర్శా సిద్ధాంతాల ప్రభావాన్ని విశ్లేషించి, తెలుగు విమర్శలోని అంతర్గత బలహీనతలను, బలాలను గుర్తుచేశారు. ఉదాహరణకు ు తెలుగు కవిత్వంలో రూపక, భావక వాదనల మధ్య పోరాటాన్ని, ఆధునికవాద-ప్రయోగవాద దృక్పథాల మధ్య తలెత్తిన విభేదాలను ఆయన శాస్త్రీయంగా పరిశీలించారు. అంతర్జాతీయ దృష్టితో తెలుగు విమర్శా పరిణామాన్ని వివరించిన ఇంగ్లీషు గ్రంథం "%ుష్ట్రవ జుజశీశ్రీబ్ఱశీఅ శీట ువశ్రీబస్త్రబ రాఱవతీఖతీఎ జతీఱఅఏఱంఎ%" ద్వారా తెలుగు సాహిత్యాన్ని ప్రపంచ సాహిత్య పటంలో ప్రతిష్ఠించారు. ఇది కేవలం పరిశోధనా గ్రంథం మాత్రమే కాకుండా, తెలుగు సాహిత్య విమర్శకు ఒక చరిత్రాత్మక పునాది వేసింది. ఆయన విమర్శా వ్యాస సంపుటాలైన "అన్వీక్షణం", "సమవీక్షణం", "అభివీక్షణం", "కావ్యామృతం" ఆయన సాహిత్య పటిమను ప్రతిఫలిస్తాయి. "గ్రంథావలోకనం"లో ఆయన విమర్శ పద్ధతి మరింత గాఢంగా ప్రతిబింబించింది. ఉదాహరణకు ు శ్రీశ్రీ కవిత్వాన్ని విశ్లేషించినప్పుడు ఆయన కేవలం రాజకీయ కోణంలోనే కాకుండా, శిల్ప వైశిష్ట్యం, వచన స్వాతంత్ర్యం, ప్రజా భావనల అనుసంధానాన్ని కూడా వివరించారు. అలా ఆయన విమర్శలో ఒక సమగ్ర దృష్టి ప్రతిబింబించింది. ఆకాశవాణి ప్రసంగాలను సమీకరించి వెలువరించిన "మనోవీక్షణం" ద్వారా సాహిత్యాస్వాదనను సర్వసాధారణ పాఠకులకు చేరువ చేశారు. క్లాసికల్ గ్రంథాలకు ఆయన చేసిన వ్యాఖ్యానాలు పరిశోధనా సంపదను విస్తరించాయి. "నన్నయ దర్శనం"లో ఆదిపర్వ అవతారికపై ఆయన చూపిన విశ్లేషణలో నన్నయ కేవలం కవి మాత్రమే కాక, ఒక దార్శనికుడు, సంస్కృత-తెలుగు సమన్వయకర్త అని చూపించారు. "కర్ణపర్వం" ద్వితీయాశ్వాసంపై ఆయన వ్యాఖ్యానం ద్వారా మహాభారతంలోని కర్ణుని వీరత్వం, దౌర్భాగ్యం, సామాజిక సత్యం మధ్యనున్న సంఘర్షణను లోతుగా చూపించారు. ఈ తరహా వ్యాఖ్యానాలు సాహిత్యానికే కాక, సమాజ తత్వానికీ వెలుగునిచ్చాయి. సాహిత్య ధోరణుల సమాలోచనలో ఆయన కృషి ప్రశంసనీయమైనది. "శతాబ్ది కవిత"లో నూరేళ్ల తెలుగు కవిత్వ పరిణామాన్ని ఆయన సమగ్రంగా విశ్లేషించారు. వాక్కు-ప్రయోగం, భావన-ప్రక్రియలలో చోటుచేసుకున్న మార్పులను, వచన కవిత్వ ప్రవాహంలో కొత్త కొత్త ప్రయోగాలను ఆయన సమీక్షించారు. కవులు తమ కవిత్వంతో సమాజాన్ని ఎలా అద్దం పట్టారో ఆయన విశ్లేషణ స్పష్టంగా చూపుతుంది. ఉదాహరణకు ు గురజాడ అప్పారావు నుండి వరకూ, వేమన నుండి ఆధునిక దళిత కవుల వరకు, ప్రతి కవి సమాజాన్ని ఒక కొత్త కోణంలో ఆవిష్కరించాడని ఆయన విశ్లేషణ పేర్కొంటుంది. సాహిత్య చరిత్రకు ఆయన చేసిన కృషి కూడా అపారమైనది. "నూటపది వసంతాల శ్రీకృష్ణదేవరాయాంధ్రభాషా నిలయం", "పాలమూరు సాహితీవైభవం", "విశ్వనాథ దర్శనం", "పాలమూరు ఆధునిక యుగకవుల చరిత్ర" వంటి గ్రంథాలు ఆయన స్థానికతతో పాటు సమగ్రతకు కూడా ప్రాముఖ్యం ఇచ్చిన విషయాన్ని తెలియజేస్తాయి. ముఖ్యంగా తెలంగాణ సాహిత్య వైశిష్ట్యాన్ని ప్రత్యేకంగా ప్రతిపాదించడం ఆయన ప్రత్యేకత. ఆచార్య ఎస్వీ రామారావు రచనల్లో తాత్విక విశ్లేషణ, సామాజిక దృష్టి, సాహిత్యాస్వాదన మేళవింపుగా కనిపిస్తాయి. సహచరులు ఆయనను పాండిత్యవంతుడిగానే కాక, సానుభూతితో నిండిన మార్గదర్శకుడిగా గుర్తించారు. ఆయన శిష్యులు ఆయనను "ప్రశ్నలను రేకెత్తించే గురువు"గా స్మరించుకున్నారు. ఆయన సాహిత్యాన్ని కేవలం చదివే వస్తువుగా కాకుండా, ఆలోచింపజేసే ప్రక్రియగా మార్చారు. తెలుగు సాహిత్య విమర్శకు పునాదులు బలపరిచినవాడిగా, దానికి కొత్త దారులు చూపినవాడిగా, సాహిత్యం ద్వారా మానవతా దృష్టిని పెంపొందించినవాడిగా ఆయన పేరు చిరస్మరణీయంగా నిలిచిపోతుంది. ఆయన కృషికి గుర్తింపుగా అనేక ప్రతిష్ఠాత్మక పురస్కారాలు వరించాయి. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ఉత్తమ విమర్శ పురస్కారం, సహృదయ సాహితీ పురస్కారం వరంగల్, విశ్వసాహితి విమర్శ పురస్కారం, దాశరథి పురస్కారం, ఉమ్మెత్తల అవార్డు మహబూబ్‌నగర్, జీవిఎస్ సాహితీపీఠం పురస్కారం, ఎర్రంరెడ్డి రంగనాయకమ్మ ధర్మనిధి పురస్కారం, ఇరివెంటి పురస్కారం, బూర్గుల రామకృష్ణారావు ప్రతిభా పురస్కారం, ధన్వంతరి ఫౌండేషన్ ఉగాది పురస్కారం, దివాకర్ల శతజయంతి పురస్కారం, వానమామలై జయంతి పురస్కారం, బి.ఎన్. శాస్త్రి స్మారక సాహితీ పురస్కారం, కొండేపూడి సుబ్బారావు పురస్కారం, తిరుమల శ్రీనివాసాచార్య ధర్మనిధి పురస్కారం, గురజాడ అప్పారావు సాహితీ పురస్కారం, సర్వవైదిక సంస్థానం (కరీంనగర్) ధర్మనిధి పురస్కారం, సనాతనధర్మ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతిభాపురస్కారం ఆయన గ్రహించిన ప్రధాన అవార్డులలో కొన్ని. ఈ అవార్డులు ఆయన పాండిత్యం, పరిశోధన, విమర్శా వైశిష్ట్యానికి లభించిన సముచిత గౌరవం. తెలుగు సాహిత్య రంగానికి ఆయన మృతి ఒక తీరని లోటు. బుధవారం ఉదయం ఆచార్య ఎస్వీ రామారావు అంతిమ శ్వాస విడవడం సాహిత్య లోకాన్ని విషాదంలో ముంచెత్తింది. ఆయన రచనలు, పరిశోధనలు, బోధన విధానం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచి, తెలుగు సాహిత్యాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవడానికి శాశ్వత మార్గదర్శకంగా నిలుస్తాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# ఆరోగ్యాన్ని ఆహారంలోనే వెతికే జాతీయ ఉద్యమం - పోషణ మహోత్సవం

## పోషణ మహోత్సవాలు - ఆరోగ్య భారతానికి దిశానిర్దేశాలు




ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 16 వరకు నిర్వహించే పోషణ మహోత్సవాలు దేశ వ్యాప్తంగా ప్రజలకు పోషకాహారం ప్రాముఖ్యతను చాటి చెప్పే ఒక జాతీయ ఉద్యమంగా నిలుస్తున్నాయి. కేవలం ఒక ఆరోగ్య అవగాహన కార్యక్రమమే కాదు, ఆరోగ్యకర భారత నిర్మాణానికి దోహదపడే సామాజిక సంకల్పం కూడా ఇవే. పోషకాహారం అనేది మనిషి శారీరక, మానసిక వికాసానికి పునాది. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, వృద్ధులు - ప్రతి వర్గానికి తగినంత సమతుల ఆహారం అందడం అత్యవసరం. దేశంలో ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో పిల్లల్లో వృద్ధి వెనుక బాటుతనం, రక్తహీనత, పోషక లోపాలు సమస్యలుగా ఉన్నాయి. ఈ సమస్యల పరిష్కారానికి ప్రజలలో చైతన్యం పెంపొందించడమే పోషణ మహోత్సవాల ప్రధాన లక్ష్యం. కేంద్ర ప్రభుత్వం ఈ మహోత్సవాలను ప్రధానమంత్రి పోషణ అభియాన్ లో భాగంగా చేపడుతోంది. ఈ యోజన 2018లో ప్రారంభమై పోషకాహార లోపాన్ని తగ్గించేందుకు సమగ్ర వ్యూహాన్ని అమలు చేస్తోంది. అనీమియా నివారణ, చిన్నారుల వృద్ధి పరిశీలన, గర్భిణీలకు మరియు బాలింతలకు ఐరన్, ఫోలిక్ ఆమ్ల మాత్రల పంపిణీ, డిజిటల్ ఆధారిత మానిటరింగ్ వంటి అంశాలు ఇందులో భాగమై ఉన్నాయి. కేంద్ర మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పోషణ ట్రాకర్ యాప్ ద్వారా దేశవ్యాప్తంగా లక్షలాది అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల పోషక స్థితి పర్యవేక్షిస్తున్నారు. పోషణ పఖ్వాడా, పోషణ మహోత్సవం వంటి వార్షిక కార్యక్రమాల ద్వారా విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కేంద్రానికి అనుసంధానమై తమ రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలు చిన్నారుల పోషకాహారంలో దేశానికి ఆదర్శంగా నిలిచాయి. ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో ప్రత్యేక అనీమియా నివారణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ మహోత్సవాల సమయంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు, పాఠశాలలు, వైద్య సంస్థలు, స్థానిక సంఘాలతో కలిసి విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాయి. వంట ప్రదర్శనలు, ఆరోగ్య శిబిరాలు, సేంద్రీయ పంటల ప్రదర్శనలు, శ్రీధాన్యాల ప్రాముఖ్యతపై చర్చలు, పోషకాహారంపై విద్యార్థుల వ్యాస పోటీలు వంటి అనేక వినూత్న కార్యక్రమాలు జరుగుతాయి. శుద్ధమైన తాగునీరు, పరిశుభ్ర వాతావరణం, వ్యక్తిగత పరిశుభ్రతపై కూడా ప్రజలకు శిక్షణ ఇస్తున్నారు. ఎందుకంటే పోషకాహారం శరీరానికి చేరాలంటే పరిశుభ్రత అత్యవసరం. పోషణ మహోత్సవాలు ప్రభుత్వాలు చేపడుతున్న ఒక వార్షిక కార్యక్రమమే కాకుండా, సమాజంలో ఆరోగ్యకర జీవన విధానానికి మార్గం చూపే ప్రజోద్యమం. ప్రతి కుటుంబం స్థానికంగా లభించే పప్పులు, పచ్చి కూరగాయలు, పండ్లు, గుడ్లు, పాలు, మిల్లెట్లు వినియోగించడం అలవాటు చేసుకోవాలి. ఆహారపు అలవాట్లలో ఈ మార్పులు రాబోయే తరాల ఆరోగ్యానికి మూలస్తంభంగా నిలుస్తాయి. పోషకాహార లోపాన్ని నిర్మూలించేందుకు ప్రభుత్వం, సమాజం, కుటుంబం - ఈ మూడింటి భాగస్వామ్యం తప్పనిసరి. సంపూర్ణ ఆరోగ్య భారతం సాధించాలంటే పోషణ మహోత్సవాలను కేవలం అవగాహన కార్యక్రమాలుగా కాక, జీవన విధాన మార్పుకు దారితీసే ఒక జాతీయ ఉద్యమంగా భావించి అందరూ చురుకుగా పాల్గొనాలి. ఇలాచేస్తేనే "స్వస్థ భారత్ - సమృద్ధ భారత్" సంకల్పం నిజమవుతుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

చురకలు

## సంపాదకీయం

# మహాఘట్ బంధన్ లెక్కతప్పుతోందా..? తేజస్వీ నిర్ణయం ఎవరికి లాభం..?

బిహార్ రాష్ట్రంలో ఈ నెల చివరి వరకు అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు వ్యూహ ప్రతి వ్యూహాలతో సిద్ధం అవుతున్నాయి. 'ఓట్ చోరీ' అంటూ ప్రచారం మొదలుపెట్టిన రాహుల్ గాంధీ ఇప్పుడు నెమ్మదించారు. ఎలక్షన్ కమిషన్, సుప్రీం కోర్టు మొట్టికాయలతో కాస్త నెమ్మదించారు. తేజస్వీ యాదవ్ పార్టీ రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) ఈ సారి అధికారం దక్కించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. మహాఘట్ బంధన్ స్థాపించి అందులో కాంగ్రెస్ లో కలిసి పోటీకి దిగుతుంది. నితీశ్ కుమార్ కు కొంత ఆదరణ తగ్గుతుండడంతో ఈ సారి ఎలాగైనా కుర్చీని సొంతం చేసుకోవాలని ఆర్ జేడీ భావిస్తోంది. కానీ రాహుల్ తో అంటీ ముట్టనట్లుగా వ్యవహరిస్తేనే సాధ్యం అవుతుందని అనుకుంటుంది. అందుకే రెండు రోజుల క్రితం తేజస్వీ యాదవ్ అన్ని అసెంబ్లీ సీట్లలో పోటీ చేస్తామని ప్రకటించారు. తేజస్వీ యాదవ్ నిర్ణయం కాంగ్రెస్ ను కలవరపెడుతోంది.

**బిహార్ లో ఆర్జేడీ బలమైన పార్టీ..** బిహార్ రాజకీయాల్లో ఆర్జేడీ బలమైన పార్టీ. లాలూ ప్రసాద్ యాదవ్ వారసత్వాన్ని తేజస్వీ యాదవ్ కొనసాగిస్తున్నారు. మైనారిటీలు, పేదలు, వెనుకబడిన వర్గాల మద్దతు ఆర్జేడీకి ఉంది. కాంగ్రెస్‌తో గతంలో పొత్తులు పెట్టుకున్నప్పటికీ, ప్రతి ఎన్నికలో సీట్ల కేటాయింపు విషయంలో ఇబ్బందులు ఎదురవుతూ వచ్చాయి. ఈసారి ఆర్జేడీ అన్ని సీట్లలో పోటీ చేస్తామని ప్రకటించడం.. కూటమి రాజకీయాల్లో పెను మార్పు సూచిస్తోంది.

**కాంగ్రెస్‌పై ప్రభావం..** రెండు దశాబ్దాలను పరిశీలిస్తే బిహార్‌లో కాంగ్రెస్ పార్టీ బలహీన పడుతూ వస్తోంది. ఆర్జేడీ వంటి బలమైన మిత్ర పార్టీ సహకారం లేకుండా ఎన్నికల్లో పోటీ చేయడం కాంగ్రెస్‌కు కష్ట సాధ్యం. ఆర్జేడీ నిర్ణయం వల్ల కాంగ్రెస్ ఓటు చీలే పరిస్థితి ఏర్పడుతుంది. అంటే, కూటమి లేకపోవడం వలన బీజేపీ లేదంటే జేడీయూ వంటి పార్టీలకు లాభం కలుగవచ్చు.

**సందిగ్ధంలో మహాఘట్ బందన్ భవిష్యత్తు..** ఐఎన్‌డీఐఏ కూటమి ఒకే వేదికపై కూర్చోడానికి ప్రయత్నిస్తున్న సమయంలో.. బిహార్‌లో ఈ విభేదాలు కూటమి భవిష్యత్తుకు పెద్ద సవాలుగా మారింది. తేజస్వీ ప్రకటన కూటమి ఐక్యతపై సందేహాలు రేకెత్తిస్తోంది. మరో వైపు ప్రజల్లో ప్రతిపక్షం విడిపోయిందనే భావన కలిగిస్తోంది. ఇది కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి అనుకూలంగా మారే అవకాశం లేకపోలేదు.

**ఆర్‌జేడీ లెక్కలు..** సుధీర్ఘ కాలం ఆర్ జేడీ కాంగ్రెస్ పార్టీతో కలిసి నడిచింది. ఇప్పుడు కూడా కలిసే ఉంది. కానీ ఈ ఎన్నికల్లో మాత్రం సీట్ల పంపకాల్లో పట్టువీడేది లేదని స్పష్టం చేసింది. తేజస్వీ నిర్ణయాన్ని పరిశీలిస్తే పార్టీ స్వతంత్రంగా ఎదగాలని అనుకుంటుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అసలు కాంగ్రెస్ పార్టీ క్షీణ దశలో ఉంది. ఏ పార్టీ కూడా దానితో పొత్తుకు సిద్ధంగా లేవు. ఈ నేపథ్యంలో తాము కూడా అంటీ ముట్టనట్లు ఉంటే పార్టీ భవిష్యత్తు మారుతుందని అనుకుంటున్నారు. ఇక తేజ్ ప్రతాప్, తేజస్వీ యాదవ్ నేతృత్వంలో యువ ఓటర్లను ఎక్కువగా ఆకర్షించాలని అనుకుంటుంది. గతంలో పొత్తు పెట్టకున్న సమయంలో సీట్ల విషయంలో తగువులు వచ్చేవి. ఎప్పుడూ కాంగ్రెస్ తక్కువ సీట్లు కేటాయించేది. కానీ ఈ సారి అది జరగదని తేజస్వీ ప్రకటన స్పష్టం చేస్తుంది.

**కాంగ్రెస్ కంటే ఆర్‌జేడీకి లాభం ఎక్కువ..** మహాఘట్ బంధన్ నుంచి ఇద్దరు నాయకులు పోటీ చేస్తే సాధారణంగానే ఓట్లు చీలుతాయి. ఫలితంగా బీజేపీకే లాభం చేకూరే అవకాశం లేకపోలేదు. ఈ విషయం తేజస్వీ యాదవ్ కు తెలుసు కానీ, ఆర్ జేడీకి సొంత ఓటు బ్యాంకు ఉంది. దీనితో కాంగ్రెస్ పార్టీ కంటే ఎక్కువ లాభం పొందుతామని ఆయన భావిస్తున్నారు.

# మారిషస్ దీవిలో భారత సంతతి శివసాగర్ రాంగులామ్ - సెప్టెంబర్ 18... మారిషస్ జాతిపిత - శివసాగర్ రాంగులామ్ జయంతి




ప్రపంచ దేశాలలో భారత కుటుంబాల మూలాలుగల వారు ఎందరో ఉన్నారు. దేశం నుండి వలస వెళ్ళి, పలు దేశాలలో రాజకీయాలలో రాణిస్తూ వివిధ పదవులు పొందిన, పొందుతున్న వారెందరో ఉన్నారు. అయితే ఒక దేశ రాజకీయాలను ప్రభావితం చేసి, రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగి, ఆ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి, విజయం సాధించి, దేశ తొలి ప్రధాని పదవిని పొందడం సామాన్య విషయం కానేకాదు. అలాంటి నేపథ్యం కలిగిన మహోన్నత వ్యక్తిగా చరిత్ర పుటల కెక్కిన అరుదైన, అపూర్వమైన, అనితర సాధ్యమైన ఘనత శివసాగర్ కే దక్కింది. మారిషసు ఆఫ్రికా ఆగ్నేయ తీరంలో 65 కి.మీ (40 మై) పొడవు, 45 కి.మీ (30 మై) వెడల్పు ఉంటుంది. ప్రారంభంలో డచ్చి కాలనీ (1630–1710) తరు వాత ఫ్రెంచి కాలనీ (1715 –1810)గా ఉండి తరువాత బ్రిటిషు కాలనీగా మారి 1968 వరకు బ్రిటిషు ఆధీనంలో ఉండి తరు వాత స్వతంత్రం పొందింది. శివసాగర్ రాంగులామ్...మారిషస్ దేశపు అగ్ర రాజకీయ నాయకులు, స్వాతంత్ర్య సమర యోధులు, మానవతావాది. బ్రిటీష్ వలసపాలన నుంచి మారిషస్ ను విముక్తం చేసే ఉద్యమానికి నాయకత్వం వహించడంతో ఆయనను మారిషస్ జాతిపితగా భావిస్తుంటారు. అలాంటి మారిషస్ కు శివసాగర్ తొలి ముఖ్య మంత్రిగా, ప్రధాన మంత్రిగా పని చేశారు. మారిషస్ కు గవర్నర్ జనరల్ గానూ పని చేశారు. శివసాగర్ రాంగులామ్ మారిషస్ కు చెందిన భారత సంతతి వ్యక్తి. ఆయన తండ్రి మోహీత్ రాంగులామ్ బీహార్ కు చెందిన హరిగావ్ నుంచి మారిషస్ కు వలస వెళ్ళారు. మోహీత్ మారిషస్ లో కార్మికునిగా, మేస్త్రీగా పనిచేసేవారు. ఆయన బాస్మతీ రాంచరణ్ ని వివాహం చేసుకాగా, వారికి 1900 సంవత్సరంలో సెప్టెంబర్ 18న శివసాగర్ రాంగులామ్ జన్మించారు. శివసాగర్ మాతృభాష భోజ్ పురి కాగా హిందీ, సంస్కృతం వంటి భారతీయ భాషల్లో లోతైన అభినివేశం ఉండేది. హిందూ పురాణాలు, భారతీయ సంస్కృతి తదితర అంశాలపై ఆసక్తి, అవగాహన ఉండేది. పేద కుటుంబంలో జన్మించినా కష్టించి చదివి ఇంగ్లండు వెళ్ళి వైద్య విద్యను అభ్యసించి డాక్టర్ అయ్యారు. ఇంగ్లాండులో ఉండగా 1932లో రౌండు టేబులు సమావేశాలకు వచ్చిన మహాత్మా గాంధీని కలిశారు. మహాత్మాగాంధీ ఆయనను చాలా ప్రభావితం చేశారు. అలాగే జవహర్‌లాల్ నెహ్రూ, రాస్ బిహారి బోస్ వంటివారితో కూడా సన్నిహిత సంబంధాలు ఉండేవి. 1935లో రాంగులామ్ ఇంగ్లాండు నుండి మారిషస్ చేరుకున్నారు. అప్పటికే స్వాతంత్ర్య సముపార్జన గురించి ఆలోచనలు చేసిన రాంగులామ్ స్వదేశానికి తిరిగి వచ్చాక స్వాతంత్ర్యోద్యమానికి నాయకత్వం వహించారు. 1949లో మారిషస్ పార్లమెంట్ ఎన్నికల్లో ఆయన నాయకత్వం వహించిన లేబర్ పార్టీ విజయం సాధించింది. 1968లో మారిషస్ కు బ్రిటీష్ వలసపాలన నుంచి స్వాతంత్ర్యం లభించింది. శివసాగర్ రాంగులామ్ సుదీర్ఘ పోరాటం ఫలితంగానే మారిషస్ కు స్వాతంత్ర్యం లభించిందని చాలామంది చరిత్రకారులు, జనం భావిస్తుంటారు. శివసాగర్ రాంగులామ్ మారిషస్ ప్రజాదరణతో జాతి పితగా పేరొందారు. స్వాతంత్ర్య స్థితిగతులు ఏర్పడుతూండగా 1961లోనే శివసాగర్ మారిషస్ తొలి ముఖ్యమంత్రి అయ్యారు. ఆ పదవిలో 1968 వరకూ కొనసాగారు. దేశంలోని అన్ని వర్గాలను సమీకరించి అఖిల పక్ష ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తారన్న నమ్మకాన్ని కలోనియల్ ఆఫీస్ ఆయనపై పెట్టుకుంది, ఆ క్రమంలోనే 1965లో నైట్ హుడ్ గౌరవాన్ని పొందారు. 1968లో మారిషస్ కు స్వాతంత్ర్యం వచ్చాక ప్రధాన మంత్రి పదవిలో కొనసాగారు. 1968 నుంచి 1982 వరకూ వరుస ఎన్నికలను ఎదుర్కొంటూ సంకీర్ణ ప్రభుత్వాలను నిలబెట్టుకుని ప్రధాన మంత్రిగా సుదీర్ఘకాలం కొనసాగారు. 1982 సాధారణ ఎన్నికల్లో మారిషస్ మిలిటెంట్ మూమెంట్ (ఎంఎంఎం) భాగస్వామ్య పక్షాల చేతిలో ఓటమి చెందారు. మిలిటెంట్ సోషలిస్ట్ మూమెంట్ పార్టీకి చెందిన మరో తెలుగు ప్రాంత మూలాలు కలిగిన అనిరుధ్ జగ్నాథ్ ప్రధాని అయ్యారు, అయితే కొద్ది కాలానికే చీలికలు రావడంతో ప్రభుత్వం కూలిపోయింది. శివసాగర్ రాంగులామ్ తన పార్టీ జగ్నాథ్ యొక్క మిలిటెంట్ మూమెంట్ పార్టీని సమర్థించారు. జగ్నాథ్ ఎన్నికై ప్రధాని కావడంతో శివసాగర్ సహకారానికి ఫలితంగా ఆయనను గవర్నర్ జనరల్ గా నియమించారు. గవర్నర్ జనరల్ పదవిలో ఆయన 1985లో మరణించేంత వరకూ కొనసాగారు. మారిషస్ గవర్నర్ జనరల్ గా ఉన్న సమయంలోనే 1985లో అధికారిక నివాసంలోనే శివసాగర్ రాంగులామ్ మరణించారు. శివసాగర్ కుమారుడు నవీన్ రాంగులామ్ లేబర్ పార్టీ నాయకత్వాన్ని స్వీకరించారు. నవీన్ 1995లోనూ, 2005లోనూ రెండు మార్లు ప్రధానమంత్రి పదవి చేపట్టి దాదాపుగా 15 సంవత్సరాలు మారిషస్ ను పరిపాలించారు. శివసాగర్ రాంగులాం పేరిట పలు స్మారిక చిహ్నాలు రూపు దిద్దుకున్నాయి. మారిషస్ లోని ప్రధాన విమానాశ్రయానికి సర్ శివసాగర్ రాంగులామ్ అంతర్జాతీయ విమానాశ్రయంగా నామకరణం చేశారు. మారీషియన్ రూపాయి నాణేలు అన్నిటిపైనా శివసాగర్ రూపం ఉంటుంది, అలానే అత్యధిక కరెన్సీ అయిన రెండు వేల మారిషయన్ రూపాయల నోటుపైన కూడా ఆయన బొమ్మ ముద్రించి ఉంటుంది. మారిషస్ లో పలు ప్రాంతాలు – పార్కులు, రోడ్లకు ఆయన పేరు పెట్టారు. పోర్ట్ లూయిస్ నగరంలో, భారత దేశంలో శివసాగర్ పూర్వుల ప్రాంతమైన బీహార్ రాజధాని పాట్నాలోనూ స్మారక చిహ్నాలు నిర్మించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# పర్యావరణ పరిరక్షణకు, సుస్థిర భవిష్యత్తుకు వెదురే మార్గం


## ప్రకృతికి వరం, మానవునికి ఆధారం...వెదురు - సెప్టెంబర్ 18...ప్రపంచ వెదురు దినోత్సవం:

ప్రపంచ వెదురు దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 18న ప్రపంచ వ్యాప్తంగా జరుపు కుంటారు. ఈ రోజును వెదురు ప్రాముఖ్యతను తెలియ జేయడం, దాని వినియోగాన్ని ప్రోత్సహించడం, పర్యావరణ పరిరక్షణలో దాని పాత్రను గుర్తు చేయడం ప్రధాన లక్ష్యంగా ఏర్పాటు చేశారు. 2009లో థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో జరిగిన ఎనిమిదవ ప్రపంచ వెదురు కాంగ్రెస్ సందర్భంగా ప్రపంచ వెదురు సంస్థ దీనిని అధికారికంగా ప్రకటించింది. అప్పటి నుంచి ప్రపంచ దేశాలు, ముఖ్యంగా ఆసియా దేశాలు, ఈ దినోత్సవాన్ని విశేషంగా పాటిస్తున్నాయి. వెదురు ఒక గడ్డి జాతికి చెందినప్పటికీ చెట్లంత ఎత్తుగా పెరిగి మానవ జీవన విధానంలో కీలక పాత్ర పోషిస్తున్నది. దీనిని అద్భుత మొక్క అని, పేదల ఉక్కు అని పిలవడం దాని బహుముఖ వినియోగాల వలన. రోజుకు కొన్ని అడుగుల వరకు పెరిగే వేగవంతమైన పెరుగుదలతో పాటు ఇతర చెట్ల కంటే ఎక్కువ ఆక్సిజన్ విడుదల చేస్తూ వాయు మండలంలో ఉన్న కార్బన్ డయాక్సైడ్‌ను అధికంగా గ్రహించడం ద్వారా పర్యావరణ సమ తుల్యతకు విశేష సహాయం చేస్తుంది. భూసారాన్ని కాపాడడం, వరదల ప్రభావాన్ని తగ్గించడం, నేలలో తేమ నిల్వ ఉంచడం వంటి ప్రకృతి సంరక్షణలో కూడా వెదురు ఒక అద్భుతమైన సహజ వనరుగా నిలుస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా వెదురుకు 1200కుపైగా జాతులు ఉన్నాయి. వాటిలో సుమారు 136 జాతులు భారతదేశం లోనే లభ్యమవు తున్నాయి. అసోం, త్రిపుర, మణిపూర్, మేఘాలయ, అరుణాచల్ వంటి ఈశాన్య రాష్ట్రాలు వెదురు సమృద్ధిగా పెరిగే ప్రాంతాలుగా గుర్తింపు పొందాయి. నేషనల్ బాంబూ మిషన్ నివేదిక ప్రకారం భారత దేశంలో సుమారు




13.96 మిలియన్ హెక్టార్ల విస్తీర్ణంలో వెదురు పెరుగుతోంది. ఈ విస్తీర్ణంలో సగం కన్నా ఎక్కువ భాగం ఈశాన్య రాష్ట్రాల్లోనే ఉంది. భారతదేశ వెదురు ఉత్పత్తి ప్రపంచ ఉత్పత్తిలో దాదాపు 45 శాతం ఉండటం విశేషం. గ్రామీణ జీవన విధానంలో వెదురు ఒక అవిభాజ్య భాగంగా నిలుస్తూ ఇళ్ల నిర్మాణం, చిన్న వంతెనలు, నీటి కాల్వలు, మేడలు, బావులు, గోడల కట్టడాలు అన్నీ వెదురుతోనే సాధ్యమవు తున్నాయి. లక్షలాది మంది వడ్రంగులు, బుట్టల కార్మికులు, పూలమాలలు చేసే వృత్తిదారులు, పతంగి తయారీ దారులు, నూలు వృత్తి నిపుణులు, వాయిద్య కారులు ఉపాధి కోసం వెదురు పైనే ఆధారపడి ఉన్నారు. కాగితం పరిశ్రమలో వెదురు ముడి సరుకుగా ఉపయోగ పడుతుండగా, ఆధునిక కాలంలో ఫర్నిచర్, అంతర్గత అలంకరణ వస్తువులు, ఫ్లోరింగ్, బట్టలు, వంట పాత్రలు, టూత్ బ్రష్‌లు, బొమ్మలు, సంగీత వాయిద్య పరికరాలు వంటి ఎన్నో వస్తువులు కూడా వెదురు తోనే తయారవు తున్నాయి. అంతేకాక వెదురు మొగ్గలు ఆసియా దేశాల్లో ఆహారంగా వినియోగించ బడుతూ పోషక విలువలతో కూడిన ప్రత్యేకమైన పదార్థంగా గుర్తింపు పొందాయి. వెదురు పర్యావరణ పరిరక్షణలో అపూర్వ సహాయం చేస్తుంది. భూమి తాపాన్ని తగ్గించడం, గాలి నాణ్యతను మెరుగు పరచడం, వాతావరణ మార్పుల దుష్ప్రభావాలను నియంత్రించడం వంటి అనేక విధాలుగా తోడ్పడుతుంది. మూడేళ్ల లోనే పూర్తిగా ఎదిగే వెదురు వేగవంతమైన పచ్చదన విస్తరణకు కారణమవుతుంది. ఈ కారణంగానే పర్యావరణ శాస్త్రవేత్తలు వాతావరణ సంక్షోభానికి వెదురును సమర్థవంతమైన పరిష్కారంగా సూచిస్తున్నారు. గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, చిన్నతరహా పరిశ్రమల విస్తరణలో కూడా వెదురు ఒక కీలక వనరుగా మారింది. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ సంఘాలు వెదురుతో మరిన్ని పర్యావరణ అనుకూల ఉత్పత్తులు తయారు చేయడానికి, పరిశ్రమలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నాయి. మొత్తం మీద వెదురు మానవ జీవన విధానం, పర్యావరణ సమతుల్యత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, సుస్థిర అభివృద్ధి అన్నీ కలిపిన జీవనాధారమని చెప్పవచ్చు. యుగాలుగా మానవుడి జీవితంలో భాగమైన ఈ ఆకుపచ్చ బంగారాన్ని సంరక్షించడం, విస్తరించడం మన అందరి బాధ్యత. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 18న జరుపుకునే ప్రపంచ వెదురు దినోత్సవం ఈ బాధ్యతను మనకు గుర్తుచేస్తూ పచ్చదనానికి, భవిష్యత్తు తరాల భద్రతకు మనం కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిస్తోంది. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# నీటి పరిరక్షణ సామాజిక బాధ్యత - సెప్టెంబర్ 18...ప్రపంచ నీటి పర్యవేక్షణ దినోత్సవం




నీరు ప్రకృతిలో ఉన్న సమస్త జీవులకు ప్రాణాధారము. ప్రకృతి సమస్త జీవులకు ప్రసాదించిన ఒక అపరూపమైన పదార్థము. మనిషి జీవించడానికి గాలి ఎంత అవసరమో నీరూ అంతే అవసరం. నీరే లేకపోతే పచ్చని చెట్లు, పారే నదులు, జీవులు, మహాసముద్రాలు ఏమీ ఉండవు. ఇవేమీ లేకుండా ఎండిపోయిన మట్టి గడ్డలా ఉంటుంది భూమి. భూమిమీద వృక్షాలు, జంతువులు, మానవాళి మనుగడకు, వాటి పెరుగుదలకు గాలి తరువాత ముఖ్యమైనది నీరు. అంతటి అమూల్యమైన నీటి విలువను తెలుసుకోడానికి, దానిని వృథా చేయకుండా అవగాహన కల్పించడానికి ఉద్దేశించి ప్రపంచ నీటి పర్యవేక్షణ దినోత్సవం ప్రతి సంవత్సరం సెప్టెంబరు 18న నిర్వహించ బడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నీటి వనరులను పరిరక్షించడంలో ప్రజలకు అవగాహన పెంపొందించడం ఉద్ధేశ్యంతో ఈ దినోత్సవం జరుపబడుతుంది. 2003లో అమెరికా యొక్క క్లీన్ వాటర్ ఫౌండేషన్ (ఎసిడబ్ల్యుఎఫ్) ప్రపంచ విద్యా కార్యక్రమంలో భాగంగా ప్రపంచ నీటి పర్యవేక్షణ దినోత్సవాన్ని ఏర్పాటు చేసింది. దేశాలలోని నీటి వనరులను పునరుద్ధరించడానికి, రక్షించడానికి 1972, అక్టోబరు 18న యునైటెడ్ స్టేట్స్ దేశంలో ప్రవేశపెట్టిన పరిశుభ్ర నీటి చట్టం వార్షికోత్సవానికి గుర్తుగా ఒక నెలరోజుల ముందుగా సెప్టెంబరు 18న ఈ దినోత్సవం జరపాలని నిర్ణయించారు. భారత్‌లో సింధు నాగరికత, ఈజిప్టులో నైలు నది నాగరికత ఇలా ప్రపంచ నాగరికతలు నదీ తీరాలు, నీటి వనరులకు సమీప ప్రాంతంలో విలసిల్లాయి. మన చరిత్రంతా జలవనరులతోనే ముడిపడి ఉంది. నీటిని పరిరక్షించు కోవాలనే నినాదాన్ని ప్రాచీన నాగరికతలు వెల్లడించాయి. భారతీయులకు నీటి విలువ తెలుసు కనుకే నదులను పూజించే ఆచారం ఉంది. నీటిని పూజించి, నదులకు, చెరువులకు, జలాశయాలకు హారతులిస్తారు. నారం అంటే నీరు. నీటిలో ఉంటాడు కాబట్టి శ్రీమహావిష్ణువుకు నారాయణుడు అని పేరు. నీటినే రూపంగా స్వీకరించి విష్ణువు నీటి విలువను చెప్తున్నాడు. శివుడు ఏకంగా గంగను తన తలపై ధరించి గంగాధరుడయ్యాడు. నీటిని వృధా చేయడం సృష్టికి, భగవత్తత్వానికి, సమస్త ప్రాణకోటికి వ్యతిరేకమని పురాణాలు, ప్రాచీన గ్రంధాలు స్పష్టం చేస్తున్నాయి. నీరు మూడు రూపాలలో... ఘన రూపం అంటే మంచు గడ్డల రూపంలోను, ద్రవ రూపం, సముద్రాలు, నదులు, తటకములు మొదలగునవి, వాయు రూపంలో భూమండలం పై 71 శాతానికి పైగా ఆవరించి ఉంది. క్రొత్త క్రొత్త సమ్మేళన పదార్థముల తోను, విష పూరిత రసాయన పదార్థాల తోను నీరు కలుషితమౌతున్నది. అలా కలుషితమైన జలము జల చక్రము ద్వారా తిరిగి ఆవిరి రూపం ధరిస్తుంది. ఈ క్రమంలో ఆ జలం తనలోని ఇతర కలుషిత పదార్థములను, అనగా రసాయన పదార్థములను కూడా కలుపుకొని వాయు రూపంలో మేఘాలుగా మారి అక్కడి వాతావరణం అనుకూలించ గానే ద్రవించి తిరిగి వర్ష రూపంలో తిరిగి భూమిని చేరుతున్నది. ఆ కలుషిత మేఘాలు వర్షించినపుడు రంగులలో వర్షము కురవడము, ఆమ్ల వర్షాలు కురవడము సర్వ సాధారణము. దాంతో ప్రకృతికి అపార నష్టము జగురుతున్నది. జీవ వ్యవస్థలో నీరు మంచి ద్రావణి, ఇందులో చాలా వరకు లవణాలు కరుగుతాయి. అందుకే దాన్ని విశ్వవ్యాప్త దావణి అంటారు. ఇంచుమించు అన్ని జీవ రసాయనాలు నీటిలో కరుగుతాయి. ఇందువల్ల నీరు జీవ పదార్థాల రవాణాకు తోడ్పడుతుంది. నీటి ఎద్దడిని ప్రపంచంలో 80 దేశాలు ఎదుర్కొంటున్నాయి. గొంతు తడుపుకునే చుక్క నీటికోసం మైళ్లకు మైళ్లు నడిచి పోవాల్సిన పరిస్థితిలో కూడా ప్రజలు ఉన్నారు. మంచి నీల్లు దొరకక కుంటల్లో, గుంటల్లో అడుగు బొడుగు మురికి నీటినే తాగాల్సిన దుస్థితిలో ఎంతో మంది ఉన్నారు. వేసవిలో చాలా చోట్ల నీటి కొరత మూలంగా, కనీసం తాగు నీరు దొరకక ఎంతో మంది బిందెలతో బహు దూరం కిలో మీటర్ల వరకు నడిచి వెళ్లి త్రాగు నీటిని తెచ్చుకునే అనివార్య పరిస్థితులను చూస్తూనే ఉన్నాం. మంచినీటి కంటే సముద్రపు నీరు చాలా ఎక్కువ పరిమాణంలో ఉంది. మనం నివసించే భూగోళంలో ఉన్న నీటి వనరులలో 99% ఉన్నది ఉప్పునీరే. ఇది 97% సముద్రాల్లోనే ఉంది. మిగతాది నదులు, చెరువుల్లో ఉంది త్రాగడానికి పనికొచ్చే నీరు 1% మాత్రమే. ఇందులో చెరువుల్లో 0.86%, నదుల్లో 0.02% ఉండగా మిగిలినవి భూగర్భ జలాలు. ప్రపంచ వ్యాప్తంగా త్రాగడానికి ఉపయోగపడే నీరు 0.3% మాత్రమే. నీటితో జీవం అంకురించింది. ప్రకృతి మనుగడ నీటితోనే కొనసాగుతోంది. జీవవైవిధ్య పరిరక్షణ. జీవం జలంతోనే సాధ్యమవుతుంది. ఇవన్నీ తెలిసినా..నీటిని వృధా చేస్తున్నాం..నీటి వనరుల్ని వ్యర్థాలతో కలుషితం చేస్తున్నాం. ప్రపంచంలో కోట్లాది మంది తాగడానికి నీరు లేక దాహంతో అల్లాడి పోతుంటే..మనకు అందుబాటులో ఉన్న నీటిని వృధా చేస్తున్నాం. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే..2050 నాటికి ఈ భూమ్మీద తాగడానికి పుష్కలమైన నీరు ఉండనే ఉండదని. ప్రజలు స్నానాలు చేయడం మానేసి శరీరానికి రసాయనిక లేపనాలు రాసుకుంటారనీ..(కెమికల్ బాత్) వాటితోనే స్నానాలు చేస్తారనీ..దేశ సరిహద్దుల్లో కాపలా కాయాల్సిన సైనికులు నీటి వనరుల చుట్టు కాపలా కాసా పరిస్థితి ఉంటుందని.. తలంటు కోవడానికి నీరు సరిపోక ప్రజలందరూ బోడి గుండుతో జీవిస్తారనీ, స్త్రీ పురుషులందరూ రోజు తల షేవ్ చేసుకునే పరిస్థితి వస్తుందని దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వ్యాఖ్యానించారంటే పరిస్థితిని ఎలా ఉంటుందో అంచనా వేయొచ్చు. నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా.. ఉన్న నీటిని సద్వినియోగం చేసు కోవడం, వృథాను అరికట్టడం, పొదుపుగా వాడటం, పునర్వి నియోగం..తదితరాలన్నింటికీ ప్రాధాన్య మివ్వాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# భావి పౌరులకు విలువల విద్య

వెల్గటూరు: పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందింపజేసి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. దీని కోసం సోమవారం విద్యార్థులకు టీ–శాట్ విద్యా ఛానెల్‌లో ప్రత్యేక కార్యక్రమాల ప్రసారానికి చర్యలు చేపట్టారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితారాణి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి సందేశాన్ని ఇవ్వనున్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 గంటలకు ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఈ కార్యక్రమం ప్రసారం కానుంది.

**గతంలోనూ అమలు**

'విలువల విద్య, జీవన నైపుణ్యాల'ను ఒక ప్రధాన అంశంగా పాఠశాలలో ఒకటి నుంచి పదో తరగతి వరకు ప్రవేశ పెట్టడం ద్వారా హేతుబద్ధమైన పౌరులుగా ఎదుగుతారని భావించారు. ఉన్నత విలువలు, వైఖరులతో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి అవసరమైన పాఠ్యప్రణాళికను రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణా సంస్థ



రూపొందించింది. దీని ప్రకారం పిల్లలు స్వేచ్ఛగా మాట్లాడటం, ప్రశ్నించడం, ప్రతిస్పందించడం, విచక్షణతో వ్యవహరించేలా రాష్ట్ర విద్యా ప్రణాళికా పరిధి పత్రం 2011లోని రాష్ట్ర దృక్పథంలో పేర్కొన్నారు. తరగతులవారీగా ఉపాధ్యాయుల కరదీపికలను రూపొందించి పంపిణీ చేశారు.

**ప్రాథమిక స్థాయికి 12, ఉన్నత స్థాయికి 18 విలువలు**

స్వేచ్ఛ, సంతృప్తిగా జీవించడం, శీల నిర్మాణం, జీవన నైపుణ్యాలు, బాధ్యత వహించడం, పొదుపు చేయడం, ఆరోగ్య, పర్యావరణ విలువలు, సంస్కృతి, సంప్రదాయాలపట్ల గౌరవం, శాస్త్రీయ దృక్పథం, న్యాయం, శాంతి, కలిసిమెలిసి జీవించడం, శ్రమ విలువ, సేవాభావం, సమానత్వం–సోదర భావం, స్త్రీలపట్ల గౌరవం, జాతీయ భావన, దేశభక్తి, లౌకికతత్వం, మత సామరస్యం, ప్రజాస్వామ్య విలువల పట్ల గౌరవం.

**ఉద్దేశాలివే...** విలువలను పాఠ్యాంశానికే పరిమితం చేయకుండా అన్ని సబ్జెక్టులతో సమన్వయం చేస్తూ సామర్థ్యాలను మెరుగుపరచడంపై దృష్టి సారిస్తున్నారు. విజ్ఞానశాస్త్రం వంటి సబ్జెక్టులు బోధించేటప్పుడు విలువల విద్యను అనుసంధానం చేయనున్నారు. తద్వారా విద్యార్థులు చదువుతోపాటు వ్యక్తిగత, సామాజిక బాధ్యతను గుర్తించే వీలుంది.

**జిల్లాలవారీగా పాఠశాలలు**


జగిత్యాల 765
కరీంనగర్ 631
పెద్దపల్లి 532
సిరిసిల్ల 488

# అతివలకు ఆర్థిక చేయూత

సిరిసిల్ల : కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ఆర్థికంగా చేయూతను అందించేందుకు 'ఇందిరా మహిళా శక్తి' కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమాలకు సంబంధించిన కార్యాచరణను జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ తయారు చేసి, 11 రకాల యూనిట్లను ఏర్పాటు చేశారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు లబ్ధి చేకూరేలా కార్యాచరణ సిద్ధం చేశారు. దీనికి బ్యాంకు రుణాలతోపాటు స్త్రీనిధి రుణాలను అందిస్తున్నారు. మొదటి విడత విజయవంతం అయితే మరిన్ని యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

**1,16,538 మంది సభ్యులు**

మహిళా సంఘాల్లోని సభ్యులు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో వారికి బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు అందజేస్తోంది. జిల్లాలోని 12 మండలాల్లో 411 మంది వీవోలు ఉండగా, 10,038 సంఘాల్లో 1,16,538 మంది సభ్యులు ఉన్నారు. వీరిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం నిర్ణయించగా దానికి అనుగుణంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. చిరు



వ్యాపారాలు, పెరటికోళ్ల పెంపకం, పౌల్ట్రీ మదర్ యూనిట్లు, గేదెలు, ఆహార శుద్ధి పరిశ్రమలు, చేపల విక్రయం, పాల డైరీ, క్యాంటీన్‌లు, టెంట్‌హౌస్‌లతోపాటు జిల్లాలోని 9 మండలాలకు 9 బస్సులను అందించారు. మరో 3 బస్సులతోపాటు సోలార్ విద్యుత్తు ప్లాంట్లు, పెట్రోల్ బంకులు అందించడానికి ప్రణాళికలు రూపొందించారు.

**సద్వినియోగం చేసుకోవాలి** మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వం కల్పించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఇందిరా మహిళా శక్తి పథకం కింద వివిధ రకాల యూనిట్లను అందజేశాం. ప్రస్తుతం అందించిన యూనిట్లతోపాటు మహిళా సంఘాల సభ్యులతో సోలార్ విద్యుత్తు ప్లాంట్లు, పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రూపొందించాం. మహిళా సంఘాలకు మరో 3 బస్సులను అందజేయనున్నాం. శేషాద్రి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

# ఏళ్లుగా ప్రయాణానికి పాట్లు



తాండూరు : తాండూరు– హైదరాబాద్ ప్రధాన దారి నిర్మాణానికి పదహారేళ్లుగా అడ్డంకులు ఎదురవుతూనే ఉన్నాయి. నిధులు మంజూరై పనులు చేస్తున్న వేళ బిల్లులు రాకపోవడంతో అప్పట్లో గుత్తేదారు అసంపూర్తిగా వదిలేసి వెళ్లిపోయాడు. తాజాగా అదనపు నిధులు మంజూరు కావడంతో టెండరు దక్కించుకున్న ఓ సంస్థ గుత్తేదారు పనులు చేసేందుకు ముందుకు రాకపోవడంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. ఫలితంగా లక్షలాది మంది ప్రయాణికులు, వాహనదారులు గుంతల దారిలో నిత్యం నరకం అనుభవిస్తున్నారు.

**గుంతలతో తప్పని కష్టాలు..**

తాండూరు పట్టణం నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు వ్యాపారం, వివిధ పనులు, ఉద్యోగరీత్యా లక్షలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. పదహారేళ్ల కిందట ఒకే వరుస తారు దారి మాత్రమే ఉండేది. ఆ తరవాత రెండు వరుసలుగా మార్చేందుకు కాంగ్రెస్, భారాస ప్రభుత్వాలు సుమారు రూ.60 లక్షల నిధులు మంజూరు చేయడంతో వికారాబాద్‌కు చెందిన ఓ గుత్తేదారు పనులు ప్రారంభించారు. ఇరువైపులా మట్టి, కంకర, అక్కడక్కడా తారు వేసి రోడ్డు వెడల్పు చేశారు. బిల్లులు రాకపోవడంతో గుత్తేదారు పనులను మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయారు. దారి గుంతలమయంగా మారింది. పాలకులు మారుతున్నా.. దారి మాత్రం బాగు పడలేదు. ఇటీవల ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి రూ.101 కోట్ల నిధులు మంజూరు చేయించారు. పనులు దక్కించుకున్న గుత్తేదారు మాత్రం ముందుకు రావడం లేదు.

**హైదరాబాద్‌కు నాలుగు గంటల ప్రయాణం..**

వికారాబాద్ వరకు 40 కి.మీ., మన్నెగూడ జాతీయ రహదారి వరకు 10కి.మీ. మేర దారి అధ్వానమైంది. మన్నెగూడ నుంచి హైదరాబాద్ నగరంలోని తెలంగాణ పోలీసు అకాడమీ వరకు వాహనాలు నెమ్మదిగా ఒకదానివెంట ఒకటి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. తాండూరు నుంచి మన్నెగూడ వరకు గుంతలు, కంకర తేలింది. ఇటీవల ధారూరు–మంబాపూర్ మధ్యలో కొన్ని పనులు చేసినా.. మళ్లీ గుంతలు పడ్డాయి. నిత్యం లారీలు, బస్సులు, చిరువ్యాపార వాహనాలు తరుచూ మొరాయిస్తున్నాయి. ఖాంజాపూర్, కందనెల్లి వద్ద మూడు చోట్ల తారు పెకిలించి వదిలేయడంతో కంకర, దుమ్ముతో సతమతమవుతున్నారు. హైదరాబాద్ వెళ్లేందుకు నాలుగు గంటలకుపైగా సమయం పడుతోందని చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనులను వెంటనే ప్రారంభించేందుకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఈనెల 8న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి సమస్య వివరించారు. వారం రోజుల్లోగా పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే వివరించారు.

# యూరియా క్రమబద్ధీకరణ



గజ్వేల్: యూరియా కోసం మహాభారతమంత ప్రణాళికలు సాగుతున్నాయి. ఒకచోట కొట్టుకుంటున్నారు, మరోచోట ధర్నాలు చేస్తున్నారు ఇంకోచోట రాత్రంతా పంపిణీ కేంద్రం వద్ద పడుకుంటున్నారు. కాదేదీ అనర్హం అన్నట్టుగా చెప్పులు, కాగితాలు, పుస్తకాలు, ఖాళీ సంచులు, కర్రలు, రాళ్లను యూరియా టోకెన్ల వరుసలో పెడుతున్నారు. వానాకాలం సీజన్ పొడవునా రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. కిలోమీటర్ల పొడవునా గంటల కొద్దీ సమయం కర్షకులు బారులు తీరుతున్నారు. ఈ నేపథ్యంలో ఎరువు అధిక వినియోగాన్ని నియంత్రించి అర్హులైన రైతులకు సరిపడా యూరియా అందేలా ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుడుతోంది.

**పంపిణీ వ్యవస్థపై ఒత్తిడి**

వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తల సూచన మేరకు ఏ పంటకు ఎంత వేయాలనే అంశంపై పూర్తిస్థాయిలో లెక్కలు తీస్తున్నారు. అదే మోతాదులో సరఫరా చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. వచ్చే యాసంగి సీజన్లో కష్టాలు ఏర్పడకుండా ఉండేందుకు ఇప్పటి నుంచి చర్యలు చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. సాగు విస్తీర్ణాన్ని లెక్క కట్టి జిల్లాకు కేటాయింపులు జరుగుతున్నాయి. ఒకానొక సందర్భంలో ఇతర జిల్లాల రైతులు వస్తున్నారు. కొందరు ఇతర అవసరాలకు కొంటున్నారు. దీనివల్ల పంపిణీ వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతోంది. యూరియా కష్టాలు ఏర్పడుతున్నాయని అధికారులు గ్రహించారు. ఇలాంటి పరిస్థితులు అన్ని జిల్లాల్లో ఉన్నాయి.

వర్షాకాలంలో సాగు విస్తీర్ణం: 5,46,363 ఎకరాలు

**మరింత అవగాహన**

వచ్చే యాసంగి నుంచి ప్రతి రైతుకు సాగు చేసే పంటలకు ప్రతి ఎకరాకు రెండు బస్తాల యూరియా, ఒక లీటరు నానో యూరియా పక్కాగా అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఆధార్ కార్డు ఆధారంగా ఆన్‌లైన్లో నమోదు చేస్తారు. సాగు విస్తీర్ణంలో ఎకరాకు రెండు బస్తాల యూరియా పంపిణీ చేస్తారు. ఇంకోసారి వరుసలో నిలబడేందుకు వీలు ఉండదు. పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. ఎరువు ఇబ్బందులను పూర్తిస్థాయిలో నియంత్రించాలని ప్రభుత్వం భావిస్తోంది. రైతులకు నానో యూరియా వినియోగంపై మరింత అవగాహన కల్పిస్తారు. పూర్తి స్థాయిలో దీనినే విస్తృతం చేసేందుకు యోచిస్తున్నారు. నానోను తప్పకుండా ఇవ్వనున్నారు.

# బాల్యంలోనే బాధ్యతలు.. భవితకు బాటలు



పరిగి : చాలామంది తల్లిదండ్రులు కేవలం పిల్లల మార్కులే చూస్తున్నారు. పరీక్షలు అయ్యాక మార్కులు.. గ్రేడ్ల గురించే అడుగుతున్నారు. దీంతో విద్యార్థులు బట్టీ పడుతున్నారు. ఇతర విషయాల్లో మాత్రం వెనకబడుతున్నా పట్టించుకోవడం లేదు. ఇలాంటి విధానానికి పాఠశాల స్థాయి నుంచే స్వస్తి పలికేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోంది. జిల్లాలో 1,066 బడుల్లో 90,650 మంది ఉన్నారు.

**పలు అంశాల మెరుగుకు..:** విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, విలువల పెంపు, క్రమశిక్షణ, బృందస్ఫూర్తి, తోటి వారితో కలిసి మెలగడం వంటి అంశాల మెరుగుకు విద్యాశాఖ శ్రీకారం చుడుతోంది. బాల్యదశ నుంచే బాధ్యతలు అప్పగిస్తే భవిష్యత్తులో ఉత్తమంగా ఎదగడానికి అవకాశముంటుందని భావిస్తోంది. ప్రాథమికోన్నత, ఉన్నత, ఆదర్శ, కేజీబీవీల్లో 'హౌజ్ సిస్టమ్, స్టూడెంట్ కౌన్సిల్–స్కూల్' కార్యక్రమాన్ని చేపట్టేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటోంది. ఈనెల 5న సీఎం కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనికి సంబంధించి శాఖాపరంగా ఉత్తర్వులు జారీ కావడంతో శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారులు అన్ని పాఠశాలల ఉపాధ్యాయులతో జూమ్ సమావేశం నిర్వహించి విధివిధానాలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు, గ్రామస్థులతో ఏర్పాటు చేసే సమావేశంలో విద్యార్థులు బాధ్యతలను స్వీకరించనున్నారు.

**పాఠశాల కౌన్సిల్ ఏర్పాటు ఇలా..**

పాఠశాలలోని ఎక్కువ (10వ) తరగతి చదువుతున్న బాలబాలికలను హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్‌ను తీసుకోవాలి. అలాగే అదే పాఠశాలలో పైనుంచి తక్కువ 9వ తరగతి చదువుతున్న బాలబాలికలను డిప్యూటీ హెడ్‌బాయ్, గర్ల్‌గా నియమిస్తారు. కేజీబీవీల్లో మాత్రం 12వ తరగతి చదువుతున్న విద్యార్థినులను తీసుకోనున్నారు.

**క్లబ్‌ల నిర్వహణతో..** పాఠశాలల్లో పచ్చదనం, పరిశుభ్రత, బాలికా సాధికారిత, భద్రత, ప్రహరీ, డిజిటల్, లైబ్రరీ వంటి ఆరు రకాల క్లబ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ప్రార్థన, మధ్యాహ్న భోజన పర్యవేక్షణ, పరిశుభ్రత, తల్లిదండ్రుల సమావేశానికి వచ్చేలా ప్రోత్సహించడం, రోజువారీగా హాజరు, సమయపాలన, పుస్తక పఠనం తదితర వాటిని పర్యవేక్షించాల్సి ఉంది.

**బృందాలుగా విభజన..**

ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను భాగస్వాములను చేసేలా నాలుగు బృందాలుగా విభజించనున్నారు. వాటికి ప్రత్యేక రంగులు కేటాయించనున్నారు. ఇందులో అబ్దుల్ కలాం(ఎరుపు), శకుంతలా దేవి(ఆకుపచ్చ), సీవీ రామన్(నీలి), రవీంద్రనాథ్ ఠాగూర్(పసుపు) హౌజ్‌లుగా విభజించి ప్రతి పాఠశాల నుంచి కెప్టెన్, వైస్ కెప్టన్లను నియమించనున్నారు. ప్రతి హౌజ్‌కు ఒక టీచర్ మెంటార్‌గా ఉంటారు.

**క్రమశిక్షణ, నైతిక విలువలు.. – రేణుకాదేవి, జిల్లా విద్యాధికారిణి**

విద్యార్థుల బంగారు భవితకు చదువు ఒక్కటే ప్రామాణికం కాదు. అన్ని అంశాల్లోనూ విషయ పరిజ్ఞానం అవసరం. క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యత ప్రతి విద్యార్థికి ఆభరణాలుగా మారాలి.

# శివారు.. పారిశుద్ధ్యం బేజారు

వేములవాడ: వేములవాడ పట్టణంలోని శివారు కాలనీల నివాస ప్రాంతాల్లోని ఖాళీ ఇళ్ల ప్లాట్ల స్థలాలు, వీధులు మురుగు కూపాలకు నిలయంగా మారాయి. మరికొన్ని ప్రాంతాల్లో ముళ్ల పొదలు, చెత్తా చెదారంతో డంపు యార్డులుగా మారి దోమలు, పందులకు అడ్డాగా మారడంతో వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. పాములు సంచరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పట్టింపు కరవై..** వేములవాడ పట్టణంలోని శివారు ప్రాంతాల్లో చాలావరకు కొత్తగా కాలనీలు వెలుస్తుండటంతోపాటు ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. కానీ మురుగు కాలువలు, సీసీ రోడ్లు లేక వీధుల్లో మురుగు పారుతోంది. ఇళ్లను ఆనుకొని ఉన్న ఖాళీ స్థలాలు మురుగు కూపాలుగా, ముళ్లపొదలకు నిలయాలుగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఖాళీ ప్లాట్లలో వర్షం నీరు నిలిచి మురుగు కుంటలుగా మారి దుర్వాసన వెదజల్లుతున్నాయి. పిచ్చి మొక్కలు పెరిగి విష కీటకాలకు ఆవాసంగా మారాయి. ఖాళీ స్థలాలను యజమానులు శుభ్రంగా ఉంచుకోవాల్సి ఉండగా అవేవి పట్టించుకోకపోవడంతో చుట్టుపక్కల వారికి ఇబ్బందులు తప్పడం లేదు.

ఇటీవల మున్సిపల్ అధికారులు వంద రోజుల ప్రణాళిక అమలు చేశారు. పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. మంగళ, శుక్రవారాల్లో డ్రై డే పాటించినా పట్టణంలోని శివారు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడలేదు. సాయినగర్, విద్యానగర్, అంజనీనగర్, కోరుట్ల



వైపు బస్టాండ్, కోనాయిపల్లి రోడ్డు, న్యూఅర్బన్ కాలనీ శివారు, వరలక్ష్మి కాలనీ, రెండో బైపాస్ రోడ్డు, మహాలక్ష్మి వీధి, గుడి చెరువు కట్టకింద తదితర ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు అధికంగా ఉన్నాయి. సరైన మురుగు నీటి వ్యవస్థ లేక స్థానిక నివాస గృహాల పరిసరాల్లోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఖాళీ స్థలాల యజమానులకు గతంలో నోటీసులు ఇచ్చామని వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తెలిపారు. వంద రోజుల ప్రణాళికలో చాలాప్రాంతాల్లో పారిశుద్ధ్యం పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు.

**ప్లాట్లు కొని.. వదిలేసి**

వేములవాడ పట్టణం ఆధ్యాత్మిక పట్టణం కావడంతో ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసి తమ పేర రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. ఏళ్లు గడుస్తున్నా ఇళ్ల నిర్మాణాలు చేయక ఖాళీగా వదిలేయడంతో పిచ్చి మొక్కలు పెరిగి వర్షం నీరు నిలిచి ఇబ్బందులను తెచ్చి పెడుతున్నాయి. కొన్ని సందర్భాల్లో మున్సిపల్ అధికారులే ఖాళీ స్థలాల్లోని ముళ్ల పొదలను తొలగించి చదును చేసిన సందర్భాలున్నాయి.

**వేములవాడ పట్టణం వివరాలు**

వార్డులు 28
మొత్తం జనాభా 56 వేలు
నివాస గృహాలు 15 వేలు

# 'ఇరుకు' వంతెనలు.. 'ఇక్కట్లు'

కూసుమంచి : నిర్మించాం.. వదిలేశాం.. ఆపై ఎవరి జాగ్రత్త వారిదే అన్నట్టుంది జిల్లాలోని కాల్వలపై వంతెనల పరిస్థితి. నాగార్జున సాగర్ కాల్వలపై నాటి అవసరాల మేరకు నిర్మితమైన వాటిని అనంతర కాలంలో అవసరాలకు తగినట్టు విస్తరించిన దాఖలాలు లేవు. కనీసం రక్షణ ఏర్పాట్లు చేపట్టారా? అంటే అదీలేదు. వాహనాలు ప్రమాదవశాత్తు అదుపుతప్పి కాల్వల్లోకి దూసుకెళ్తూ ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నా ర.భ. శాఖ, జలవనరుల శాఖ పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఇటీవల ఖమ్మం గ్రామీణం మండలంలోని గొల్లగూడెం వద్ద సాగర్ కాల్వలో కారు దూసుకెళ్లి ఓ వ్యాపారి దుర్మరణం పాలయ్యారు.

1. పాలేరు ఔట్‌ఫాల్ రెగ్యులేటర్ వంతెన

పాలేరు జలాశయం నుంచి జిల్లాకు నీటిని అందించే గేట్లు ఉన్న వంతెనపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇరుకుగా ఉండే దీనిపై రక్షణ ఏర్పాట్లు లేక వాహనదారులు భయంభయంగా నడుపుతుంటారు. ఇటీవల బైక్‌పై వస్తున్న జలవనరుల శాఖ ఉద్యోగి దుర్మరణం చెందారు. ఎదురుగా వస్తున్న బస్సు డ్రైవర్ అతణ్ని తప్పించే క్రమంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. 40మంది ప్రయాణీకుల బస్సు కాల్వలోకి దూసుకెళ్లేది. ఆత్మహత్య చేసుకోవాలని



నిర్ణయించుకున్న వారికీ ఈ స్థలం వేదికగా మారింది.

2. జలవిద్యుత్తు కేంద్రం కాల్వ వంతెన...

పాలేరు జలాశయం నుంచి చిన్నతరహా జలవిద్యుత్తు కేంద్రానికి నీరందించే కాల్వ వంతెనపై ఇరువైపులా రక్షణ గోడ లేదా ఇనుప జాలీ ఏర్పాటుచేయాలి. జీళ్లచెర్వుకు చెందిన ఐదుగురు కుటుంబ సభ్యులిక్కడ ఆత్మహత్యకు పాల్పడ్డారు.

3. గొల్లగూడెం వద్ద..

వరంగల్ – ఖమ్మం రహదార్లోని గొల్లగూడెం వద్ద వంతెన ప్రమాద నిలయంగా మారింది. విస్తరణ జరిగినా రక్షణ ఏర్పాట్లు లేవు. గతంలో కాల్వపై కారు రివర్స్ చేస్తున్న సందర్భంలో అదుపుతప్పి దూసుకెళ్లింది. ముగ్గురు మృత్యువాత పడ్డారు.

4. నేలకొండపల్లి మూలమలుపులో..

నేలకొండపల్లి సమీపంలోని 16, 17 బ్రాంచి కాల్వ వంతెన ప్రాంతం మలుపు ఉండటంతో ప్రమాదకరంగా ఉంది. కూసుమంచికి నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే రహదారిలో వంతెన ఉంది.

5. జక్కేపల్లి, మేడేపల్లి ప్రాంతాల్లో..

కూసుమంచి మండలంలోని జక్కేపల్లి నుంచి రాజేశ్వరపురం వెళ్లే మార్గంలో ప్రధాన కాల్వ, పాలేరు కాల్వల వంతెనలపై, అదేవిధంగా నేలపట్ల – ముదిగొండ రోడ్డులో మేడేపల్లి వద్ద రక్షణ లేదు.

## మొక్కుల తాళాలు.. తెరిచేది కోరికలు

జమ్మికుంట : కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం బిజిగిరిషరీఫ్ దర్గాకు ప్రత్యేక ప్రాశస్త్యం ఉంది. 11వ శతాబ్దంలో నిర్మించిన ఈ దర్గాలో ఇస్లాం మత ప్రబోధకులు, విశ్వమానవ సమానత్వాన్ని చాటిన సయ్యద్ ఇంకుషావలి రహమతుల్లా అలై, ఆయన సోదరుడు సయ్యద్ అజ్మత్‌షావలి, వారి కుమారులు హజ్రత్ సయ్యద్ అక్బర్‌షావలి, ముర్తుజాషావలి సమాధులున్నాయి. వీరు జమ్మికుంట ప్రాంతాలు ప్రచారాలు నిర్వహించేవారు. ఇంకుషావలిని కొలిస్తే కోరికలు తీరుతాయనే నమ్మకం భక్తుల్లో ఇప్పటికీ ఉంది. కోరికలు తీరాలని ప్రార్థించి దర్గాలోని హుండీలకు ఇరువైపులా చిన్న చిన్న తాళాలను



కడతారు. వాటికి చిన్నపాటి గుర్తులు పెట్టుకుంటారు. కోరుకున్న కోరికలు తీరగానే దర్గాకు వచ్చి వారు కట్టిన తాళాన్ని తీసి హుండీల్లో వేస్తారు. తర్వాత దర్గా వద్ద ఇంకుషావలికి మాంసాహార బిర్యానీ సమర్పించి కుటుంబ సభ్యులతో కలిసి సామూహికంగా కందూరు విందు చేస్తారు. ఈ విధంగా కోరికలు తీరగానే తాళం తీసి కానుకలు వేసి సమాధులను చాదర్లతో అలంకరించి, కొందరు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారని దర్గా కమిటీ ఛైర్మన్ ఇక్బాల్ తెలిపారు. మానసిక రుగ్మతలు నయం కావడానికి, వివాహం అయ్యేందుకు, సంతానం కలిగేందుకు, ఉద్యోగాల కోసం పలు రకాలు కోరికలు తీరేందుకు ఈ విధంగా ప్రత్యేక ఆచారంలో మొక్కులు చెల్లించుకుంటున్నారన్నారు.

## అతివల జగతి.. ఆర్థిక ప్రగతి

ఆత్మకూరు : మహిళలు ఇంటి, వ్యవసాయ పనులకే పరిమితం కావడంలేదు. స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసుకుని ఆర్థిక సాధికారత సాధిస్తున్నారు. జిల్లాలోని 17 మండలాల్లో 14,875 ఎస్‌హెచ్‌జీల్లో 1,58,501 మంది సభ్యులు ఉన్నారు. వారంతా రూ.కోట్లల్లో రుణాలు పొంది తమకు అభిరుచి, ఆసక్తి ఉన్న రంగాల్లో పెట్టుబడులు పెట్టి శతశాతం వాయిదాలు చెల్లిస్తున్నారు. పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సుల నిర్వహణ, కిరాణ, వస్త్ర, డెయిరీ, దుస్తుల తయారీ, కుట్లు అల్లికలు, మెడికల్ షాపులు, వాహనాలు, హోటళు ,, పండ్లు, కూరగాయల, పిండిమర తదితర దుకాణాలు ఏర్పాటు చేసుకుని ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు. ఉత్తమంగా నడుస్తున్న కొన్ని సంఘాలపై కథనం.

**22 ఏళ్లుగా పొదుపు:**

చౌటుప్పల్ మండలం దామెరలో జీవనోపాధుల సంఘం పరిధిలో ప్రగతి సమభావన సంఘాన్ని 2003లో ఏర్పాటు చేసుకున్నారు. 22 ఏళ్లుగా క్రమం తప్పకుండా పొదుపు చేసుకుంటున్నారు. బ్యాంకు నుంచి పొందిన రుణాలతో టైలరింగ్, ఎంబ్రాయిడరీ, పండి వంటల తయారీ వంటి స్వయం ఉపాధిని ఏర్పాటు చేసుకున్నారు.

**రూ.20వేల నుంచి రూ.17లక్షలకు..**

ఆత్మకూరు(ఎం) మండలం పలెర్ల గ్రామంలో 2004లో మహిళలు మమత సమభావన సంఘంగా ఏర్పడ్డారు. ఎనిమిదిసార్లు అనుసంధాన రుణాలు పొందారు. 2004లో రూ.20 వేల రుణం పొందిన వారు రెండు నెలల క్రితం రూ.17 లక్షల బ్యాంకు లింకేజీ రుణం తీసుకున్నారు. స్త్రీనిధి నుంచి రూ.3 లక్షలకు పైగా పొందారు. మెడికల్ షాపు, కిరాణం, కారు, టైలరింగ్, పాడిపరిశ్రమ, ఆటో వంటి యూనిట్లు ఏర్పాటు చేసుకుని విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

సంస్థాన్ నారాయణపురం మండలం గుడిమల్కాపురంలో 1997లో ఐదు ఎస్‌హెచ్‌జీలతో ప్రారంభమై 29కి చేరుకోగా 304 మంది సభ్యులుగా ఉన్నారు. పొదుపు సొమ్ము రూ.40 లక్షల వరకు నిల్వ ఉంది. బ్యాంకుల నుంచి రూ.2 కోట్ల రుణాలు పొందారు.

**రూ.1.5 కోట్ల రుణం**: బీమగోని విజయ అధ్యక్షురాలు, శ్రీనిధి సంఘం గుండ్లగూడెం ఆలేరు మండలం గుండ్లగూడేనికి చెందిన శ్రీనిధి సమభావన సంఘం 1999లో 12 మంది సభ్యులతో ఏర్పడింది. నెలకి రూ.60 పొదుపుతో ప్రారంభించి, ప్రస్తుతం రూ.200 పొదుపు చేస్తున్నారు. బ్యాంకు, స్త్రీనిధి నుంచి రూ.1.5 కోట్ల వరకు రుణాలు పొంది ప్రగతి సాధించారు.

## నమూనా ఇక్కడ.. నిర్ధారణ ఎక్కడో!

నల్గొండ: జిల్లా కేంద్రంలోని ఓ ప్రముఖ డయాగ్నోస్టిక్ కేంద్రంలో ఓ రోగికి మూత్రాశయంలో రాయి ఉందని చెప్పారు. తక్షణమే శస్త్రచికిత్స చేయాలని సూచించారు. సదరు రోగికి అనుమానం వచ్చి వేరే డయాగ్నోస్టిక్ సెంటర్‌కు వెళ్తే అలాంటిదేమీ లేదని తేలింది. ఇలాంటి ఘటనలు జిల్లా కేంద్రంలో కోకొల్లలు. ఇవన్నీ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.నల్గొండ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రులకు చెందిన డయాగ్నోస్టిక్ సెంటర్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అనుమతులు పొందకుండా.. రిపోర్టులు అప్పటికప్పుడు స్వతహాగా వెల్లడించే అవకాశం లేకున్నా.. యథేచ్ఛగా వైద్యారోగ్య నిబంధనలను తుంగలో తొక్కి రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఎలాంటి రిజిస్ట్రేషన్ నంబర్లు, లైసెన్సులు లేకుండా డయాగ్నోస్టిక్ సెంటర్లు, కంప్యూటరైజ్డ్ ల్యాబొరేటరీల పేరిట అన్నిరకాల రక్తం, మూత్ర పరీక్షలు చేస్తూ.. ఫలితాల కోసం రోగులను వేచిచూసేలా వ్యవహరిస్తున్నారు. రిపోర్టుల జాప్యం ఎందుకని ప్రశ్నిస్తే పెద్ద డయాగ్నోస్టిక్ సెంటర్‌కు పంపించాం ఆగాల్సిందే అని చెబుతున్నారు. జిల్లాలో మొత్తం 712 సెంటర్లు ఉండగా అనధికారికంగా మరో 300 కేంద్రాలు నిర్వహిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. జిల్లావైద్యాధికారుల టాస్క్‌ఫోర్సు బృందం క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేస్తేనే రోగుల ప్రాణాలకు భరోసా కల్పించినట్లు అవుతుంది. ఈ విషయాన్ని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్‌తో ప్రస్తావించగా తనిఖీలు చేసి నిబంధనలు లేని కేంద్రాలను మూసివేస్తామని పేర్కొన్నారు.

గుండెకు సంబంధించిన సీబీపీ లిపిడ్ ప్రొఫైల్, టీ3, టీ4, టీఎస్‌హెచ్, హెచ్ఐవీ, కాలేయ, మూత్ర పిండాలు, ఐరన్, ప్రెగ్నెన్సీ ప్రొఫైల్, థైరాయిడ్, మలేరియా, టైఫాయిడ్, ప్లేట్‌లెట్స్, డెంగీ, చికున్‌గున్యా, విషజ్వరాలకు సంబంధించిన అన్ని పరీక్షలు చేస్తామని పెద్దబోర్డులు పెట్టి చిన్న చిన్న గదుల్లో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఆర్ఎంపీ స్థాయిలో రోగుల వద్ద నుంచి వివిధ శాంపిళ్లు సేకరించి వాటిని పేరున్న డయాగ్నోస్టిక్ సెంటర్లకు పంపించి అక్కడి నుంచి రిపోర్టులు వస్తే మళ్లీ రోగికి రిపోర్టు ఇచ్చే సంప్రదాయం నడుస్తుంది.

## వారసత్వ కట్టడాలకు ఊపిరి



హైదరాబాద్ : వారసత్వ కట్టడాలకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు రంగం సిద్ధమైంది. దశలవారీగా గుర్తించిన 100కు పైగా కట్టడాలను పునరుద్ధరించాలని యంత్రాంగం నిర్ణయించింది. మొదటగా 12 నిర్మాణాలు ఎంపికయ్యాయి. ఏడింటికి డీపీఆర్ రూపొందించాలని కన్సల్టెన్సీలను ఆహ్వానిస్తూ కులీకుతుబ్‌షాహీ పట్టణాభివృద్ధి సంస్థ(కుస్సాడ్) నోటిఫికేషన్ ఇచ్చింది. మిగిలినవీ పునరుద్ధరణ పనులు చేపట్టి.. పునర్వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రైవేటు సంస్థలను పిలుపు ఇచ్చింది.

**ఘనమైన చరిత్ర**

'నగరానికి వందల ఏళ్ల ఘనమైన చరిత్ర ఉంది. అప్పట్లో కోటలోకి ప్రవేశించేందుకు 12 దర్వాజాలు ఉండేవి. ప్రస్తుతం రెండింటి ఆనవాళ్లే మిగిలాయి. వాటిని పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గోల్కొండ కోటలోని ఆయుధ తయారీ కేంద్రమైన శంషీర్ కోట, ఖజానా భవనాలనూ పునరుద్ధరించాల్సి ఉంది. అబిడ్స్‌లోని ఎస్బీఐ వెనుక ఫ్రెంచ్ పాలకులు నిర్మించిన గన్‌ఫౌండ్రీ ఉంది. వాటిని పర్యాటక, సాంస్కృతిక కేంద్రాలుగా తీర్చిదిద్ది.. స్వయం సమృద్ధి సాధించేలా చేస్తాం. డీపీఆర్ కోసం కన్సల్టెన్సీలను కోరాం."అని అధికారులన్నారు.

**సర్వే, 3డీ డిజైన్లు** "డీపీఆర్ జాబితాలోని కట్టడాలను సర్వే చేస్తాం. పాత కాలంలో ఎలా ఉండేది, ఇప్పుడు ఎలా ఉందనే వ్యత్యాసాలను గుర్తించేలా 3డీ చిత్రాలను రూపొందిస్తాం. కట్టడాలకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ఖర్చుపై అంచనాలు రూపొందించి.. ప్రభుత్వ అనుమతితో పనులు చేపడతాం."అని ఇంజినీర్లు చెబుతున్నారు.

**జాబితాలోని 12 కట్టడాలు ఇవే..**

హుస్సేని ఆలంలోని పురానాపూల్ దర్వాజ
షేక్‌పేట్‌లోని షేక్‌పేట్ మజీద్
గోల్కొండలోని ఖజానా భవనం
గోల్కొండలోని శంషీర్ కోట
అబిడ్స్‌లోని గన్‌ఫౌండ్రీ
ఖైరతాబాద్‌లోని మజీదు, టూంబ్
హయత్‌నగర్‌లోని హయత్ భక్షి బేగం మజీద్
సికింద్రాబాద్‌లోని రోనాల్డ్‌రాస్ భవనం
ముసారంబాగ్‌లోని రేమండ్స్ టూంబ్
చాంద్రాయణగుట్టలోని చెన్నకేశవస్వామి దేవాలయం
కార్వాన్‌లోని టోలి మజీద్
షేక్‌పేట్‌లోని మజీద్
జుమ్మేరాత్ బజార్‌లోని మజీద్ ఏ మియన్ మిస్క్

## డివైడర్'లకు రేడియం స్టిక్కర్లేవి?



హైదరాబాద్: హైదరాబాద్ లాంటి మెట్రో నగరంలో రహదారి భద్రతకు ప్రభుత్వం కనీస చర్యలు చేపట్టడం లేదు. ఆందోళన కలిగించే స్థాయిలో ప్రమాదాలు జరుగుతున్నా... భద్రతకు తీసుకుంటున్న చర్యలు ఏ మాత్రం కన్పించడం లేదు. నగరంలో రాత్రి వేళల్లో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. డివైడర్లకు, పాదచారుల బాటలకు, ఫ్లైఓవర్లపై రేడియం స్టిక్కర్లు లేకపోవడమూ ఒక కారణమే.. సురేశ్ బైకుపై లక్డీకాపూల్ వైపు వెళ్తుండగా ఒక్కసారిగా డివైడర్ కనిపించడంతో బండిని పక్కకు తిప్పాడు. త్రుటిలో ప్రమాదం తప్పింది. అక్కడ రైల్వే ఓవర్ బ్రిడ్జి ఉండటంతో మధ్యలో డివైడర్ వేశారు. దానిపై రేడియం రిఫ్లెక్టివ్ స్టిక్కర్ లేకపోవడంతో దగ్గరికి వెళ్లేవరకు వాహనదారులకు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక్కడ ఒక్కచోటే కాదు.. నగరంలోని డివైడర్లకు, పాదబాటలకు..ఎక్కడా రేడియం స్టిక్కర్ కనిపించదు. ప్రమాదాల నివారణ కోసం తాజాగా వాహనాల వెనకభాగంలో రేడియం స్టిక్కర్లు అతికించుకోవాలని ఆర్టీఏ సూచిస్తోంది. ప్రజలకు సూచనలు చేసి చేతులు దులుపుకోకుండా.. ప్రభుత్వ సంస్థల వైపు నుంచి కూడా డివైడర్లు, పాదబాటలు, ఫ్లైఓవర్లు, మలుపులున్నచోట రేడియం రిఫ్లెక్టర్లను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

**వివరాలు** నగరంలో 9వేల కిలోమీటర్లకు పైగా రహదారులున్నాయి. ప్రమాదాలు జరగకుండా ఎక్కడా రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు.మెట్రోకి 69 కి.మీ.మెట్రోరైలు కారిడార్ ఉంది. డివైడర్ నిర్వహణ వీరిదే. కానీ ఎక్కడా రేడియం స్టిక్కర్లు లేవు. ఆ మధ్య ఒకరు డివైడర్ ఢీకొని ప్రమాదం జరిగితే కొన్నిచోట్ల తూతూ మంత్రంగా రోడ్ రిఫ్లెక్టర్లు ఏర్పాటుచేశారు. ఇప్పుడు ఒక్కచోట కూడా రాత్రి సమయంలో రేడియం వెలుగులు కన్పించడం లేదు.పీవీ ఎక్స్‌ప్రెస్ మార్గంలోని కింద రహదారిలో హెచ్ఎండీఏ గతంలో రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసింది. సంవత్సరాలు దాటడంతో అవి పనిచేయడం లేదు. కొత్తవాటి ఊసే లేదు.వీటి ఏర్పాటులో జీహెచ్ఎంసీదే సింహభాగం. కొత్త ఫ్లైఓవర్లు, రహదారులు వేసినప్పుడు తప్ప మళ్లీ ఎన్నడూ రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయరు.

## యువ వికాసం.. ఎప్పుడొస్తుందో రుణం!




వికారాబాద్ : యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థికంగా ఎదగడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసానికి నిరుద్యోగులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఏప్రిల్ 14 వరకు జిల్లావ్యాప్తంగా 50,197 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వాటిని మండలాల్లో అధికారులు పరిశీలించారు. లబ్ధిదారుల ఎంపికకు మండల ప్రత్యేకాధికారి కన్వీనర్‌గా ఎంపీడీవో, బ్యాంకు మేనేజరు, కార్పొరేషన్ అధికారితో కమిటీ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సిబిల్ స్కోరు మెరుగ్గా ఉన్న వారిని ఎంపిక చేసి జిల్లాకు పంపించారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కొంతమందికి ఆర్థిక సాయం మంజూరు చేస్తారని భావించినా అమలు కాలేదు. సిబిల్ స్కోరు ఆధారంగా ఎంపిక చేస్తారని ప్రకటించడం, నెలలు గడుస్తున్నా స్పష్టత లేకపోవడంతో నిరుద్యోగులకు తిప్పలు తప్పడం లేదు.

**రూ.50వేల నుంచి రూ.4 లక్షల వరకు..**

ఈ పథకం కింద ఎంపికైన వారికి రూ.50వేల నుంచి రూ.4లక్షల వరకు ఆర్థిక సాయం అందిస్తారు. ఇందులో బ్యాంకు రుణం కొంత, మిగిలింది వివిధ కార్పొరేషన్లు రాయితీగా అందిస్తాయి. ఆర్థిక సాయంతో నచ్చిన యూనిట్లను నెలకొల్పి జీవనోపాధి పొందుతారు. రూ.50వేల యూనిట్‌కు కార్పొరేషన్లు పూర్తి రాయితీతో సాయమందిస్తాయి. రూ.లక్షలోపు రుణం తీసుకుంటే 80 శాతం, రూ.లక్ష నుంచి రూ.2 లక్షలు తీసుకుంటే 70 శాతం, రూ.4 లక్షలకు 60 శాతం రాయితీ వస్తుంది. మిగతాది బ్యాంకు రుణం. బ్యాంకు రుణం ఇవ్వడానికి అంగీకరిస్తేనే పథకం మంజూరవుతుంది. వచ్చిన దరఖాస్తుల్లో ఎక్కువగా బీసీలవే ఉన్నాయి.

**సెప్టెంబరు వరకు ఎంపిక ప్రక్రియ..**

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ సెప్టెంబరు వరకు కొనసాగుతుందని అధికారులు ప్రకటించారు. జూన్‌లో రూ.లక్షలోపు, జులైలో రూ.2 లక్షలు, ఆగస్టులో రూ.3 లక్షలు, సెప్టెంబరులో రూ.4 లక్షల రుణాలను అందించాలని ప్రభుత్వం అప్పట్లో నిర్ణయించింది. యూనిట్లను మార్చుకోవడానికీ ప్రభుత్వం అభ్యర్థులకు అవకాశమిచ్చింది. గతంలో నిరుద్యోగులకు ప్రభుత్వం కార్పొరేషన్ రుణాలు మంజూరు చేసినా బ్యాంకులు మాత్రం ఇవ్వలేదు. దీంతో చాలామంది నిరుత్సాహానికి గురయ్యారు.

## అనర్హులకు పింఛన్లు

కరీంనగర్ : జిల్లాలోని ఇల్లందకుంట మండలంలో మొత్తం 1116 మంది దివ్యాంగులు పింఛనుదారులు ఉండగా, 116 మంది పింఛన్లను అధికారులు నిలిపివేశారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు విజిలెన్స్ శాఖ విచారణ చేసి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులకు నివేదిక అందజేశారు. సదరం శిబిరంలో ధ్రువపత్రాలను పరిశీలించిన అధికారులు 41 మందిని అనర్హులుగా గుర్తించి పింఛన్ రద్దు చేశారు. మిగతా 75 మందివి వైద్య పరీక్షల నివేదికలు రావాల్సి ఉంది. ప్రస్తుతానికి వీరి పింఛన్లు కూడా ఆపేశారు. అనర్హులకు పింఛన్లు రావడానికి కారకులు ఎవరో తేల్చలేదు.

ఈ ఒక్క మండలంలోనే దాదాపు పది శాతం అనర్హులు ఉన్నారంటే.. జిల్లాలో మిగిలిన మండలాల్లోనూ ఉండే అవకాశముంది. దివ్యాంగ విభాగంలోనే కాకుండా కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, ధనవంతులు కూడా అక్రమంగా సాధారణ పింఛన్ లబ్ధి పొందుతున్నారనే ఆరోపణలున్నాయి. అధికారులు పూర్తి స్థాయి విచారణ చేస్తే వందలాది మంది అనర్హులు బయటపడే అవకాశముంది.

**ప్రజాధనం వృథా**

ఇల్లందకుంట మండలంలో 41 మంది అనర్హులు నెలకు రూ.1.64 లక్షలకుపైగా లబ్ధి పొందారు. అంటే అయిదేళ్లలో దాదాపు రూ.కోటిపైగా ప్రభుత్వానికి నష్టమే.

గతంలో వైద్య విధాన పరిషత్ పరిధిలో సదరం శిబిరాలు నిర్వహించినప్పుడు కొందరు డబ్బులకు ఆశపడి అనర్హులకు పింఛన్లు మంజూరు చేశారు. కొందరి ధ్రువపత్రాలను పరిశీలించిన విచారణ అధికారులు, ఓ డాక్టర్‌ను సైతం విధుల్లో నుంచి తొలగించారు. కానీ ప్రస్తుతం పింఛన్ మంజూరు చేసే క్రమంలో పక్కాగా అన్ని రకాలుగా



పరిశీలిస్తున్నారు.మరో వైపు అర్హులైనా పింఛను రానివారు ఎప్పుడు వస్తుందోనని ఎదురుచూస్తున్నారు. ఉపాధి హామీ పథకంలాగే సామాజిక పింఛన్ తనిఖీ కార్యక్రమం చేపట్టాలని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఇలా చేస్తే అక్రమ పింఛన్‌దారులను గుర్తించి ప్రజాధనం కాపాడవచ్చు.

**ఫిర్యాదు చేస్తే..**

గ్రామాల్లో అనర్హులు లబ్ధి పొందుతున్నా.. స్థానిక ప్రజాప్రతినిధులు వారి వివరాలు బయట పెట్టడంలేదు. అలా చేస్తే వచ్చే ఎన్నికల్లో వారికి ఓట్లు వేయరనే భయం. గ్రామాల్లోని యువత, స్వచ్ఛంద సంస్థలు స్పందించి అక్రమ పింఛన్‌దారులపై కలెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, ఎంపీడీవోలకు ఫిర్యాదు చేస్తే అనర్హులను తొలగించవచ్చు.

జిల్లాలోని లబ్ధిదారుల వివరాలు

| | |
|---|---|
| వృద్ధులు | : 55,232 |
| దివ్యాంగులు | : 23,172 |
| వితంతువులు | : 37,636 |
| ఇతరులు | : 22,337 |

## లాభాలు ఒడిసి 'పట్టు'

జగిత్యాల : వ్యవసాయానికి అనుబంధంగా పట్టు పురుగుల పెంపకం ఉమ్మడి జిల్లాలో ఏటికేడు పెరుగుతోంది. రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా మల్బరీ సాగు 280 ఎకరాలను దాటగా.. మరింతమంది పెంపకానికి దరఖాస్తు చేస్తుండటం సాగు సానుకూలతను వెల్లడిస్తోంది.

**అధిక మొత్తంలో రాయితీ**

సిల్క్ సమగ్ర-2 పథకం ద్వారా 2025-26 సంవత్సరానికి 195 ఎకరాల్లో మల్బరీ మొక్కల, పట్టు పురుగుల పెంపకం లక్ష్యంగా రాయితీ ఇస్తున్నారు. సాధారణ రైతులకు రెండెకరాల్లో సాగుకు రూ.60 వేలు.. ఎస్సీ, ఎస్టీలకు రూ.78 వేలు ఇస్తున్నారు. రెండెకరాల మల్బరీ ద్వారా పట్టు పురుగులను పెంచే షెడ్డు నిర్మాణానికి రూ.6-8 లక్షలు ఖర్చవుతుండగా.. జనరల్ రైతులకు రూ.2.25 లక్షలు, ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.2.92 లక్షలను రాయితీగా ఇస్తున్నారు.

షెడ్డులో అమర్చే ఒక్కో స్టాండ్‌కు రూ.10,890-22,140.. ఇతర సామగ్రికి రూ.4 వేలు, రోగ నిరోధక మందులకు రూ.2,500-3,250 చొప్పున నిధులిస్తున్నారు. ఉద్యానశాఖ ద్వారా పొలాస వ్యవసాయ కళాశాలల్లోనూ పట్టు పురుగుల పెంపకంపై రైతులకు శిక్షణ ఇస్తున్నారు.



**ఏటా రూ.5-7 లక్షల ఆదాయం**

రెండెకరాల పట్టుగూళ్లద్వారా ఏడాదికి రూ.5-7 లక్షల వరకు ఆదాయాన్ని పొందుతున్నారు. హైదరాబాద్, జనగాంలలో పట్టుగూళ్ల విక్రయ మార్కెట్లున్నాయి. పట్టు పురుగులపై ఆశించే తెగుళ్లను సమర్థంగా నిరోధించటం, పట్టుగూళ్లు అల్లుకునే దశల్లో మెలకువలతో రైతులు సత్ఫలితాలను సాధిస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారి శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఆసక్తిగలవారు పట్టు పురుగుల పెంపకానికి దరఖాస్తు చేయాలన్నారు.

**తక్కువ పెట్టుబడి**

మల్బరీ మొక్కలను ఒకసారి నాటితే ఏళ్లుగా మొక్కలు నిరంతరం ఆకులను కాపుగా ఇస్తూనే ఉంటాయి. చీడపీడల బెడద ఉండదు. పట్టు సాగును చేపట్టిన తొలిసారే షెడ్డు, చంద్రికలు, తడకలు, నెట్లు తదితరాలకు పెట్టుబడి ఉంటుంది. తరువాతి పంటలకు కేవలం గుడ్లను కొనడం, మందు ద్రావణం, కూలీల ఖర్చు తదితర చిన్న పెట్టుబడులు మాత్రమే ఉంటాయి. మల్బరీ పట్టును సాగు చేస్తున్నవారు ఏడాదిలో సరాసరిగా 5-8 పంటల కాపును తీస్తున్నారు. వంద గుడ్లకు 60-80 కిలోల వరకు పట్టు గూళ్లు వస్తుండగా కిలో ధర రూ.700 వరకుంది.

**నిరంతర రాబడి**

పట్టు పురుగుల పెంపకంతో ఏడాది పొడవునా నికరాదాయం వస్తోంది. పట్టు గూళ్లకు కిలోకు రూ.75 చొప్పున రైతులకు ఇచ్చే రాయితీని పెంచి కొనసాగించాలి. చంద్రమౌళి, రైతు, కల్లెడ

చురకలు



# వానాకాలంలో కార్మికులకు రక్షణేదీ!

జగిత్యాల : పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడంలో ప్రధాన భూమిక పోషిస్తున్న కార్మికుల రక్షణను జగిత్యాల బల్దియా గాలికొది లేసింది. పురపాలికలోని వివిధ విభాగాల్లో అత్యవసర సేవలందిస్తున్న కార్మికులకు పూర్తి స్థాయిలో వసతులు కల్పించలేకపోతున్నారు. మొత్తం సిబ్బందిలో 300 మంది పారిశుద్ధ్య, 45 మంది తాగునీరు, విద్యుత్తు విభాగాల్లో పని చేస్తున్నారు. పట్టణ ప్రజలకు తాగునీరు, వీధి దీపాలు, చెత్త సేకరణలో వీరంతా నిత్యం సేవలందిస్తున్నారు. కొద్ది రోజులుగా వర్షాల నేపథ్యంలోనూ కార్మికులు విధులకు హాజరవుతున్నారు. వీరికి ఏటా వర్షాకాలానికి ముందే పురపాలక సంఘం రెయిన్ కోట్లు పంపిణీ చేస్తుంది. ఈ ఏడాది ఇప్పటివరకు అందజేయకపోవడంతో కార్మికులు వానలో తడుస్తూనే విధులు నిర్వర్తించాల్సి వస్తోంది.

**50 మందికి పైగా గైర్హాజరు**

కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తగిన రక్షణ లేకుండా కార్మికులు విధులకు హాజరవుతుండటంతో చాలా మంది జ్వరం, జలుబు ఇతర అనారోగ్య కారణాలతో విధులకు దూరం కావాల్సి వస్తోంది. 345 మందిలో నిత్యం 50 మందికి పైగా గైర్హాజరవుతు న్నారు. వర్షాలతో తరచూ పట్టణంలోని వీధులు జలమయం కావడంతో పాటు జనావాసాల్లోకి నీరు చేరడం, మురుగు కాలువల్లో వ్యర్థాలు



పేరుకుపోయిన సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. వీటిని వెంటనే పరిష్కరించడానికి పారిశుద్ధ్య, విద్యుత్తు సిబ్బంది వానలో తడుస్తూనే పని చేస్తున్నారు. కార్మికుల్లో 50 ఏళ్లకు పైబడిన వారే అధికంగా ఉండటంతో తరచూ అనారోగ్యానికి గురవతున్నారు.

**ఏకరూప దుస్తులతోనే సరి**

ప్రభుత్వం ప్రతి సంవత్సరం కార్మికులకు దుస్తులు, సబ్బులు, నూనెలు అందజేస్తుంది. ఈసారి వీటిని కూడా ఆలస్యంగా పంపిణీ చేశారు. ఓవైపు వర్షాల నేపథ్యంలో పురపాలికలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం సూచించినప్పటికీ రెయిన్ కోట్లు ఇవ్వకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. గత నెలలో కార్మికులకు కేవలం ఏకరూప దుస్తులు అందించి చేతులు దులుపుకున్నారు. వెంటనే రెయిన్ కోట్లు పంపిణీ చేయాలని సిబ్బంది కోరుతున్నారు.

# వేలం ధాన్యానికీ తిరకాసు!

పెద్దపల్లి : మిల్లర్లు సీఎంఆర్ చెల్లింపులో జాప్యం చేస్తున్నారని ప్రభుత్వం ధాన్యాన్ని వేలం వేస్తే.. వ్యాపారులు డబ్బుల చెల్లింపులోనూ అదేతీరులో వ్యవహరిస్తున్నారు. లెవీ తరహాలోనే గడువులు పొడిగించాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ప్రభుత్వం ధాన్యం కేటాయిస్తే మరాడించి సీఎంఆర్ రూపంలో ఇవ్వాల్సిన మిల్లర్లు ఏళ్లకు ఏళ్లు ఆలస్యం చేయడం బహిరంగ రహస్యమే. అందులో కొంత ధాన్యం అమ్ముకొని, మిగిలిన ధాన్యంతో మిల్లర్లు రొటేషన్ చేసిన ఉదంతాలు ఉన్నాయి. దీంతో 2022-23 యాసంగి ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో వేలం వేసింది. ఏడాదిన్నర గడిచినా టెండర్ దక్కించుకున్న వ్యాపారులు ఇప్పటికీ ప్రభుత్వానికి డబ్బులు పూర్తిగా చెల్లించలేదు.



**ఇదీ సమస్య**

యాసంగిలో సాధారణంగా బాయిల్డ్ బియ్యాన్నే ఎఫ్‌సీఐ తీసుకుంటుంది. కానీ 2022-23 సీజన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సయోధ్య కుదరకపోవడంతో బియ్యం తీసుకోవడంపై అనిశ్చితి ఏర్పడింది. దీనికితోడు ఎఫ్‌సీఐ సైతం రా రైస్ మాత్రమే తీసుకుంటామని చెప్పడంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా పొడి బియ్యం తీసుకునేందుకు ప్రయత్నించింది. కానీ యాసంగి సీజన్‌లోని బియ్యంలో నూక శాతం పెరగడంతో ఎఫ్‌సీఐ నిబంధనలను అందుకోలేకపోయాయి. ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా మిల్లర్ల వద్ద భారీ స్థాయిలో ధాన్యం పేరుకుపోయింది. దీనికితోడు కొందరు మిల్లర్లు ధాన్యం బయట అమ్ముకున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో 2023 డిసెంబరులో అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం ఈ చిక్కులు తొలగించేందుకు మిల్లర్ల వద్ద పేరుకుపోయిన ధాన్యాన్ని వేలం వేసింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా పరిధిలో 8.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి వేలం నిర్వహించారు. టన్నుకు రూ.21,700ల చొప్పున వేలంలో దక్కించుకున్న వ్యాపారులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఏడాది దాటినా చెల్లింపులు మాత్రం పూర్తిస్థాయిలో జరగడం లేదు.

# గుండుపై రూపం.. అరుదైన ఆలయం

కోరుట్ల మండలం అయిలాపూర్ శివారులోని గుట్టపై వెలిసిన శ్రీఅనంతపద్మనాభస్వామి ఆలయానికి 400 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. 16వ శతాబ్దంలో అయిలాపూర్ కేంద్రంగా అనంతరాజకిషన్‌రావు అనే సంస్థానాధీశుడు పాలిస్తుండేవారు. ఓరోజు ఆయన గ్రామ శివారులోని అటవీ ప్రాంతానికి వేటకు వెళ్లారు. అక్కడ గుట్టపైనున్న ఓ గుండుపై మూడు నామాల(శ్రీమహావిష్ణువు) స్వరూపం ఆయనకు దర్శనమిచ్చింది. ఆ రోజు రాత్రి కలలో స్వామివారి రూపం కనిపించింది. దీంతో అటవీ ప్రాంతాన్ని, ఇతర గుండ్లను తొలగించి చదును చేయించారు. స్వామి స్వరూపం ఉన్న గుండుపై పాము పడగలాగా మరో గుండు 70 శాతం వంగి ఉంటుంది. స్వయంగా ఇది శ్రీమహావిష్ణువు ప్రతిరూపంగా భావించి పూజలు ప్రారంభించారు. తెలంగాణలో ఇదే మొదటి అనంతపద్మనాభస్వామి గుడిగా ప్రచారంలో ఉంది. ఆలయ ముఖద్వారం ఉత్తరం వైపు ఉండటంతో స్వామివారు అటువైపు అభిముఖంగానే భక్తులకు దర్శనమిస్తుంటారు. 2002-03లో స్వామివారి స్వరూపం ఉన్న గండును ఆనుకొని ఆలయం నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఏటా అక్టోబరులో జ్యేష్టబేలాషష్టి రోజు స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తారు. పరిసర మండలాల నుంచి, జిల్లాలోని, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి, మహారాష్ట్ర నుంచి వేల సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని కొలుస్తుంటారు. వైకుంఠ ఏకాదశి, దసరా, దీపావళి, సెప్టెంబరులో అనంత కోటి వత్తుల వెలిగింపు, నవంబరులో సుబ్రహ్మణ్యషష్టి రోజు విశిష్ట పూజలు నిర్వహిస్తారు. స్వామివారికి తిరునామాల వంశస్థులు అయిదు తరాలుగా పురోహితులుగా అర్చక సేవలందిస్తున్నారు.

# కమిటీ .. కావాలి భద్రతకు దివిటీ



సంగారెడ్డి: సిగాచీ కర్మాగారంలో జరిగినటువంటి భారీ ప్రమాదాలు పునరావృతం కాకుండా, జిల్లా యంత్రాంగం కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే పారిశ్రామిక వాడలతో సంబంధం లేకుండా ప్రత్యేకంగా పరిశ్రమల క్లస్టర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. భద్రతకు సంబంధించి పరిశ్రమల నిర్వాహకులతో స్వీయ ధ్రువీకరణ పత్రాలు తీసుకోవడంతో పాటు తనిఖీలు చేపట్టాలని నిర్ణయించారు.

**మొదలైన క్లస్టర్ల ఏర్పాటు** జిల్లాలో పటాన్‌చెరు, జిన్నారం, హత్నూర, గుమ్మడిదల, ఇంద్రకరణ్, సదాశివపేట, కొండాపూర్‌తో పాటు జహీరాబాద్‌లో 4,732 పరిశ్రమ లున్నాయి. ఇందులో 3,124 పరిశ్రమలు రసాయనాలు ఉత్పత్తి చేసేవి ఉన్నాయి. వీటిలో 599 హైరిస్క్ పరిశ్రమలున్నాయి. వీటిని స్థాపించిన ప్రాంతాల్లో ప్రమాదం జరిగితే సత్వరమే ప్రథమ చికిత్స అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు లేవు. సిగాచీ వద్ద కూడా ఇదే పరిస్థితి ఉండడంతో ప్రాణనష్టం పెద్దఎత్తున జరిగిందని నిర్ధారించారు. ఒక్కో పారిశ్రామికవాడలో పదుల సంఖ్యలో పరిశ్రమలున్నాయి. పది నుంచి పదిహేను పరిశ్రమలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేయాలని నిర్ణయించి, ఇప్పటివరకు 43 పూర్తిచేశారు. క్లస్టర్ల సమీపంలో అంబులెన్స్‌తోపాటు ఇతర సదుపాయాలు సమకూర్చాలని నిర్ణయించారు.

**35 పరిశ్రమల్లో తనిఖీ**

పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ ప్రావీణ్య నిర్ణయించారు. కర్మాగారాల భద్రత అధికారుల ఆధ్వర్యంలో రెండు కమిటీలను నియమించారు. ఈ కమిటీలు మొదటగా హైరిస్క్ కర్మాగారాల నుంచి స్వీయధ్రువీకరణ పత్రాలు తీసుకుంటున్నారు. అనంతరం తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటివరకు 35 పరిశ్రమల్లో పూర్తిచేసి, నివేదికలను రూపొందిస్తున్నారు.

**సందేహాలు** పరిశ్రమల్లో భద్రతపై కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం నిర్దేశించింది. రాష్ట్రంలోనే అత్యధిక పరిశ్రమలున్న సంగారెడ్డి జిల్లాలో పరిశ్రమల భద్రతకు చర్యలు చేపట్టేందుకు కలెక్టర్ ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఇంతవరకు బాగానే ఉన్నా గతంలో తనిఖీలు నిర్వహించిన అధికారులనే ప్రస్తుతం నియమించడంతో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో కర్మాగారాల భద్రతకు చెందిన అధికారులు తనిఖీలు నామమాత్రంగా చేపట్టారు. ప్రస్తుతం ఆ విధంగా జరగకుండా చూడాలని కార్మికసంఘాల నాయకులు కోరుతున్నారు.

# పది ప్రగతి పత్రాలు వచ్చేశాయ్!




పెద్దశంకరంపేట : పదో తరగతి ప్రగతి పత్రం (మెమో) విద్యార్థి జీవితంలో ఎంతో ప్రధానమైనది. ఈ ఏడాది ఏప్రిల్ 30న పది వార్షిక పరీక్షల ఫలితాలను విడుదలయ్యాయి. వెంటనే విద్యార్థులకు ఆన్‌లైన్ మెమోలు అందజేశారు. పై చదువులకు వీటి ద్వారానే ప్రవేశాలు పొందారు. ఇక తాజాగా బోర్డ్ ఆఫ్ సెకండరీ శాశ్వత ప్రగతి పత్రాలను విడుదల చేయడం విశేషం.

**పలు మార్పులతో..**

ఉత్తీర్ణులైన పది విద్యార్థుల ప్రగతి పత్రాలను స్పీడ్ పోస్టు ద్వారా సోమవారం ఉన్నత పాఠశాలకు పంపించారు. ఈ సారి వాటిలో పలు మార్పులు చోటు చేసుకోవడం గమనార్హం. వార్షిక పరీక్ష ఫలితాల్లో గ్రేడ్‌లను తొలగిస్తున్న తెలిసిందే. వాటికి అనుగుణంగా విడుదల చేశారు. గతేడాది వరకు ఫలితాల్లో అన్ని పాఠ్యాంశాల్లో వచ్చిన గ్రేడ్‌లు కలిపి మొత్తం 'గ్రేడ్' పాయింట్లు ఇచ్చారు. దీని వల్ల విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతున్నట్లు గుర్తించిన బోర్డు 2024-25 విద్యా సంవత్సరంలో నేరుగా మార్కులు ఇవ్వనున్నట్లు పేర్కొన్న విషయం విదితమే. వీటికి తోడు ఆయా సబ్జెక్టుల్లో వచ్చిన మార్కులు, గ్రేడ్‌లు కలిపి ఇస్తామని తెలిపింది. ఇదే పద్ధతిలో ఫలితాలను విడుదల చేసింది. సబ్జెక్టుల వారీగా మార్కులతో పాటు ఏ, ఏ1, ఏ2 వంటి గ్రేడ్‌లను ప్రకటించింది. తాజాగా విడుదల చేసిన ప్రగతిపత్రాల్లో మొత్తం మార్కుల స్థానంలో 'పాస్' అని రాసింది. ప్రతి సబ్జెక్టుకు వచ్చిన వాటిని లెక్కిస్తేనే మొత్తం మార్కులు తెలుస్తాయి. వార్షిక పరీక్షలు, ఇంటర్నల్ మార్కులను విభజించి చూపారు.

**పెన్ నంబరు సైతం..**

రెండేళ్ల కిందట యూడైస్ స్థానంలో యూడైస్ ప్లస్‌ను అమల్లోకి తీసుకొచ్చిన విషయం విదితమే. విద్యార్థి ఆధార్ సంఖ్య అనుసంధానంగా నమోదైన వివరాలతో పెన్ (పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబరు)ను ఇచ్చారు. దీని ఆధారంగా విద్యార్థి వివరాలు పూర్తిగా తెలుసుకోవచ్చు. ఉన్నత విద్య, ఉద్యోగం సాధించినా ఈ నంబర్ ఆధారంగా తెలుసుకునే వీలుంది. ప్రస్తుత ప్రగతిపత్రాల్లో వీటిని నమోదుచేశారు.

# అన్నీ పక్కాగా ఉంటేనే నిధులు



ధర్మపురి : ఉపాధిహామీ పథకంలో తాము సూచించిన కొత్త చెల్లింపుల విధానమైన స్పర్శ్‌లోకి మారలేదని మెటీరియల్ కాంపోనెంట్ నిధులను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. అన్ని మండలాల్లో చేపట్టిన పనులను డైరెక్టర్ కార్యాలయంలోని స్పర్శ్ విధానంలోకి మార్చాలని ఆదేశించింది. దీని ప్రకారం మొదటగా గ్రామాల్లో చేయాల్సిన పనులను గ్రామ పంచాయతీ తీర్మానం చేయాల్సి ఉంటుంది. ఆమోదం పొంది పరిపాలన అనుమతులు వచ్చిన అనంతరం పనులు చేపట్టాలి. సంబంధిత ఏఈ ద్వారా ఎంబీ రికార్డు పూర్తయ్యాక నిధులు మంజూరవుతాయి. పలుచోట్ల మొదట పనులను ప్రారంభించి తర్వాత తీర్మానం చేయిస్తున్నారు. ఉపాధిహామీలో కాంపోనెంట్ నిధుల ద్వారా 90 శాతం సీసీ రహదారులను నిర్మిస్తుండగా.. మిగతా పది శాతం మురుగు కాలువలు, ఇతర పనులు చేపడుతున్నారు.

**ప్రస్తుతం ఇలా..**

ఉపాధిహామీ ద్వారా జిల్లాకు మెటీరియల్ కాంపోనెంట్ కింద వచ్చిన నిధుల ఆధారంగా ప్రజాప్రతినిధులు పనులను నిర్ణయిస్తున్నారు. తీర్మానాలు లేకుండా పనులు జరగడం, ఓ దగ్గర చేయాల్సిన నిర్మాణం మరోచోట చేయడం, చెప్పిన దానికంటే ఎక్కువ వ్యయం అయ్యే పనులు చేపట్టడం, నిర్మాణం పూర్తయిన తర్వాత తీర్మానాలు చేయడం వంటివి జరుగుతున్నాయి.

**ఇదీ అనుమతుల ప్రక్రియ**

ఎక్కడెక్కడ పనులు చేయాలన్న అవసరాన్ని ముందుగా గుర్తించి.. అంచనా విలువతో ప్రతిపాదనలు పంపించాలి. ఈ మేరకు పంచాయతీ తీర్మానం చేయాల్సి ఉంటుంది. ప్రతిపాదనలు పంపిన తర్వాత నిధుల మంజూరు అనంతరం పనులు పూర్తి చేయాలని అధికారులు తెలిపారు. ఇటీవల గ్రామాల్లో పంచాయతీ తీర్మానాలతో చాలాచోట్ల సీసీ నిర్మాణాలను చేపట్టారు. పరిపాలన అనుమతులు లేకపోవడం, తదితర కారణాలతో గుత్తేదారులకు మళ్లీ తీర్మానాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జిల్లాలో సీసీ నిర్మాణాల వివరాలు (2024-25)

మంజూరైనవి: 1010

అంచనా విలువ: రూ.65 కోట్లు

పూర్తయిన పనులు: 655

ప్రగతిలో ఉన్నవి: 131

ప్రారంభించినవి: 224

**తప్పనిసరిగా అనుసరించాలి**

పక్కగా పనులను గుర్తించిన తర్వాతే చెల్లించాల్సి ఉంటోంది. అది కూడా స్పర్శ్ విధానంలోనే జరుగుతాయి. పనులు చేసే విధానాన్ని తప్పనిసరిగా అనుసరించాలి.

మదన్‌మోహన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అదనపు అధికారి

# కోర్టు భవన నిర్మాణంపై కాలయాపన

పెద్దపల్లి : జిల్లా కోర్టు భవన నిర్మాణ స్థల ఎంపికలో ఏకాభిప్రాయం కుదరడంలేదు. జిల్లా కేంద్రానికి దూరంగా ఉందని, అందుబాటులోని స్థలాలపై దృష్టి పెట్టాలని కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఒక పర్యాయం స్థలం మారిపోవడంతో రెండోసారైనా ఎంపికైన చోటులో నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతున్నారు. ఇక్కడ నిర్మాణ స్థలంపై నెలకొన్న సందిగ్ధతతో తమ ప్రాంతం ప్రయోజనం పొందాలని రామగుండం, సుల్తానాబాద్ నాయకులు ఎవరికివారే ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే రామగుండం ఎమ్మెల్యే ముఖ్యమంత్రి దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లడం చర్చనీయాంశమవుతుంది.

**మారిన స్థలాలు**

మూడేళ్ల క్రితం కన్నాల సమీపంలోని స్థలాన్ని ఎంపిక చేశారు. హైకోర్టు న్యాయవాదుల బృందం సైతం సదరు స్థలాన్ని దాదాపు ఖరారు చేశారు. కానీ ఈ ప్రాంతం కాలుష్య భరితంగా ఉండడంతోపాటు జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరం ఉందని కొందరు న్యాయవాదులు వ్యతిరేకించడంతో ఆ ప్రక్రియ కాస్త నిలిచిపోయింది. తాజాగా మంథని మార్గంలోని రాఘవపూర్ సమీపంలో పదెకరాలను గుర్తించారు. ఇది జిల్లా కేంద్రానికి 4 కిలోమీటర్ల దూరంలో ఉంది. వ్యవసాయ మార్కెట్‌లోని స్థలాన్ని కేటాయించాలని కొందరు వాదిస్తున్నారు. దీంతో మరోసారి కోర్టు భవన నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి.

**ఆలస్యం చేస్తే ఇతర ప్రాంతానికి?**



పెద్దపల్లి ప్రాంతంలో ప్రభుత్వ స్థల లభ్యత అంతంతమాత్రంగానే ఉంది. జిల్లా కలెక్టరేట్ నిర్మాణం ఎస్సారెస్పీకి చెందిన స్థలంలో జరగగా.. ఆర్టీసీ డిపో ఏర్పాటుకు మండల పరిషత్తు, పంచాయతీరాజ్ స్థలాలను కేటాయించారు. పదేళ్ల క్రితం పెద్దపల్లికి మంజూరైన అదనపు సెషన్స్ కోర్టు స్థానిక నాయకత్వం వైఫల్యంతో గోదావరిఖనికి వెళ్లగా.. సాంఘిక సంక్షేమశాఖ డిగ్రీ కళాశాల సైతం సుల్తానాబాద్‌లో ఏర్పాటుచేశారు. ఆలస్యం చేస్తే ఈ కోర్టు కూడా మరోచోటికి వెళ్లే అవకాశముంది.

**అందరి సమన్వయంతోనే నిర్మాణం**

కోర్టు నిర్మాణానికి అనువైన స్థలానికి కొన్నిరోజులుగా అన్వేషణ చేపట్టాం. వీటన్నింటిలో రాఘవపూర్‌లోని స్థలమే మేలైనదిగా భావిస్తున్నాం. దీనికోసం నాయకులు, న్యాయవాదులను సమన్వయం చేసి.. ఎమ్మెల్యే సహకారంతో కోర్టు నిర్మాణ పనులు త్వరలోనే చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నాం. భాస్కర్, పెద్దపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

# ఇంధనం ఎలా?

సిరిసిల్ల : పాలకవర్గాలు లేక పంచాయతీల ఖాతాలు ఖాళీ అయ్యాయి. ఏడాదిన్నరగా నిధుల కేటాయింపు జరగక పల్లెల్లో అభివృద్ధి కుంటుపడుతోంది. ఆదాయ వనరులు లేని గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ కత్తిమీదసాము అవుతోంది. బాధ్యులుగా వ్యవహరిస్తున్న కార్యదర్శులపై ఆర్థిక భారం తడిసి మోపెడవుతోంది. వానాకాలం నేపథ్యంలో చేపట్టాల్సిన పనుల్లో ప్రతికూలత ఎదురై వ్యాధులు ముసురుకుంటున్నాయి.

**జాడలేని సాయం**

గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పదవీకాలం గతేడాది ఫిబ్రవరిలో ముగిసింది. పాలకవర్గాలు లేకపోవడంతో 15 ఆర్థిక సంఘం ద్వారా పల్లెలకు నిధులను కేంద్రం ఆపేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌ఎఫ్‌సీ ద్వారా అందించే నిధులు సైతం ఏడాదికిపైగా నిలిచిపోయాయి. సుమారుగా రూ.20 కోట్లకుపైగా గ్రామాలకు అందే సాయం ఆగిపోయింది. 18 నెలలుగా నిధులు లేకపోవడంతో ప్రతి పనికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**అప్పులతో తిప్పలు**

గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాల గడువు ముగిసిన తర్వాత ఎన్నికలు జరపాల్సి ఉన్నప్పటికీ సాంకేతిక కారణాలతో నిలిచిపోయాయి. దీంతో సర్కారు గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన అమలు చేసినా నిధులు లేకపోవడంతో పల్లెపాలన గాడి తప్పింది. ఆదాయ వనరులు లేని పంచాయతీల్లో పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. నిధుల లేమి, సిబ్బంది జీతాలు చెల్లింపులో జాప్యం, పారిశుద్ధ్య లోపం, విద్యుత్తు దీపాలు, తాగునీరు తదితర అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. 198 ఫాగింగ్ యంత్రాలు ఉండగా ఇంధనానికి తిప్పలు తప్పడం లేదు. అత్యవసర పనులకు పంచాయతీ కార్యదర్శులు అప్పుల భారం మోయాల్సిన పరిస్థితి తలెత్తింది. వినాయక చవితి, బతుకమ్మ పండగలు సమీపిస్తుండగా నిధుల లేమితో కార్యదర్శులు, గ్రామ పంచాయతీల సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.



**ట్రాక్టర్ల పరిస్థితి ఏంటీ?**

జిల్లాలో పల్లె ప్రగతిలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీకి గత ప్రభుత్వం ట్రాక్టర్‌ను కొనుగోలు చేసింది. సర్కారు సమకూర్చిన ట్రాక్టర్‌లతో పల్లెల్లోని చెత్త సేకరణతోపాటు మంచినీటి సరఫరా, హరితహారంలో నాటిన మొక్కలకు నీరు అందించేవారు. నిత్యం వీధుల్లో తిరిగి ఇంటింటికి తిరుగుతూ వాహనాల్లో పారిశుద్ధ్య కార్మికులు చెత్తను సేకరించేవారు. కాలువల్లో పూడిక తీసిన తర్వాత వ్యర్థాలను ఊరి చివర కంపోస్ట్ షెడ్‌కు తరలించేవారు. ప్రస్తుతం పంచాయతీల్లో నిధుల కొరత కారణంగా ట్రాక్టర్‌కు కనీసం ఇంధనం సమకూర్చాలన్నా తలనొప్పిగా మారింది. ఇంజిన్‌లో ఆయిల్ తగ్గితే ఒక్కో లీటర్ కొనుగోలు చేసి పోయాల్సిన దుస్థితి నెలకొంది. వాహనం మరమ్మతుకు గురైతే ఇక అంతే సంగతులు. ఈ తరహా సమస్యల కారణంగా కొన్నిగ్రామాల్లో చెత్త సేకరణ, ఇతర పనులు సరిగా జరగడం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

జిల్లా వివరాలు మండల పరిషత్తులు : 12

గ్రామ పంచాయతీలు : 260 జనాభా : 5.5 లక్షలుఆవాసాలు : 1.4 లక్షలు (సుమారుగా)

# చెత్తశుద్ధి.. స్వచ్ఛత వృద్ధి

ఆదోని : ఏళ్ల తరబడి పేరుకుపోయిన చెత్త గుట్టలు త్వరలో ఖాళీ కానున్నాయి. పురపాలికల్లో స్వచ్ఛతపై కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది. కంపోస్టు యార్డుల్లోని చెత్త తరలించేందుకు రంగం సిద్ధం చేసింది. వందల టన్నుల మేర పోగైన చెత్తను శుద్ధి చేసే పనులను ప్రజారోగ్య విభాగం ద్వారా చేపట్టనుంది. అక్టోబరు 2వ తేదీ నాటికి కంపోస్టు యార్డులన్నీ ఖాళీ మైదానాలుగా మార్చి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సంకల్పించింది.

**కూటమి ప్రభుత్వం చొరవతో..**

కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యంపై దృష్టి సారించింది. కంపోస్టు యార్డులన్నీ ఖాళీ చేయించే పనులు చేపట్టింది. ఈ ఏడాది జులై ఆఖరులో పనులను ప్రజారోగ్య విభాగానికి అప్పగించింది. మహారాష్ట్రకు చెందిన సౌరాష్ట్ర కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. మెట్రిక్ టన్ను చెత్త శుద్ధి చేసేందుకు రూ.840 చెల్లించనుంది. కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, గూడూరు తదితర పురపాలక సంఘాల్లో యంత్రాలు తెప్పించి పనులు చేపట్టింది. కర్నూలులో 60, ఆదోని 8, ఎమ్మిగనూరు 30, డోన్ 30, నంద్యాలలో 77 మెట్రిక్ టన్నుల చెత్త శుద్ధి చేసినట్లు సమాచారం. శుద్ధి చేసిన మట్టిని పొలాలకు ఎరువుగా, మండే స్వభావం ఉన్న చెత్తను పరిశ్రమలకు, శుద్ధి కాని వాటిని గుంతలు తీసి పూడ్చేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఆయా పనులకు టెండర్లు పిలవాలని యోచిస్తున్నారు.



**గతంలో నిధులివ్వక..**

ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థతోపాటు తొమ్మిది పురపాలిక సంఘాలున్నాయి. రోజూ సుమారు 500-600 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతుంది. ఫలితంగా జనం చర్మ వ్యాధులు, శ్వాసకోశ సమస్యలు, క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. ఎన్జీటీ బృందాలు కంపోస్టు యార్డులను తనిఖీ చేసి వేల టన్నులకొద్దీ పోగైన చెత్తను చూసి చీవాట్లు పెడితే తప్ప గత ప్రభుత్వంలో కదలిక రాలేదు. చివరికి చెత్తను శుద్ధి చేసేందుకు తమ వద్ద నిధులు లేవని చేతులెత్తేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక గ్రాంటుతోపాటు 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకోవాలని సూచించినా పట్టించుకోలేదు. మరోవైపు మహారాష్ట్రకు చెందిన సాగర్ కంపెనీకి టన్ను చెత్త శుద్ధి చేసేందుకు రూ.640 చెల్లించేలా పనులు అప్పగించింది. సాంకేతిక, ప్రణాళిక లోపంతో పనులు మధ్యలో ఆగిపోయాయి.

# ఉల్లి గుట్టలు.. తరగక కష్టాలు

కర్నూలు : కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు ఉల్లి నిల్వలతో నిండిపోయింది. గోదాములు, కమీషన్ ఏజెంట్ల దుకాణాల ఎదుట, జంబోషెడ్డు, మాధవాచారి షెడ్లలో ఎటుచూసినా ఉల్లి బస్తాలు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసిన సరకు రెండు వారాలుగా సంచుల్లోనే మగ్గుతోంది. దీంతో చాలాభాగం కుళ్లిపోయింది. కొనుగోలు చేసిన నిల్వలు ఏమాత్రం బయటకు వెళ్లడం లేదు.

**ఫలించని ప్రయత్నాలు**

మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన ఉల్లిని విక్రయించేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఇప్పటివరకు 5 వేల టన్నులు కొనుగోలు చేశారు. ఇందులో 2 వేల టన్నుల సరకు మాత్రమే రైతుబజార్లు, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలతో పాటు హైదరాబాద్‌కు పంపినట్లు అధికారులు చెబుతున్నారు. మరో 3 వేల టన్నుల ఉల్లి నిల్వలు మార్కెట్‌లోనే ఉన్నాయి. అన్ని షెడ్లలోని ఉల్లి నిల్వలను ఖాళీ చేయించాలన్న ఉద్దేశంతో శని, ఆదివారం.. రెండు రోజులపాటు మార్కెట్‌లో ఉల్లి క్రయవిక్రయాలు నిలిపేసి నిల్వ ఉన్న సరకుకు వేలం నిర్వహించారు. రెండు రోజులు కలిపి వ్యాపారులు అతి తక్కువ ధరకు 1,500 టన్నుల సరకు మాత్రమే కొనుగోలు చేశారు. మరో 1,500 టన్నుల నిల్వలు షెడ్లలో, కమీషన్ ఏజెంట్ల దుకాణాల ముందు పేరుకుపోయాయి. వీటిని వేలం వేసినా వ్యాపారులు కొనుగోలు



చేయని పరిస్థితి నెలకొంది.

**వ్యాపారికి లాభసాటి**

గత రెండు వారాలుగా మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ.1,200 మద్దతు ధరతో ఉల్లి కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు చేసిన సరకుకు ఇప్పటివరకు వేలం వేయగా వ్యాపారుల నుంచి స్పందన రాలేదు. క్వింటా రూ.10, రూ.30, రూ.50, రూ.60, రూ.90, రూ.100కు కొనుగోలు చేస్తున్నారు. పది లాట్లకు మాత్రమే రూ.450 నుంచి రూ.900 వరకు ధర పలికింది. మిగిలిన సరకును క్వింటా రూ.200లోపే కొన్నారు.

**కొత్త సరకు దించేదెలా..**

ఆదివారం రాత్రికే షెడ్లలో ఉన్న ఉల్లిని ఖాళీ చేయాల్సి ఉంది. వేలం ద్వారా కొనుగోలు చేసిన ఉల్లిని వ్యాపారులు బయటకు తీసుకెళ్లలేదు. అక్కడే గ్రేడింగ్ చేసుకుంటున్నారు. దీంతో షెడ్లలో నిల్వలు ఉండిపోయాయి. శని, ఆదివారం రెండు రోజులు సెలవు కావడంతో సోమవారం ఒక్కరోజే 25 వేల క్వింటాళ్లకు పైగా ఉల్లి దిగుబడులు మార్కెట్‌కు వచ్చే అవకాశాలున్నాయి.

**ప్రభుత్వానికి రూ.3.5 కోట్ల నష్టం**

ప్రభుత్వం క్వింటా రూ.1200కు కొనుగోలు చేసిన ఉల్లిని వేలం ద్వారా వ్యాపారులకు అతి తక్కువకే విక్రయించడం ద్వారా ఇప్పటికే రూ.కోటిన్నర నష్టం వాటిల్లింది. వేలంలో కొనుగోలు చేయని సరకును మరోమారు వేలం వేసినా ఎవరూ కొనే పరిస్థితి లేదు. వ్యాపారులు కొనుగోలు చేయనిది, కుళ్లిపోయిన ఉల్లి ద్వారా మరో రూ.2 కోట్లు దుర్వినియోగమైనట్లే. మొత్తంగా ప్రభుత్వం సుమారు రూ.3.5 కోట్ల మేర నష్టపోతోంది.

# డీసీసీబీ అక్రమాల ఫలితం



చిత్తూరు : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పరిధిలో వైకాపా ప్రభుత్వంలో చోటు చేసుకున్న అక్రమాలపై విచారణ నివేదిక ఆధారంగా క్రమశిక్షణ చర్యల కింద 11 మంది ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు వేశారు. డీసీసీబీ పూర్వపు సీఈవో మనోహర్‌గౌడ్, వివిధ శాఖల్లో పనిచేస్తున్న చీఫ్ మేనేజర్లు సందీప్, నవీన్‌కుమార్, త్యాగరాజు, ఏజీఎం చంద్రకళ, మేనేజర్లు వెంకటేష్ బాబు, పుష్పలత, రమేష్, మోహన్ కుమార్, స్టాఫ్ అసిస్టెంట్లు యాసిన్, లక్ష్మారెడ్డిని సస్పెండ్ చేశారు. వీరితో పాటు అక్రమ మార్గంలో సర్వీసుల క్రమబద్ధీకరించుకున్న మేనేజర్ లక్ష్మి ప్రసన్న, స్టాఫ్ అసిస్టెంట్లు జయప్రకాష్, గురునాథంను విధుల నుంచి తొలగించారు. గత పాలకవర్గానికి సహకారం అందించిన మరో నలుగురు విశ్రాంత ఉద్యోగులకూ నోటీసులు జారీ చేశారు. మరో 30 మంది వివిధ శాఖల్లో పనిచేస్తున్న కిందిస్థాయి సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి.

**ఇదీ సంగతి..**

వైకాపా హయాంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండానే.. నామినేటెడ్ కమిటీలతో ఐదేళ్లూ కొనసాగించారు. డీసీసీబీ పాలకవర్గాన్ని సైతం ఏడుగురు సభ్యులున్న కమిటీతోనే ఐదేళ్లూ నడిపారు. జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రి అనుచరుడి భార్యను డీసీసీబీ పాలకవర్గానికి ఛైర్‌పర్సన్‌గా నియమించారు. దాదాపు రూ.మూడు వేల కోట్ల వ్యాపార లావాదేవీలు కలిగిన డీసీసీబీ పరిధిలో 40 శాఖలు, 75 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలున్నాయి. భారీ స్థాయిలో లావాదేవీలు కలిగిన బ్యాంకును.. ఇష్టారీతిన వినియోగించుకుని అక్రమాలకు పాల్పడ్డారు.

**నియామకాలకూ వసూళ్లు..**

డీసీసీబీ పరిధిలో రెగ్యులర్ ప్రాతిపదికన స్టాఫ్ అసిస్టెంట్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల నియామకాలకు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగుల నుంచి రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు శాఖల భవన నిర్మాణాల పేరుతో ఆన్‌లైన్ టెండరు లేకుండా ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని నిర్మాణ ముసుగులో రూ.కోట్లు కొల్లగొట్టారు. ఈ అక్రమాలపై ఫిర్యాదులు రావడంతో విచారణ చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సుమారు ఆర్నెళ్ల పాటు విచారణ కొనసాగగా.. అప్పటి పాలకవర్గానికి సహకరించిన డీసీసీబీ సిబ్బందిపై తాజాగా వేటు వేశారు.

# నిధులొచ్చేనా.. నీళ్లు పారేనా?



నర్సీపట్నం : ఇటీవల కురిసిన వర్షాలకు నర్సీపట్నం ప్రాంతంలోని పలుచోట్ల పంట కాలువలకు గండ్లు పడి సాగునీరు వృథా అవుతోంది. అత్యవసర పనులకు తాత్కాలిక మరమ్మతులకైనా నిధులివ్వకపోతే ఈ ఏడాది ఖరీఫ్‌లో వందల ఎకరాల్లో వరికి సాగునీరు ప్రశ్నార్థకమవుతుంది. మాకవరపాలెం ఆనకట్ట కాలువకు మళ్లీ గండి పడింది. గతంలో కర్రలు పాతి ఇసుక బస్తాలు వేసిన చోట వర్షాలకు గట్టు కొట్టుకుపోయింది. తక్షణమే గోడ నిర్మించాల్సిన అవసరం ఉంది. ఈ కాలువ కింద మాకవరపాలెం, పైడిపాల గ్రామాల్లో 400 ఎకరాల ఆయకట్టు ఉంది. తాత్కాలిక మరమ్మతుకు రూ.2 లక్షలు, శాశ్వత మరమ్మతుకు రూ.20 లక్షలు అవసరమని అంచనా.

కోటవురట్ల మండలం ఎండపల్లి వద్ద మల్లవరం కాలువకు గండి పడింది. ఈ కాలువ కింద కోటవురట్ల మండలం ఎండపల్లి, మాకవరపాలెం మండలం మల్లవరం, గిడుతూరు పంచాయతీల్లో 700 ఎకరాల ఆయకట్టు ఉంది. కొద్దిరోజుల కిందట గిడుతూరు పర్యటనకు వచ్చిన సభాపతి అయ్యన్నపాత్రుడు దృష్టికి అక్కడి రైతులు గండి పడిన విషయాన్ని తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన రైతులతో కలిసి గండిపడిన ప్రదేశాన్ని పరిశీలించారు. తాత్కాలిక మరమ్మతులకు నిధులివ్వాలని కలెక్టర్‌కు సూచించారు.

గండి పూడ్చేందుకు రూ.2 లక్షలు, శాశ్వత మరమ్మతుకు రూ.25 లక్షలు అవసరమని జలవనరుల శాఖ అధికారులు ప్రతిపాదించారు. ప్రస్తుతం వరి ఎదుగుదల దశలో ఉంది. గండి నుంచి నీరు వృథా అవుతుండటంతో సాగునీటి వినియోగదారుల సంఘ సభ్యులు, రైతులు రెండు రోజులుగా ఇసుక బస్తాలతో గండిని పూడ్చే పనిలో నిమగ్నమయ్యారు. ఈ కాలువ ద్వారానే గిడుతూరు సుకలయ్య చెరువుకు నీరు చేరుతుంది. ఈ చెరువుకు నీరు రాకుంటే సాగునీటికి ఇబ్బందులు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు.

గొలుగొండ మండలంలోని కృష్ణదేవిపేట భీముని చెరువు, పప్పుశెట్టిపాలెం పాలేపు చెరువు కాలువలకు గండ్లు పడ్డాయి. ఈ రెండు చెరువుల కింద 320 ఎకరాల ఆయకట్టు ఉంది. శాశ్వత మరమ్మతులకు రూ.23 లక్షలు అవసరమని అంచనా. జలవనరుల శాఖ ఏఈఈ రామన్నపాత్రుడిని సంప్రదించగా.. నిధుల విడుదల కోరుతూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు.

# పైసలిస్తే చకచకా.. లేకపోతే నత్తనడక..!

విశాఖ : మూడేళ్ల క్రితం గాజువాకలో జీప్లస్3 భవనం నిర్మించారు. అందులో 20 ఫ్లాట్లు ఉన్నాయి. ఆస్తి పన్ను విధించాలని ఫ్లాట్ల యజమానులు తిరుగుతున్నా రెవెన్యూ సిబ్బంది పట్టించుకోవడం లేదు.

ఆరిలోవకు చెందిన సాంబమూర్తి 60 గజాల ఇంటిని కొనుగోలు చేశారు. తన పేరిట రిజిస్ట్రేషన్ కూడా చేయించారు. ఆస్తి పన్ను బదలాయింపు చేయాలని ఆర్నెళ్లుగా తిరుగుతున్నా కుదరదంటూ రెవెన్యూ అధికారులు దరఖాస్తును తిరస్కరిస్తున్నారు.

అక్కయ్యపాలేనికి చెందిన సుబ్బారావు 800 చదరపు గజాల ఇంటిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించారు. అనంతరం ఆర్థిక పరిస్థితులు బాగోలేక ఇంట్లో 400 చదరపు గజాలను మరొకరికి విక్రయించి రిజిస్ట్రేషన్ కూడా చేయించారు. అయితే సుబ్బారావుకు ఇప్పటికీ 800 చదరపు గజాల స్థలానికి ఆస్తి పన్ను వస్తూనే ఉంది. అధికారులకు విన్నవించినా స్పందనలేదు.

ఆస్తి పన్ను విధింపులో రెవెన్యూ సిబ్బంది తీరుపై తీవ్ర విమర్శలొస్తున్నాయి. వారు వేస్తున్న కొర్రీలతో నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడటంతోపాటు ఏటా మహా విశాఖ నగరపాలక సంస్థ రూ.10 కోట్ల వరకు అదనపు ఆదాయం కోల్పోవాల్సి వస్తోంది. నిబంధనల పేరుతో డబ్బులివ్వకపోతే పన్ను విధించడంలేదనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వ పట్టా కలిగి ఉంటే ఆస్తి పన్ను విధించాల్సి ఉన్నా, పట్టాకు అర్హత ఉందా లేదా అంటూ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రిజిస్ట్రేషన్ కూడా చేశామని ఆధారాలు చూపుతున్నా పట్టా అర్హతపైనే మాట్లాడుతున్నారని వాపోతున్నారు.

ప్రసన్నం చేసుకుంటేనే: ఆస్తి పన్ను కోసం దరఖాస్తు చేసినవారు రెవెన్యూ సిబ్బందిని ప్రసన్నం చేసుకుంటే అనుకూలంగా నిర్ణయాలు వస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. అపార్టుమెంట్లలో ఫ్లాట్లకు ఆస్తి పన్ను విధించడానికి ఒక్కో దానికి రూ. 5వేల నుంచి రూ. 7వేల వరకు తీసుకుంటున్నారని అధికారులకు ఫిర్యాదులు వస్తున్నాయి.



డబ్బులివ్వకపోతే నెలలు, సంవత్సరాల తరబడి తిప్పించుకుంటున్నారని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే నిబంధనలు అడ్డుగా ఉన్నాయని తప్పుడు సమాచారం ఇస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ఆస్తి పన్ను విధింపు, బదలాయింపునకు నిర్ణీత గడువు నిర్ణయించడంతోపాటు, పట్టణ ప్రణాళిక విభాగంలో ఏవిధంగా ప్లానును ఆన్‌లైన్‌లో మంజూరు చేస్తున్నారో అదే తరహాలో పన్ను విధించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రభుత్వానికి లేఖ రాశాం..

ఆస్తి పన్ను విధింపులో ఎదురవుతున్న ఇబ్బందులపై ప్రభుత్వానికి నివేదించాం. త్వరలో పరిష్కారం లభించే అవకాశం ఉంది. నిర్ణీత గడువులోగా ఆస్తి పన్ను విధింపు లేక బదలాయింపు చేయాలన్న నిబంధనలున్నాయి. వాటిని కచ్చితంగా అమలు చేసేలా చూస్తాం. జీవీఎంసీకి ఆర్థిక నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకుంటాం. సత్తారు శ్రీనివాసరావు, జీవీఎంసీ ఉపకమిషనర్(రెవెన్యూ)

# పారకాలువలో.. ఆక్రమణల పరంపర

తిరుపతి: స్థలం.. పొలం.. ఇలా ఏది కనిపిస్తే అది ఆక్రమిస్తున్నా పట్టించుకోకపోవడంతో చివరికి శ్మశానాలూ కబ్జా చేశారు. రామచంద్రాపురం మండలం కమ్మపాళెం పంచాయతీ పారకాలువ గ్రామంలోని సర్వే నంబర్ 134లో రావిళ్లవారిపల్లి లెక్క దాఖలాలోని 4.06 ఎకరాల ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన వైకాపా నేత ఆక్రమించారు. ఇది కశిం కాలువ పోరంబోకు కాగా గ్రామస్థులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉండేది. ఈ నేపథ్యంలో 50 అడుగుల మేర బాగు చేసుకుని శ్మశాన స్థలంగా వాడుకొనేవారమని, వైకాపా నేత ఆక్రమించడంతో ఆఖరి మజిలీకి సైతం అవస్థలు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**హెచ్చరిక బోర్డు..** ఈ ఏడాది సంక్రాంతి రోజున రెవెన్యూ అధికారులు పరిశీలించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయబోతుండగా సదరు వైకాపా నేతలు అడ్డుకొని వారిపైనా దౌర్జన్యం చేశారు.. గతంలో ఓ వ్యక్తి చనిపోతే.. దహనక్రియలు చేసేందుకు స్థలంలోకి తీసుకెళ్తుండగా...



అక్రమార్కులు అడ్డుకున్నారు. ఆక్రమణలపై తహసీల్దారు మధుసూదనరావు వివరణ కోరగా తాను కొత్తగా వచ్చానని, విచారణ అనంతరం ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

**ఏళ్లుగా పోరాడుతున్నాం..**

కసిం కాలువలోని శ్మశాన స్థలాన్ని ఆక్రమించారు. ప్రశ్నిస్తే దౌర్జన్యానికి దిగుతున్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. కలెక్టరేట్లో అర్జీ ఇచ్చినా పరిష్కారం కరవైంది. ఏళ్లుగా పోరాటం చేస్తున్నాం. ముఖ్యమంత్రికి అర్జీ ఇచ్చాం. - పులిపాటి నాథముని నాయుడు, పారకాలువ

**న్యాయం చేయండి సారూ..!**

కాలువ అందరికీ సంబంధించింది.. కానీ ఓ వైకాపా నేత, ఆయన కుమారుడు. కబ్జా చేయడంతో అన్ని విధాలుగా ఇబ్బందులు పడుతున్నాం. ఇక్కడే పశువులు మేపుకొంటూ సంక్రాంతికి పొంగలి పెట్టుకుంటూ కాలువ నీళ్లు వాడుకునేవాళ్లం. ఆక్రమణతో ప్రస్తుతం శివాలయం వద్దకు వెళ్లాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలి. పి.చంద్రబాబు నాయుడు, పారకాలువ

# దయ చూపితే దాచుకుంటాం..!

పోలాకి : రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వ్యవసాయ ఉత్పత్తులు ప్రకృతి వైపరీత్యాల బారిన పడకుండా.. గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ చేసుకోవడానికి వీలుగా వైకాపా ప్రభుత్వం గ్రామ స్థాయిలో బహుళార్థ సాధక గోదాంల నిర్మాణం చేపట్టింది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో పనులు జరిగేలా నాబార్డు నుంచి నిధులు కేటాయించింది. జిల్లాలో కొన్నిచోట్ల భవనాలు నిర్మించినా వినియోగంలోకి రాక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

**ఇదీ పరిస్థితి** జిల్లాలో 37 పీఏసీఎస్‌ల పరిధిలో 25 గోదాంలు మంజూరు కాగా 18 నిర్మించారు. 5 వివిధ దశల్లో ఉండగా మిగిలినవి స్థల సమస్యతో పనులు ప్రారంభం కాలేదు. 500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో ఒక్కో నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేశారు. సారవకోట మండల కేంద్రానికి 20 కి.మి. దూరంలో నిర్మించడంతో అక్కడికెవరు వెళ్తారంటూ అన్నదాతలు ఆసక్తి చూప డం లేదు. ఇదే పరిస్థితి దాదాపు అన్నిచోట్లా ఉండటంతో ప్రారంభించినా ఎక్కడా వినియోగంలోకి వచ్చిన దాఖలాలు లేవు

**నిర్మాణం వరకే..:** గోదాంల నిర్మాణం చేపట్టడం వరకే మా బాధ్యత. పూర్తయిన వాటిని జిల్లా సహకార శాఖకు అప్పగిస్తాం. వాటి వినియోగంపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి. రామారావు, డీఈఈ, మార్కెటింగ్ శాఖ శ్రీకాకుళం

**వినియోగంలోకి తీసుకొస్తాం..:** నిర్మాణం పూర్తయిన గోదాంలను వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నాం. వేర్ హౌసింగ్ డెవలప్‌మెంట్ రెగ్యులేటరీ అథారిటీతో ఎంవోయూ చేసుకుంటున్నాం. ఈ ప్రక్రియ పూర్తయితే నిల్వ చేసుకున్న పంటలకు బీమా సౌకర్యం లభిస్తుంది. త్వరలోనే అందుబాటులోకి వచ్చేలా చూస్తాం. ఎ.మురళీకృష్ణ, జిల్లా సహకార శాఖ అధికారి, శ్రీకాకుళం

# మదుం మెరుగైంది.. రైతు కష్టం తీరింది!

సోంపేట : మహేంద్రతనయ నదిపై అనంతపురం వద్ద మదుం, ఇతర నిర్మాణాలు దెబ్బతినడంతో దశాబ్ద కాలంగా ఆయకట్టు రైతులు సాగునీటికి అష్టకష్టాలు పడ్డారు. ఏటా ఖరీఫ్‌లో రూ.2 లక్షలకు పైగా సమకూర్చుకుని శ్రమదానంతో ఇసుక బస్తాలు అడ్డంగా పెట్టి కొంతమేర నీరు పొలాలకు మళ్లించుకునేవారు. నదికి భారీగా వరద చేరితే ఇసుక బస్తాలు కొట్టుకుపోయి పంటలకు నష్టం వాటిల్లేది.

**వైకాపా పాలనలో నిర్లక్ష్యం**

బారువ, మరో 5 పంచాయతీల పరిధిలో గ్రామాలకు సంబంధించి 3 వేల ఎకరాల మేర బారువ గ్రోయిన్ ద్వారా సాగునీరందేది. ఏడేళ్ల కిందట మదుం నిర్మాణానికి నిధులు మంజూరు కాగా వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పనులు సాగలేదు.

అప్పట్లో మంజూరైన రూ.25 లక్షలతో పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. గ్రోయిన్ పరిధిలో పనికిరాని మొక్కలు పేరుకుపోవడం.. సామగ్రి ధరలు పెరిగిపోవడంతో పాత ధరల ప్రకారం పనులు చేయడానికి గుత్తేదారులు ముందుకు రాలేదు. ఈ అంశంపై వరుస కథనాలు ప్రచురితం కాగా ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ స్పందించారు. కలెక్టర్, జలవనరుల శాఖ అధికారులతో మాట్లాడారు.

**శరవేగంగా నాట్లు**

ఖరీఫ్ సాగుకు నీరందించేలా అధికారులు చొరవ చూపి గుత్తేదారులను సంప్రదించడంతో మదుం పనులు పూర్తయ్యాయి. ఏటిబట్టి కాలువ మెరుగుపడటంతో ఆయకట్టు భూములకు సాగునీటి కష్టాలు గట్టెక్కాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నదికి వచ్చిన వరద నిలిచేందుకు అవకాశం ఏర్పడింది. ప్రధాన కాలువ నుంచి నాలుగు పిల్ల కాలువలకు నీరు చేరడంతో నాట్లు వేయడానికి ఇబ్బందులు తప్పాయని జలవనరుల శాఖ ఏఈ సూర్యప్రకాశ్ తెలిపారు.

# అద్భుత కట్టడాలు.. ఇంజినీరింగ్ ఆవిష్కరణలు

అనకాపల్లి : ఒక ప్రాంతం అభివృద్ధి అక్కడ కట్టడాలు, నిర్మాణాలపై ఆధారపడి ఉంటుంది. ఆయా ప్రాంతాల్లో ఇంజినీరింగ్‌లో ప్రతిభ చూపి చేపట్టే కట్టడాలు అభివృద్ధికి సోపానంగా నిలుస్తాయి. ఇందులో అనకాపల్లి – ఆనందపురం రహదారే నిదర్శనం. అనకాపల్లి వద్ద నిర్మించిన ఇంటర్‌ఛేంజ్ రహదారి ఇంజినీరింగ్ ప్రతిభను చాటుతోంది. ఇంజినీర్స్ డే సందర్భంగా ఆ విశేషాలంటే చూద్దామా.. అనకాపల్లి నుంచి ఆనందపురం వరకు చేపట్టిన విస్తరణ పనుల్లో భాగంగా అనకాపల్లి వద్ద ఇటు ఆనందపురం.. అటు ఎలమంచిలి.. విశాఖపట్నం పైవంతెన మీదుగా వెళ్లేలా వాహనాల రాకపోకలకు ఇంటర్ ఛేంజ్ రహదారి నిర్మించారు. దేశంలో తొలుత చెన్నైలో నిర్మించగా.. ఇక్కడిది రెండోది కావడం గమనార్హం. ఈ రహదారి మీదుగా అనకాపల్లి వచ్చే వారంతా ప్రత్యేక అనుభూతి పొందుతున్నారు.

**రోడ్డుపై ఆక్విడక్టు.. నదిపై వంతెన**

ఎస్.రాయవరం మండలం దార్లపూడి వద్ద వరాహ నదిపై ఆక్విడక్టు నిర్మాణం జరుగుతోంది. పోలవరం ఎడమ కాలువ పనుల్లో భాగంగా ఈ ప్రాంతంలో కాలువ తవ్వడం అసాధ్యమని భావించిన ఇంజినీరింగ్ అధికారులు అడ్డురోడ్డు – నర్సీపట్నం ఆర్‌అండ్‌బీ రోడ్డు, వరాహ నదిపై ఆక్విడక్ట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 2017–18లో తెదేపా



ప్రభుత్వం రూ.154.86 కోట్లు మంజూరు చేసింది. సుమారు 1.3 కిలోమీటర్ల పొడవునా ఆరు కాలువలుగా ఆక్విడెక్ట్ నిర్మాణం ప్రారంభించారు.

**మన్యం సిగలో కేకే లైను**

అరకులోయ పర్యాటకం అంటే ముందుగా గుర్తుకొచ్చేది బొర్రా గుహలే. విశాఖపట్నం నుంచి రైలు మార్గంలో సొరంగాలు, ఎత్తయిన వంతెనలు, కొండల మీదుగా గుహలకు చేరుకోవచ్చు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఇంజినీరింగ్ అద్భుతాల్లో ఒకటైన కేకే లైను మన్యానికి మణిహారంగా నిలుస్తోంది. అధునాతన సాంకేతికత అందుబాటులో లేని రోజుల్లోనే అటవీ ప్రాంతంలో నిర్మించిన ఈ రైల్వే లైను చరిత్ర పుటల్లో నిలుస్తోంది. 1960లో జపాన్ సహకారంతో రూ.55 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభమై.. 1966లో పూర్తయింది. 445 కి.మీ. పొడవున్న ఈ రైల్వే మార్గంలో కొత్తవలస, బొర్రా, అరకు, జగదల్‌పూర్, దంతెవాడ, కిరండూల్ స్టేషన్‌లున్నాయి.

నాడు అధునాతన పరిజ్ఞానం అందుబాటులో లేకపోవడంతో టన్నెళ్ల నిర్మాణానికి థియోడోలైట్ సర్వే చేశారు. కొండల మధ్య ఎంత ఎత్తులో వంతెనలు నిర్మించాలి, మలుపులను గుర్తించేందుకు కంటౌర్ మ్యాపింగ్‌ను వినియోగించారు.

సొరంగాల నిర్మాణంలో భాగంగా కొండలను తొలిచేందుకు బ్లాస్టింగ్, పెద్ద పెద్ద యంత్రాలతో డ్రిల్లింగ్ చేశారు. ఒక్కో టన్నెల్ నిర్మాణానికి ఏడాదికిపైగా పట్టింది. తొలుత బ్రాడ్ గేజ్ వినియోగించగా ప్రస్తుతం హెవీ హైల్ ట్రాక్‌లను ఏర్పాటు చేశారు.

టైడా నుంచి సిమిలిగుడ స్టేషన్ మధ్యలో 58 సొరంగాలు (టన్నెళ్లు), 84 వంతెనలున్నాయి. ఈ టన్నెల్స్‌లో ఒకటి 520 మీటర్ల మేర విస్తరించి ఉంది. ఒడిశా నుంచి విశాఖపట్నం పోర్టుకు ఐరన్ ఓర్ (ముడి ఖనిజం) తరలించేందుకు ఈ రైల్వే లైన్ నిర్మించారు. ఆంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను కలుపుతూ వెళ్లే ఈ మార్గంలో సిమిలిగుడ రైల్వేస్టేషన్ సముద్ర మట్టానికి 3,271 ఎత్తులో ఉంది.

# ఇసుక దిబ్బలనూ వదలా..!

పాయకరావుపేట : ఇసుక అక్రమ రవాణాపై నిషేధం కాగితాలకే పరిమితమవుతోంది. ఇసుకాసురులు పగలు, రాత్రి తేడా లేకుండా దందా సాగిస్తున్నారు. అధికారులు నీరో చక్రవర్తుల్లా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ ఆదాయనికి గండి పడుతోంది. ఇసుక దిబ్బలు కనుమరుగవుతున్నాయి. రవాణాలో ట్రాక్టర్లు, నాటు బళ్ల యజమానులు ప్రత్యేక పంథా అవలంభిస్తున్నారు.

కేశవరంలో రాత్రి 9 గంటల తర్వాత ఇసుక తవ్వకాలకు తెరలేపుతున్నారు. రాత్రిపూట గ్రామాన్ని అడ్డాగా చేసుకుంటున్నారు. రైతుల పొలాల్లోని ఇసుకను ర్యాంపులు ఏర్పాటు చేసుకుని తెల్లావారే వరకు నాటుబళ్లపై తరలిస్తున్నారు. సమీపంలోని కొబ్బరితోటలు, రోడ్ల పక్కన నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి ట్రాక్టర్లపై అమ్మకాలు సాగిస్తున్నారు.


1.పగటి పూట ఇసుక తవ్వకాలకు కుమారపురం కేంద్రంగా మారింది. పంపా నది ఒడ్డున భూముల్లో ఇసుక దిబ్బలు అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. పెద్దఎత్తున ట్రాక్టర్లపై ఇసుక తరలిస్తున్నారు. ఇంటి నిర్మాణాలకు, పునాదుల్లో ఇసుక నింపేందుకు, పాల్మన్‌పేట



పరిధిలోని హేచరీల్లో చదును చేసేందుకు వినియోగిస్తున్నారు.

2.ట్రాక్టర్ ఇసుక రూ.మూడు వేల వరకు అమ్ముతున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో దర్జాగా తవ్వకాలు సాగుతున్నాయి. నదుల్లో తవ్విన ఇసుకలో అధిక ధరకు అంటగడుతున్నారు. 3.వాహనాల రాకపోకల కారణంగా పుంతరోడ్లు ధ్వంసమవుతున్నాయి. పంట భూములకు రైతులు వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. పదుల సంఖ్యలో నాటుబళ్లు, ట్రాక్టర్లపై ఇసుక తరలిపోతున్నా పట్టించుకునే నాథుడే లేరు. అధికారులకు ఫిర్యాదులు అందినా స్పందన శూన్యం. తవ్వకాల విషయమై సీఐ అప్పన్నను సంప్రదించగా.. అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేస్తామన్నారు.

# దేవుడి మాన్యం.. పరాధీనం



కళ్యాణదుర్గం :కళ్యాణదుర్గం నియోజకవర్గం కుందుర్పి మండల కేంద్రంలోని వీరభద్రస్వామి దేవాలయం 2.5 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఒక ఎకరాలో ఆలయ నిర్మాణం ఉంది. 1.5 ఎకరాలను ఆక్రమించి గడ్డి వాములు, రేకుల షెడ్లు ఏర్పాటు చేశారు. తొండపాడులోని బొలికొండ రంగనాథస్వామి ఆలయానికి తొండపాడు, గొందిపల్లితోపాటు నంద్యాల జిల్లాలో భూములున్నాయి. రూ.కోట్లు విలువజేసే ఈ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. గొందిపల్లిలో సుమారు 5 ఎకరాలు ఉండగా.. అందులో కొందరు వామిదొడ్లు ఏర్పాటు చేసుకున్నారు. మరికొందరు పక్కాగృహాలు నిర్మించుకున్నారు. గుత్తి మండలంలోని పలు గ్రామాల్లో ఆలయ భూములకు రక్షణ కొరవడుతోంది. రూ.కోట్లు విలువైన భూములు స్వార్థపరుల చేతుల్లోకి వెళుతున్నాయి. భద్రత కల్పించాల్సిన రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తి పడుతూ పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేస్తున్నారు.

**ఎక్కడెక్కడంటే..**

గుత్తి మండలం రజాపురం గ్రామంలోని విఘ్నేశ్వరస్వామి ఆలయానికి సర్వేనంబర్ 82లో 17.65 ఎకరాలు, 83లో 17.45 ఎకరాల భూమి ఉంది. ఓ సర్వే నంబర్‌లోని భూమిని గ్రామస్థులు వేలం వేసి గుత్తలు రాబడుతున్నారు. ఆ సొమ్మును గ్రామాభివృద్ధికి వాడుకుంటున్నారు. మరో భూమిని శ్రీపురానికి చెందిన 15 మంది ఆక్రమించారు. వీరికి రెవెన్యూ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వడం గమనార్హం.గుత్తిలోని రామస్వామి దేవాలయానికి సుమారు ఐదెకరాలు ఉండగా భజంత్రీల పేరుతో పదేళ్ల కిందట రెవెన్యూ అధికారులు పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారు. వాటిని ఇప్పటికీ రద్దు చేయడం లేదు.

జక్కలచెరువులో రంగనాథస్వామి ఆలయానికి ఇనామ్ భూమి ఉండగా ఓవ్యక్తికి మూడేళ్ల కిందట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారు. పట్టాదారు పాసుపుస్తకాల కోసం కొనుగోలు చేసిన వ్యక్తి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు.

గుత్తిలోని వ్యాసరాయమఠానికి చెందిన సుమారు 6 ఎకరాల్లో రెవెన్యూ అధికారులు ముందు వెనుక ఆలోచించకుండానే ప్రజలకు నివేశన స్థలాలు ఇచ్చి పట్టాలు మంజూరు చేశారు.

చెట్నేపల్లిలో శివుడి మాన్యం ఇతరుల ఆధీనంలో ఉంది.

**ఆక్రమణదారులపై కేసులు వేస్తున్నాం**

ఆలయ భూముల పరిరక్షణకు ఆర్డీవో కోర్టులో కేసులు వేస్తున్నాం. గుత్తిలోని రామస్వామి దేవాలయం, రజాపురంలోని విఘ్నేశ్వరుడి ఆలయ భూముల్లో ఉంటున్న వారిపై ఇప్పటికే కేసులు వేశాం. పట్టాదారు పాసుపుస్తకాలను రద్దుచేయాలని ఆర్డీవోకు విన్నవించాం.నాగేంద్రుడు, గ్రూపు ఆలయాల ఈవో, గుత్తి

# మార్కెట్లలో నమూనా యూనిట్లు



అనంతపురం : స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చెత్తతో సంపద సృష్టించడం, నీటిని ఆదా చేయడం.. ఈ రెండు ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలి. ప్రధానంగా వానపాములు యూనిట్లతో ఎరువు తయారు చేయడం, ఇంకుడు గుంతలు తీసి నీటిబొట్టును భూమిలో ఇంకేలా చేయడమే రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ఆశయం. ప్రతి వ్యవసాయ మార్కెట్ యార్డులో బహిరంగ ఖాళీ ప్రదేశాల్లో కనిపించేలా ఈ రెండు నమూనాలను విధిగా ఏర్పాటు చేయాలని తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏఎంసీ కార్యదర్శి తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఏఎంసీల్లో పనులు మొదలయ్యాయి.

**4 ఏఎంసీల్లో ఏర్పాట్లు**

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సంతలు జరిగే అనంతపురం, హిందూపురం, కళ్యాణదుర్గం, రాయదుర్గం వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో చీనీ, పండ్లు, పశువులు, చింతపండు, ఎండుమిరప వంటి సంతలు జరుగుతాయి. రైతులు పెద్ద సంఖ్యలో రైతులు వస్తున్నారు. రైతులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఆ నాలుగు వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ఇంకుడు గుంతలు, వానపాములు తయారీ యూనిట్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. యార్డులో చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలతో వానపాముల యూనిట్లు వినియోగించుకోనేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో వర్మికంపోస్టు యూనిట్లును ఏర్పాటు చేసి రెడ్డిపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రంలో వానపాములు కొనుగోలు చేసి యూనిట్లో వదిలినట్లు గ్రేడ్–2 కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు.

# 22 వరకు ఆగుదాం..అందరి చూపు జీఎస్‌టీ కొత్త స్లాబులపైనే




అనంతపురం : కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఈనెల 22న జీఎస్‌టీ (వస్తు సేవల పన్ను) విధానంలో కొత్త శ్లాబులను అమలు చేయనుంది. కొత్తగా కార్లు, బైకులు, టీవీలు, గృహోపకరణాలు, బీమా పాలసీలు తీసుకునే వారు అప్పటి వరకు ఆగాల్సిందేనని అంటున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సుమారు 60 వేల మంది జీఎస్‌టీలో నమోదు చేసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. వీరి నుంచి నెలకు రూ.90 కోట్లు జీఎస్‌టీ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది. అందులో సింహభాగం స్టీలు, సిమెంటు, ఆటోమొబైల్, నిర్మాణ రంగం ద్వారా వసూలవుతోంది. జీఎస్‌టీ రేట్ల సవరణ ప్రకటన వెలువడిన నాటి నుంచి ధరలు తగ్గే ఆయా ఉత్పత్తుల విక్రయాలు తగ్గిపోయాయి. వంటనూనెలు, నిత్యావసర సరకులపై జీఎస్‌టీ స్లాబులు తగ్గే నేపథ్యంలో టోకు వ్యాపారులు సరకు నిల్వలను, కొనుగోళ్లు తగ్గించారు.

**పుంజుకోనున్న వ్యాపారాలు**

స్టీలు, సిమెంటు ధరలు తగ్గి నిర్మాణ రంగం పుంజుకుంటుంది. కూలీలకు ఉపాధి లభిస్తుంది. ఓ మోస్తరు పెద్ద హొటళ్లు, లాడ్జిలలో రూముల అద్దెపై జీఎస్‌టీ పన్ను కొంత తగ్గిపోవడంతో పర్యాటక రంగం జోరుగా సాగుతుందని ఆయా రంగంలోని వ్యాపారులు అభిప్రాయంతో ఉన్నారు. ఆటోమొబైల్, వ్యవసాయ ఆధారిత రంగాలు బలోపేతమయ్యే అవకాశముంది. మధ్య తరగతి కుటుంబాలు, నిరుద్యోగులకు వాహనాలు కొనుగోలు చేసే వీలు కలుగనుంది. కొత్త శ్లాబుల ప్రయోజనాలను ఇప్పటి నుంచే కల్పిస్తామని హామీ ఇస్తూ.. కొన్ని కంపెనీలు ఒక్కో కారు ధరపై లక్ష రూపాయల నుంచి లక్షన్నర వరకు తగ్గించి అమ్ముతున్నాయి. కొత్త స్లాబులతో వివిధ వస్తువుల ధరలు తగ్గిపోయి వ్యాపారాలు తగ్గినా.. మళ్లీ పుంజుకుంటాయని వ్యాపారులు విశ్వసిస్తున్నారు.

# వందేళ్ల భవనాలు.. వన్నెతగ్గని కార్యాలయాలు

పెనుకొండ : 20వ శతాబ్దం ప్రారంభంలో బ్రిటీష్ ప్రభుత్వం నిర్మించిన అనేక భవంతులు 21వ శతాబ్దంలోనూ చెక్కు చెదరకుండా ఆనాటి ఇంజినీరింగ్ నిపుణులు, నాణ్యతకు అద్దం పడుతున్నాయి. 120 ఏళ్ల క్రితం నిర్మించిన అనేక భవనాల్లో నేటికీ వివిధ ప్రభుత్వ కార్యాలయలాలు నిర్వహిస్తున్నారు. పెనుకొండ పట్టణంలోని పాత 7వ జాతీయ రహదారి పక్కన 1904లో నిర్మించిన భవనాల్లో ఉపఖజానా కార్యాలయం, 1910గ్రా.నీ.స(గ్రామీణ నీటి సరఫరా) డీఈ, సబ్‌కలెక్టర్, 1904లో నిర్మించిన భవనంలో పశుసంవర్ధక శాఖ కార్యాలయం, పశువైద్యశాల, పట్టణంలోని ప్రధాన రోడ్డు పక్కన 1904లో నిర్మించిన భవనంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, నగరపంచాయతీ కార్యాలయం వద్ద 1907లో నిర్మించిన భవనంలో జడ్పీ బాలికల ఉన్నతపాఠశాల, జూనియర్ కళాశాల నిర్వహిస్తున్నారు. వీటితో పాటు బ్రిటీష్ ప్రభుత్వం నిర్మించిన అనేక భవనాలు నేటికీ వినియోగంలో ఉన్నాయి. ఇప్పటికే పలు భవనాల లోపలి భాగంలో రినోవేషన్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మించిన ఓ భవనం వాడుకలో లేకపోవడంతో పూర్తిగా శిథిలమైంది. ప్రస్తుతం ఆభవనంలోనే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండుతున్నారు. ఈ కార్యాలయాల ఆవరణలో నిర్మించిన అనేక భవనాలు 40 ఏళ్లకే శిథిలావస్థకు చేరుతున్నాయి, కానీ ఆనాటి నిర్మాణ నైపుణ్యం, పాటించిన నాణ్యత ప్రమాణాలతో ఆ భవనాలు నేటికీ వన్నెతగ్గకుండా విలసిల్లుతున్నాయి.

# అ'ధనం' ఇవ్వాల్సిందే

కర్నూలు : గృహ అవసరాలకు వినియోగించే వాయుబండల సరఫరాలో అదనపు వసూళ్లు మితిమీరిపోయాయి. జనం కష్టాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు అంతంతమాత్రమే.

**నగదు ఇవ్వకుంటే..**

అదనపు నగదు వసూలు విషయమై వినియోగదారుడు ప్రశ్నిస్తే ఏజెన్సీల నిర్వాహకులు తమకు జీతాలు ఇవ్వడం లేదని డెలివరీ బాయిస్ వాపోతున్నారు. బుకింగ్ చేసిన రెండు, మూడు రోజులు.. లేదా వారం రోజుల్లోపే సిలిండర్ పంపిణీ చేయాలి. అదనపు నగదు ఇవ్వనివారికి ఆలస్యం చేస్తున్నారన్న విమర్శలున్నాయి.

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం గ్యాస్ సిలిండర్లు తీసుకొచ్చే వాహనంలో యంత్రంతో తూకం వేసి అందించాలి. కానీ ఒక్క బండిలోనూ తూకం యంత్రం కనిపించదు.

**ఏటా రూ.36 కోట్ల వరకు భారం**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజుకు 30 వేల గ్యాస్ సిలిండర్లు సరఫరా అవుతాయి. ఒక్కోదానికి రూ.40 చొప్పున లెక్కేస్తే ప్రతి నెలా రూ.3 కోట్లకుపైగా అదనంగా వసూలు చేస్తున్నారు.

ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీ గోదాము నుంచి 15 కి.మీ. పరిధిలోని వినియోగదారుడి ఇంటి వరకు సిలిండరు చేర్చేందుకు రవాణా రుసుము వసూలు చేయకూడదు. అంతకుమించితే రూ.30 వసూలు చేయొచ్చు. కానీ పట్టణ పరిధిలోనే రూ.40–50, గ్రామీణ ప్రాంతాల్లో రూ.100 వరకు వసూలు చేస్తుండటం గమనార్హం.

**జరిమానా విధించినా..**

వాయుబండల సరఫరా, డెలివరీ బాయిస్ అదనపు వసూళ్లపై కూటమి ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేస్తోంది. అదనపు వసూలు చేస్తున్నారని పలువురు వినియోగదారులు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు గ్యాస్ ఏజెన్సీలను జేసీ గుర్తించి ఒక్కోదానిపై రూ.10 వేల వరకు జరిమానా విధిస్తున్నారు. గత నెలలో కర్నూలు జిల్లాలోనే 12 గ్యాస్ ఏజెన్సీలకు జరిమానా విధించారు. అయినప్పటికీ ఎలాంటి మార్పు రావడం లేదు.

**ఎవరికి ఫిర్యాదు చేయాలి**

ఎవరైనా అదనంగా డబ్బులు వసూలు చేస్తే జిల్లా పౌరసరఫరాల అధికారులు, తహసీల్దార్లు, ఆయిల్ కంపెనీల మార్కెటింగ్ అధికారులకు ఫిర్యాదు చేయొచ్చు. టోల్‌ఫ్రీ నంబరు 1967, 1800 2333555

# మన్నేసి.. ఆక్ర'ముంచేసి'

నంద్యాల : నంద్యాల పట్టణం మీదుగా వెళ్లే చామ కాలువ ఆక్రమణల చెరలో చిక్కుకుంది. నంద్యాల ఎస్‌బీఐ కాలనీలోని పెద్ద చెరువు నుంచి ప్రారంభమయ్యే ఈ కాలువ బొమ్మలసత్రం ప్రాంతంలోని కుందూ నది వరకు సుమారు 6.7 కి.మీ. పొడవునా విస్తరించి ఉంది. మహానంది ప్రాంతంలో కురిసే వర్షాలతో వచ్చే వరద నీరు పాలేరు వాగు ద్వారా ప్రవహించి చామ కాలువలో కలుస్తుంది. కొంతవరకు కేసీ కాలువ నీళ్లు సైతం ఎస్‌బీఐ కాలనీలో ఇదే కాలువలో కలుస్తాయి. మద్దిలేరు వాగు.. ప్రథమనంది ఆలయం సమీపంలో ఇదే కాలువలో కలుస్తుంది. ఈ మూడు కలిసిన సమయంలో చామ కాలువకు వరద పోటెత్తుతుంది. ప్రస్తుతం ఆక్రమణలకు గురవడంతో చిన్నపాటి వర్షానికే ఉగ్రరూపం దాల్చి పట్టణాన్ని ముంచెత్తుతోంది.

**2 వేల క్యూసెక్కుల నుంచి..**

పట్టణంలో ఎస్‌బీఐ కాలనీ నుంచి సాయిబాబానగర్ వరకు 3.3 కి.మీ.లు, సాయిబాబానగర్ నుంచి బొమ్మలసత్రం వరకు 3.4 కి.మీ. పొడవునా చామ కాలువ విస్తరించి ఉంది. గత ఐదు దశాబ్దాలుగా ఈ కాలువలో గరిష్ఠ వరద ప్రవాహం 2 వేల నుంచి 2,500 క్యూసెక్కులు. రానురాను ఆక్రమణలతో కాలువ కుచించుకుపోయింది. ఎస్‌బీఐ కాలనీ, విశ్వనగర్, సాయిబాబానగర్, గోపాల్‌నగర్, సరస్వతి నగర్, పద్మావతినగర్, సలీంనగర్, హనీఫ్‌నగర్ తదితర ప్రాంతాల్లో కాలువ ఆక్రమణలకు గురైంది. ఫలితంగా 200 నుంచి 300 క్యూసెక్కుల వరద నీరు వస్తేనే పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి.

**విలువ రూ.70 కోట్ల పైమాటే**

పట్టణంలో ఎస్‌బీఐ కాలనీ, విశ్వనగర్, శ్యామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో చామ కాలువ పెద్దఎత్తున ఆక్రమణలకు గురైంది. దీనిని ఆనుకుని కట్టడాలు నిర్మిస్తున్నవారు కాలువలోకి మట్టి వేసి పూడ్చేస్తున్నారు. ఆక్రమణదారులకు రాజకీయ అండదండలు ఉన్నాయన్న విమర్శలున్నాయి. విశ్వనగర్ ప్రాంతంలో కొందరు వాగు స్థలాలను ఆక్రమించి ప్రహరీ నిర్మించుకున్నారు. గోపాల్‌నగర్, సాయిబాబానగర్ తదితర ప్రాంతాల్లో ఆక్రమించి నిర్మాణాలు చేశారు. కేసీ కాలువ అధికారుల లెక్కల ప్రకారం 6.7 కి.మీ. పొడవునా చామ కాలువ విస్తరించి ఉంది. ప్రస్తుతం 2.5 ఎకరాలకు పైగా కాలువ స్థలం ఆక్రమణలకు గురైనట్లు అంచనా వేస్తున్నారు. బహిరంగ విపణిలో దీని విలువ రూ.70 కోట్లకుపైగా ఉంటుందని అంచనా.

# ఆక్రమణల'కేసీ' చూసేదెన్నడో!

కర్నూలు : కర్నూలు కడప (కేసీ) కాలువకు సంబంధించిన విలువైన స్థలాలు పెద్దఎత్తున ఆక్రమణలకు గురవుతున్నాయి. అయినప్పటికీ జలవనరుల శాఖ అధికారులు దృష్టి సారించడం లేదు. తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఆక్రమణదారులకు కనీసం తాఖీదులు కూడా జారీ చేయడం లేదు. ఈ నేపథ్యంలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.

కర్నూలు నగర పరిధిలో కేసీ కాలువ 4.50 కి.మీ.ల పొడవునా విస్తరించి ఉంది. ధర్మపేట, బంగారుపేట, లక్ష్మీనగర్, స్వామిరెడ్డినగర్, జొహరాపురం తదితర కాలనీల మీదుగా కాలువ వెళుతుంది. జొహరాపురం ప్రాంతంలో కేసీకి సంబంధించి విలువైన స్థలాలు ఉన్నాయి. కానీ అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు కన్నేశారు. స్థలాలను యథేచ్ఛగా ఆక్రమించుకుని పక్కా కట్టడాలు చేపడుతున్నారు.

ఎవరూ దృష్టి సారించక..

కర్నూలులో జలవనరుల శాఖకు సంబంధించి సీఈ, ఎస్ఈతోపాటు ఇతర అధికారులు, క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది ఉన్నప్పటికీ ఆక్రమణలపై దృష్టి సారించడం లేదు. గతంలో ఇరిగేషన్‌లో పనిచేసే కొందరు సిబ్బందికి కేసీ కాలువ ప్రాంతంలో నిబంధనల మేరకు స్థలాలు కేటాయించారు. వీటిని ఆసరాగా చేసుకుని పలువురు బినామీలు రెచ్చిపోతున్నారు. మరోవైపు కొందరు నేతల ప్రోత్సాహంతో నిర్మాణాలు సాగుతుండటం గమనార్హం.

కేసీ కాలువ నిర్వహణకు సంబంధించిన ఇంజినీర్లు బృందంగా ఏర్పడి లస్కర్లతో కలిసి కాలువ వెంబడి నిరంతరం పర్యటించాలి. ఎక్కడైతే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయో గుర్తించి తాఖీదులు జారీ చేయాలి. అవసరమైతే పోలీసు, రెవెన్యూ అధికారుల సహకారం తీసుకుని వాటిని తొలగించేలా చర్యలు చేపట్టాలి.

# మరీ ఇంత తాత్సారమా..!

చిత్తూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ-పంట నమోదుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి.. ఈ ఏడాది జాతీయ సమాచార కేంద్రం (ఎన్ఐసీ) ద్వారా ఖరీఫ్-2025లో 'ఈ-పంట డిజిటల్ క్రాప్ సర్వే' పేరుతో కొత్త యాప్ రూపొందించారు.. ఈ సర్వేతో సాగు భూముల వివరాలు కచ్చితంగా, పారదర్శకంగా ఉండేలా ఈ-పంట నమోదుకు శ్రీకారం చుట్టారు.. ఇదివరకు సాధారణంగా పంటల వివరాలు మాత్రమే ఈ-పంటలో నమోదు జరిగేది.. ఈ ఏడాది సాగులో లేని భూములను సైతం ఈ-పంట కింద నమోదు చేయాల్సిందే.. జిల్లాలో ఈ-పంట నమోదు ముందుకు సాగలేదు.. రైతుసేవా కేంద్రాల ఉద్యోగుల బదిలీలు, రెవెన్యూ సమస్యలు తదితర కారణాలతో ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతోందని ఆ శాఖ అధికారులే పేర్కొంటున్నారు.

**కేవలం 8,030 ఎకరాల్లోనే నమోదు**

జిల్లాలో ఇప్పటివరకు ఖరీఫ్ సీజన్ ఈ-పంట నమోదు కేవలం 8,030 ఎకరాలకే పరిమితమైందంటే ఎంత అలసత్వమో అర్థమవుతోంది. ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం సుమారు 1.80 లక్షల ఎకరాలు. ఇప్పటి వరకు సాగైన విస్తీర్ణం 42 వేల ఎకరాలు. ఇవీ వ్యవసాయ శాఖ లెక్కలు. క్షేత్రస్థాయిలో ఎక్కువ విస్తీర్ణంలో సాగైనప్పటికీ అధికారుల లెక్కల్లో తక్కువ విస్తీర్ణంలో సాగైనట్లు చూపుతున్నారని రైతులు



పేర్కొంటున్నారు.

**అడ్డంకిగా.. ఉద్యోగుల బదిలీలు**

రైతు సేవా కేంద్రాల సహాయకులు, మండల వ్యవసాయాధికారుల బదిలీల ప్రక్రియ సమస్య తెచ్చిపెట్టింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటం, శాఖల మధ్య సమన్వయ లోపం తదితర కారణాలతో నిర్దేశిత ప్రాంతంలో అధికారులు, సిబ్బంది బాధ్యతలు స్వీకరించక పోవడంతోనే ఈ-పంట నమోదుకు తీవ్ర అడ్డంకిగా మారింది.

**కీలకమైనా..**

సాగు ప్రోత్సాహక పథకాల అమలు, ఎరువులు కేటాయింపు తదితర వ్యవసాయ పథకాలకు ఈ-పంట నమోదు కీలకం. ఈ-పంటలో సాగు వివరాలు నమోదు కాకపోతే సాగు ప్రోత్సాహక పథకాలు రైతులకు వర్తించవు. ఉన్నతాధికారులు స్పందించి ఈ-పంట నమోదు వేగవంతానికి దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**వేగవంతానికి చర్యలు..** జిల్లాలో 'ఈ-పంట డిజిటల్ క్రాప్ సర్వే' వేగవంతానికి చర్యలు చేపట్టాం. మార్గదర్శకాల ప్రకారం పక్కాగా నమోదుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం.

మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

# నల్లమల నన్నారి

ఆత్మకూరు : వైవిధ్య జంతు వృక్ష సంపదకు నిలయమైన నల్లమల నన్నారి(సుగంధ పాలు) గడ్డలకు నిలయం. వీటితో తయారు చేసిన షర్బత్‌కు మార్కెట్లో మంచి ఆదరణ ఉంది. నాణ్యమైన అర కిలో లీటరు సీసా రూ.150 వరకు విక్రయిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దీన్ని కొందరు ఉపాధిగా మల్చుకొన్నారు. నల్లమలకు సమీపంలో ఉన్న గ్రామాల్లో ప్రత్యేకంగా సాగు చేస్తున్నారు. మార్కెట్లో డిమాండ్ ఆసరా చేసుకొని నన్నారి గడ్డను తక్కువకు కొనుగోలు చేసి మోసం చేస్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రధాన మంత్రి వన్‌ధన్ వికాస్ యోజన కింద గిరిజన గూడేల్లో జీవనోపాధి కల్పనకు శ్రీకారం చుట్టారు. ఆత్మకూరులో రూ.20 లక్షలతో నెలకొల్పిన కేంద్రాన్ని నుంచి అందుబాటులోకి తీసుకొచ్చారు.

**15 ఎకరాల్లో ప్రత్యేక సాగు**

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఐటీడీఏ ఆధ్వర్యంలో ఆత్మకూరు



మండలం బైర్లూట్టి గూడెంలో రూ.10 లక్షలతో రెండు ఎకరాల్లో గతేడాది నన్నారి నర్సరీ ఏర్పాటు చేశారు. 15 ఎకరాల్లో సాగు చేసేందుకు రైతులకు మొక్కలు అందజేశారు. కొత్తపల్లి మండలం ఎర్రమఠం, శివపురం, చదరం పెంట గూడెం, పగిడ్యాల మండలం, మార్కాపురం డివిజన్ ఎర్రగొండ పాలెం చెంచు రైతులకు అందజేశారు.

**మూడేళ్ల నుంచి ఆదాయం**

నన్నారి మొక్క మూడేళ్ల నుంచి ఆదాయం ఇస్తుంది. తల్లి వేరు అలాగే ఉంచి పిల్లవేర్లను వాడుకుంటే 12 ఏళ్లపాటు ఆదాయం వస్తుంది. ఒక మొక్క నుంచి ఏడాదికి 1-3 కిలోల పిల్లవేర్లు సేకరించొచ్చు. అరకిలో నుంచి కిలో వరకు ఎండిన వేర్లు సేకరిస్తారు. కిలో నన్నారి గడ్డల ధర మార్కెట్‌లో రూ.500 నుంచి రూ.600 వరకు ఉంది. ఒక ఎకరంలో 10వేల నుంచి 12వేల వరకు మొక్కలు నాటుతారు. సుమారు 10వేల వరకు ఆదాయాన్ని ఇస్తాయి.

కొట్టాల చెరువు గూడెంలో కోవెల్ ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యంలో ఐదేళ్లుగా 15మంది మహిళా రైతులు వేయి చొప్పున నన్నారి మొక్కలు పెంచుతున్నారు. రెండేళ్లుగా ఒక్కొక్కరు ఏటా 500 కిలోలకు పైగా గడ్డలు విక్రయించి రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం పొందారు.

# రండి.. 'బారు'లు తీరండి

ఏలూరు : బార్ లైసెన్సులకు ఎక్కువ మంది పోటీ పడేలా ప్రొహిబిషన్, ఎక్సైజ్ యంత్రాంగం అవగాహన కల్పిస్తోంది. మూడేళ్ల కాలానికి వాటికి లైసెన్సుల జారీకి ఈనెల 18న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తు రుసుములను ప్రభుత్వం అనూహ్యంగా తగ్గించి సాధ్యమైనంత వరకు ఎక్కువ మంది పోటీ పడటానికి అవకాశం కల్పించింది. ఈపై ఈసారి లాటరీ విధానంలో ఎంపిక చేస్తారు. అంతేకాదు నిర్దేశిత లైసెన్సు ఫీజును ఆరు సులభ వాయిదాల్లో చెల్లింపులు చేసుకునే అవకాశం కల్పించింది.అందరికీ అవకాశం.. ఇవన్నీ వ్యాపారులకు వివరించి ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకునేలా ఉప కమిషనర్ బి.శ్రీలత పర్యవేక్షణలో జిల్లా పర్యవేక్షకుడు ఆవులయ్య చర్యలకు శ్రీకారం చుట్టారు. గతంలో మద్యం దుకాణాలకు పోటీ పడి అప్పట్లో దుకాణాలు దక్కనివారి జాబితాను బయటకు తీసి బుధవారం నుంచే వారికి ఫోన్లు చేసి ప్రభుత్వ నిర్ణయాలను తెలియజేసి దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించారు. ఇదే తరహాలో పశ్చిమగోదావరిలోనూ సహాయ కమిషనర్ ప్రభుకుమార్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. రూ.10 లక్షలు ఉన్న దరఖాస్తు రుసుమును తాజాగా ప్రభుత్వం రూ.5 లక్షలకు తగ్గించింది.

# నిర్వహణ అస్తవ్యస్తం.. 'నీరు'గారిన లక్ష్యం





ధర్మవరం : శ్రీసత్యసాయి జిల్లాలోని పలు సర్కారు పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు అటకెక్కాయి. నిర్వహణ లేకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ఫలితంగా విద్యార్థులు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. చాలా పాఠశాలల్లో పిల్లలు ఇంటి వద్ద నుంచి సీసాల్లో మంచి నీరు తెచ్చుకుంటున్నారు. కొందరు ఉపాధ్యాయులు తమ సొంత ఖర్చులతో శుద్ధజల క్యాన్లు కొనుగోలు చేసి విద్యార్థుల దాహార్తి తీరుస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. పాఠశాలల స్థాయిని బట్టి రూ.65 వేల నుంచి రూ.1.85 లక్షలతో వీటిని ఏర్పాటు చేశారు. పనులు దక్కించుకున్న ఏజెన్సీ ప్రతినిధులు మూడు, నాలుగేళ్లపాటు వీటి నిర్వహణ బాధ్యతలు చూడాల్సి ఉంటుంది. అయితే ప్లాంట్లు ఏర్పాటు చేసిన ఆరు నెలలకే పలుచోట్ల మరమ్మతులకు గురయ్యాయి. వీటికి సకాలంలో మరమ్మతులు చేసి ఉంటే సమస్య ఉండేది కాదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్లాంట్ల నిర్మాణాలు చేపట్టే సమయంలో ఏజెన్సీ నిర్వాహకులు ప్రతి కేంద్రానికి టోల్‌ఫ్రీ నంబర్ ఇచ్చారు. హెచ్ఎంలు, విద్యాశాఖాధికారులు ఆ నెంబరుకు ఫోన్లు చేస్తుంటే అందుబాటులోకి రాలేదు. దీంతో చాలాచోట్ల యంత్రాలు మూలకుచేరాయి.

**ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడుతున్నాం**

- దేవరాజ్, ఎస్ఎస్ఏ జిల్లా అధికారి

ఆర్వో ప్లాంట్లలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో మరమ్మతులు చేసేందుకు ఏజెన్సీ నిర్వాహకులు అందుబాటులోకి రావడం లేదు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వాటిని బాగుచేయించి, విద్యార్థులకు శుద్ధజలం అందేలా చర్యలు చేపడతాం.

ధర్మవరం పట్టణంలోని శాంతినగర్ ప్రభుత్వ పాఠశాలలో 450 మంది విద్యార్థులున్నారు. ఈ పాఠశాల నాడు-నేడు పథకానికి ఎంపికై నిధులు మంజూరైనా తరగతి గదుల నిర్మాణాలు పూర్తి కాలేదు. ఇక ఆర్వో ప్లాంటు నేటికి ప్రారంభానికి నోచుకోక మూలన పడింది.

ధర్మవరం పట్టణంలోని నెహ్రూనగర్ ఉన్నత పాఠశాల్లో 430 మంది విద్యార్థులున్నారు. ఇక్కడ ఆర్వో ప్లాంటు సక్రమంగా పనిచేయక పోవడంతో అధ్యాపకులు సొంత ఖర్చుతో బాగు చేయించారు. అయినా పని చేయడం లేదు. ధర్మవరంలోని కోట ప్రాథమిక పాఠశాలలో ఆర్వో ప్లాంటు పని చేయకపోవడంతో మూలనపడేశారు. హెచ్ఎం తన సొంత డబ్బుతో క్యాన్లు కొనుగోలు చేసి పిల్లల దాహార్తి తీరుస్తున్నారు. ఇక్కడ 45 మందికిపైగా విద్యార్థులు ఉన్నారు.కదిరి మండలంలోని బాలప్పగారిపల్లి ఆదర్శ పాఠశాలలో ఆర్వో ప్లాంట్ గత ఏడాది నుంచి పని చేయడం లేదు. ఇక్కడ 84 మంది విద్యార్థులున్నారు. అందరూ ఇళ్ల నుంచి సీసాలతో మంచినీరు తెచ్చుకుంటున్నారు. జిల్లా : శ్రీసత్యసాయి ప్రభుత్వ పాఠశాల సంఖ్య: 2,061

ఆర్వో ప్లాంట్లు నిర్మించినవి : 1,365

మరమ్మతులకు గురైన ప్లాంట్లు: 679

# 'కోడై'కూస్తున్నా.. పట్టుకోలేరా?!



విశాఖపట్నం: ఏజెన్సీ ప్రాంతాలు, ఒడిశా నుంచి వచ్చే గంజాయి రవాణాకు ఎంతగా అడ్డుకట్ట వేస్తున్నా...నగరంలో అమ్మకాలు మాత్రం చాపకింద నీరులా సాగిపోతున్నాయి. ఇందుకు కొన్ని పాన్‌షాపులు, బడ్డీ కొట్లు కేంద్రంగా మారాయి. ప్రత్యేక కోడ్ పెట్టి ...అది చెప్పిన వారికే గంజాయి విక్రయిస్తున్నారు. నగరంలో కొన్ని పాన్‌షాపుల్లో 24 గంటలూ అమ్ముతున్నారు. ఆరిలోవ వద్ద కొన్ని కాలనీల కూడళ్లలోనే అమ్మేస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు అడ్డుకోలేకపోవడం గమనార్హం.నగరంలో ఇటీవల ఓ కారు బాలుడిని ఢీకొట్టింది. ఆ కారును పోలీసులు సీజ్ చేశారు. అందులో పరిశీలించగా 21 కిలోలు గంజాయి బయటపడింది. ఆకస్మిక తనిఖీలతో గంజాయి కట్టడికి ప్రత్యేకంగా ఎనిమిది బీట్స్ ఏర్పాటు చేశారు. నగరంలో పెద్ద సంఖ్యలో పాన్‌షాప్‌లున్నా..గడిచిన ఏడు నెలల వ్యవధిలో పోలీసులు 82 పాన్‌షాపులనే తనిఖీ చేశారు.ఓల్డ్ కరసా బస్‌బే వెనుక వైపు పెట్రోలు బంకు ఉంది. కొందరు యువత గంజాయి మత్తులో సిగరెట్లు తాగుతూ కాల్చి పెట్రోలు బంకులోకి విసిరేయడంతో ఇటీవల అన్‌లోడ్ చేస్తున్న ట్యాంకర్‌పై పడిందని సదరు యజమాని జీవీఎంసీలో ఈనెల 18న ఫిర్యాదు చేశారు. ఈ బంకు సమీపంలోనూ ఓ దుకాణంలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం. పాత నేరస్థులు, రౌడీషీటర్లు గంజాయి అమ్మకాలు చేస్తున్నారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాలతో రౌడీషీటర్లు, పాత నేరస్థుల ఇళ్లల్లో పోలీసులు మంగళవారం సోదాలు నిర్వహించారు. ఓ చోట రెండు కిలోల గంజాయి దొరికింది.

ఈ ఏడాది ఇప్పటి వరకు నమోదైన గంజాయి కేసులు : 147

అరెస్టు చేసిన నిందితులు: 292

స్వాధీనం చేసుకున్నది: 1,684 కేజీలుబీ 21 కేజీల హ్యాష్ ఆయిల్.

# వసూల్‌రాజాల్లా రక్షక భటులు



అనకాపల్లి : చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిని పట్టుకుని చట్టం ముందు నిలబెట్టాల్సిన పోలీసులే దారి తప్పుతున్నారు. సంపాదన కోసం తమ పరిధులను అతిక్రమిస్తున్నారు. సివిల్ వ్యవహారాల్లో తలదూర్చి.. కేసుల పేరుతో భయపెడుతున్నారు. రియల్ దందాలు, జూద శిబిరాలు, భూ తగాదాలను సైతం ఆదాయ వనరుగా చేసుకుని కొంతమంది రెచ్చిపోతున్నారు. అన్యాయం జరిగిందని స్టేషన్‌కు వస్తే చాలు.. సెటిల్‌మెంట్ చేయడం, అవతలి వ్యక్తులను బెదిరించి, భయపెట్టి అందినకాడికి దండుకుంటున్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే కార్యక్రమాలు, ఇతర వ్యవహారాలు, ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు నివేదికలు చేరవేసేందుకు ప్రత్యేక వ్యవస్థ ఉంటుంది. కానీ..జిల్లాలో ఆ నిఘా వ్యవస్థను అమలు చేయడం లేదు. బాధితులే నేరుగా జిల్లా కేంద్రానికి వెళ్లి ఫిర్యాదు చేస్తే తప్ప అధికారులకు తెలియని పరిస్థితి నెలకొంది. సరైన పర్యవేక్షణ లేకపోవడం, అడిగేవారు కనిపించకపోవడంతో పోలీసుల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. ముఖ్యంగా కొంతమంది పోలీసుల వ్యవహార శైలి శ్రుతిమించుతోంది. జూద శిబిరాలు, దాబాల నిర్వాహకులు, క్వారీ లారీల నుంచి నెలవారీ వసూళు తీసుకుని వారిని ప్రోత్సహిస్తున్నారు. పండగల సమయాల్లో పిక్కాట, నిషేధిత ఆటకు ఒక్కో రేటు పెట్టి రూ.లక్షల్లో దోచుకుంటున్నారు. అనకాపల్లి పట్టణ పరిధిలో అయితే.. తుక్కు దుకాణం నుంచి బెల్ట్ దుకాణాలు, గుట్కా షాపుల నుంచి కానిస్టేబుళ్లను పెట్టి మరీ వసూళ్లు చేయిస్తున్నారు. అవినీతి కార్యకలాపాలకు పోలీస్ స్టేషన్లనే అడ్డాగా మార్చేస్తున్నారు.

**అడిగేవారు లేకనే ఆగడాలు..**

ఇటీవల కాలంలో ఓ బంగారం వ్యాపారి న్యాయం చేయాలంటూ అనకాపల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్తే.. న్యాయం చేయకపోగా ఆ వ్యాపారి నుంచే రూ. 50 వేల లంచం తీసుకుంటూ ఎస్సై ఈశ్వరరావు అవినీతి నిరోధక శాఖ అధికారులకు అడ్డంగా దొరికారు. ఈ వ్యవహారంలో ఈయన పైఅధికారి ప్రమేయం కూడా ఉందన్న ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. కొద్దిరోజుల క్రితం జూదశిబిరంపై దాడి చేయగా భారీగా సొమ్ము దొరికినా.. కేవలం రూ. 20 వేలే దొరికినట్లు చూపించి, మిగిలిన సొమ్ము జేబులో వేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చాలా క్వారీలు, క్రషర్లు ఉన్నాయి. వీటి నుంచి రోజూ వంద సంఖ్యలో లారీలు పోలీస్ స్టేషన్‌కు ముందుగానే వెళ్లాలి. ఇందుకోసం ట్రాన్స్‌పోర్టు, క్రషర్, క్వారీ యజమానులు ప్రతి నెలా భారీగా ముడుపులు చెల్లిస్తున్నట్లు తెలిసింది. కె.కోటపాడు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట మరిడమ్మతల్లి ఆలయం దగ్గరే సెటిల్‌మెంట్లు జరుగుతున్నాయి. ఇటీవల చౌడువాడలో అశ్లీల నృత్యాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేసినా పట్టీపట్టనట్లు వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి.

అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో పరిశ్రమలు అధికంగా ఉన్నాయి. వాటిల్లో చిన్నచిన్న లీకేజీలు వచ్చినా.. ప్రమాదాలు, వివాదాలు జరిగినా సంబంధిత పోలీసులకు పెద్దమొత్తంలో సొమ్ము చెల్లించాలి. లేదంటే కేసులు పెడతామని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పారిశ్రామికవేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నాళ్ల క్రితం అచ్యుతాపురం మండలం వెంకటాపురంలోని ఓ బెట్టింగ్ ముఠా దగ్గర భారీగా డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం

జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న అనకాపల్లి, కశింకోట, ఎలమంచిలి, ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో అధికంగా రోడ్లు ప్రమాదాలు, ఇతర కేసుల్లో న్యాయం చేయాలంటూ వచ్చిన వారి నుంచి దండిగా వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

# పది మీటర్ల దూరం.. పది కిలోమీటర్ల ప్రయాణం

బుచ్చెయ్యపేట : జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు భీమిలి-నర్సీపట్నం రహదారిపై విజయరామరాజుపేట దగ్గర తాచేరుపై కాజ్‌వే పూర్తిగా ధ్వంసమైంది. సిమెంటు తూములు, రాళ్లు, మట్టిరోడ్డు ప్రవాహంలో కొట్టుకుపోయాయి. 2023 డిసెంబరు నెలలో తాచేరుపై వంతెన కూలిపోవడంతో తాత్కాలికంగా ఈ కాజ్‌వే నిర్మాణం చేపట్టారు. రెండేళ్లు గడిచిపోతున్నా కొత్త వంతెన నిర్మాణం జరగలేదు. ఫలితంగా తాత్కాలిక కాజ్‌వేపైనే ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. గతేడాది సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాలకు కొంతమేర దెబ్బతింది. వెంటనే మరమ్మతులు చేయించి రాకపోకలను పునరుద్ధరించారు. ఈసారి పూర్తిగా తుడిచిపెట్టుకుపోవడంతో మరమ్మతులు ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

తాచేరుకు అవతల వైపున విజయరామరాజుపేట, ఇవతల వైపున వడ్డాది గ్రామాలు ఉన్నాయి. విజయరామరాజుపేట గ్రామస్థులు వ్యవసాయ, వ్యాపారాలు, ఇతర పనులపై నిత్యం వడ్డాది వచ్చి వెళతారు. పక్కపక్కనే ఉన్నా కాజ్‌వే కొట్టుకుపోయిన దగ్గర నుంచి ఈ రెండు గ్రామాల మధ్య సంబంధాలు పూర్తిగా తెగిపోయినట్లయింది. మధ్యలో ఉన్న తాచేరు దాటి పదిమీటర్లు వెళితే వడ్డాది గ్రామానికి చేరుకున్నట్లే. అలాంటిది విజయరామరాజుపేట గ్రామస్థులు ఇపుడు వడ్డాది గ్రామానికి రావడానికి నానా అవస్థలు పడుతున్నారు. కుముందానుపేట, మంగళాపురం, కె.జె.పురం, వంటర్లపాలెం గ్రామాల మీదగా పది కిలోమీటర్లు తిరిగి వస్తున్నారు.వడ్డాది దగ్గర కాజ్‌వే అప్రోచ్ రోడ్డు సైతం స్వల్పంగా దెబ్బతింది. శిథిలవంతెనపై నుంచి ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే వీరికి కష్టాలు తప్పడం లేదు. కొత్తవంతెనల నిర్మాణం గురించి పాలకులు పట్టించుకోకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# మృత్యుగుంతలు

నంద్యాల: చెరువులు, కుంటలు, నదులు, బంజరు భూముల్లో ఇష్టారాజ్యంగా తవ్విన గుంతలు మృత్యుకుపాలుగా మారుతున్నాయి. ఈతకు వెళ్లిన చిన్నారులు, దుస్తులు ఉతకడానికి, చేపల వేటకు వెళ్లిన పెద్దవారినీ బలి తీసుకుంటున్నాయి. వైకాపా ప్రభుత్వంలో చెలరేగిపోయిన మట్టి మాఫియా విచ్చలవిడిగా అక్రమ తవ్వకాలు చేసింది. వీటితో ఏర్పడిన గుంతల వద్ద కనీస చర్యలు తీసుకోకపోవ డంతో ప్రమాదకరంగా మారాయి.

కర్నూలు జిల్లాలోని ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు, పత్తికొండ ప్రాంతాలతోపాటు నంద్యాల జిల్లాలోని కుందూ పరీవాహకం వెంట నంద్యాల, బండిఆత్మకూరు, కోవెలకుంట్ల, పాణ్యం మండలాలతోపాటు నల్లమల్ల అటవీ ప్రాంతంలోని మహానంది, శిరువెళ్ల, రుద్రవరం, చాగలమర్రి మండలాల్లోని వివిధ చెరువుల్లో అక్రమ మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. కృష్ణా పరీవాహకంలోని నందికొట్కూరు ప్రాంతంలో కూడా జరుగుతున్నాయి. వైకాపా ప్రభుత్వంలో నందికొట్కూరు, కొత్తపల్లి ప్రాంతాల్లో కృష్ణా నది ఒడ్డున పెద్దఎత్తున అక్రమ మట్టి తవ్వకాలు జరిగాయి. మహానంది మండలం అంకిరెడ్డిపల్లె చెరువు, నంద్యాల సమీపంలోని కుందూ నది ఒడ్డున అక్రమ తవ్వకాలు జరిగాయి. ఇటుక బట్టీలు, పొలాలకు మట్టి కోసం తవ్వకాలు జరిగాయి.

చెరువులు, కుంటలు, నదులను నీటిపారుదల శాఖ పర్యవేక్షిస్తుంది. మట్టి తవ్వకాలు చేపట్టాలంటే రెవెన్యూ శాఖ నిరభ్యంతర పత్రం ఇవ్వాలి. మైనింగ్ శాఖకు రుసుం చెల్లిస్తే అనుమతి ఇస్తారు. ఈ మూడు శాఖల మధ్య సమన్వయ లోపం కనిపిస్తుంది. అనుమతులు లేకుండానే కొందరు నాయకుల అనుచరులు అక్రమ తవ్వకాలు చేస్తున్నారు. గుంతల వద్ద హెచ్చరిక బోర్డులూ ఏర్పాటు చేయలేదు.



**స్పిల్‌వేకు మించి తవ్వకాలు**

సాధారణంగా చెరువులు, నదులు, కుంటల్లో ఎంఎఫ్ఎల్(మాగ్జిమం ఫ్లడ్ లెవల్) నుంచి కిందకు 2 మీటర్ల లోతు(స్పిల్ లేవల్) వరకు మాత్రమే అనుమతులు ఇస్తారు. ఇంతకు మించి తవ్వకాలు చేస్తే.. చెరువులు, కుంటలకు నీళ్లు వచ్చినా స్పిల్ లేవల్‌కు అందవు. దీంతో ఆయకట్టు ప్రశ్నార్థకమవుతుంది. నల్లమల అటవీ ప్రాంతమైన నంద్యాల ప్రాంతాల్లోనైతే అడుగు నుంచి అడుగున్నర అడుగుల వరకు మాత్రమే అనుమతులు ఇస్తారు. బనగానపల్లి, డోన్ వంటి కొండ ప్రాంతాల్లో 4 అడుగుల లోతు వరకు తవ్వుకోవచ్చు. చాలాచోట్ల వేసవిలో పొలాలకు మట్టి పేరుతో చెరువులు, కుంటల్లో తీసుకున్న అనుమతుల కంటే ఎక్కువ లోతులో తవ్వకాలు చేస్తున్నారు. మరికొందరు అనుమతులు తీసుకోకుండానే ఇష్టారాజ్యంగా తవ్వడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. వీటి కారణంగా నీళ్లు స్పిల్‌వేకు అందకుండా పోతున్నాయి. ఈ గుంతలో నీళ్లు నిలిచి ఉండడంతో చిన్నారులు, చేపల కోసం వెళ్లిన పెద్దలు మునిగిపోతున్నారు.

# ఆక్రమణల ముప్పుటేరు

భీమవరం : మూడు జిల్లాల పరిధిలో ప్రవహించే ఉప్పుటేరుపై గత వైకాపా ప్రభుత్వం శీతకన్ను వేయడంతో కబ్జాలు పెరిగి వేల ఎకరాలు మునిగేవి. రైతులు గగ్గోలు పెట్టినా కనీసం తూడు తొలగించిన పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టడంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కృష్ణా డెల్టా ఎగువ, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల నుంచి బుడమేరుకు నీరు పోటెత్తడంతో ఆ ప్రభావం కొల్లేరుపై పడి అక్కడి నుంచి ఉప్పుటేరును తాకింది. ఆకివీడు, కాళ్ల, భీమవరం మండలాల నుంచి దిగువ ప్రాంతాల వరకు తూడు, ఆక్రమణలు పెరిగిపోవడంతో ఎక్కడికక్కడ ప్రవాహానికి అవరోధం ఏర్పడుతుంది. ప్రస్తుతం ప్రవాహ వేగం తక్కువగా ఉన్నా ఏ సమయంలో ఏం జరుగుతుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరు జిల్లాల ఉన్నతాధికారులు, ఉప సభాపతి రఘురామకృష్ణరాజు, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆయా ప్రాంతాలను పరిశీలించి, ఆక్రమణల తొలగింపునకు ఆదేశాలిచ్చారు.

1400 ఎకరాలకు పైగా.. ఏరుకు ఓ వైపున ఏలూరు, కృష్ణా జిల్లాలు, రెండో వైపున పశ్చిమ గోదావరి జిల్లా ఉన్నాయి. అటు ఇటు మొత్తం 1400 ఎకరాలకు పైగా ఆక్రమణలకు గురైనట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. దీని వల్ల వరదల సమయంలో ఎగువన నీరు కిందకు లాగక పొలాలు, ఆక్వా చెరువులు నీట



మునుగుతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇటీవల వాటిని పరిశీలించిన ఉప సభాపతి రఘురామకృష్ణరాజు ఉప్పుటేరు ప్రక్షాళన పనులను ప్రతిపాదించారు. అందులో భాగంగా ఎగువన కొల్లేరు నుంచి వచ్చే వరద నీటికి ఎటువంటి అవరోధం లేకుండా కైకలూరు నుంచి ఆక్రమణలను తొలగించే పనులను మురుగునీటి పారుదల, రెవెన్యూ శాఖల పర్యవేక్షణలో చేపట్టారు.

12 వేల క్యూసెక్కులకు తగ్గి.. ఉప్పుటేరు కాలగర్భంలో చెరువులు తవ్వేయడం, రైల్వే ట్రాకు కింద డ్రెడ్జింగ్ చేయకపోవడం, కిక్కిస మేట వేయడం, తూడు, గుర్రపుడెక్క వంటి అవరోధాలతో మురుగునీటి ప్రవాహం సక్రమంగా లేదు. గతంలో మూడు మీటర్లకు పైగా ఉప్పుటేరు లోతు ఉంటే ప్రస్తుతం కొన్నిచోట్ల మీటరు మాత్రమే ఉంది. గతంలో 25 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యం కాగా ప్రస్తుతం 12 వేల క్యూసెక్కులకు తగ్గింది. ప్రస్తుతం ఉప్పుటేరు బ్రిడ్జి ఎగువన రైల్వే ట్రాకు మధ్యలో ఉన్న ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టారు. నాలుగు పొక్లెయిన్లు, ఒక పంటు సహాయంతో కలిదిండి, కైకలూరు, ఆకివీడు మండలాల్లో పనులు జరుగుతున్నాయి. రైల్వే ట్రాకు వద్ద కనీసం మిషన్ వెళ్లలేని పరిస్థితిలో మూడు రోజులుగా జరుగుతున్న పనులతో 40కి పైగా అక్రమంగా తవ్విన చెరువులను తొలగించారు.

# నిధులున్నా.. నిరుపయోగం



గూడూరు : పదేళ్లుగా జిల్లాలోని 12 మార్కెట్ కమిటీల్లో రూ.47.15 కోట్లు నిధులు నిరుపయోగంగా ఉన్నాయి. నిధుల వ్యయంపై ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాకపోవడంతో అవి ఖాతాల్లోనే మూలుగుతున్నాయి. జిల్లాలో గూడూరు, వాకాడు, నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి, శ్రీకాళహస్తి, నాగలాపురం, బీఎన్‌కండ్రిగ, పాకాల, చంద్రగిరి, తిరుచానూరు, పుత్తూరు వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయి. సెస్సు వసూళ్ల నిధులు బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు.

గతంలో ఈ నిధులతో పొలాల్లో లింకు రోడ్ల నిర్మాణాలు చేపట్టేవారు. 2016లో అప్పటి తెదేపా ప్రభుత్వం ఏఎంసీల్లో లింకు రోడ్ల పేరుతో నిధులు దుర్వినియోగం అవుతున్నాయని గుర్తించి.. ఆ నిర్మాణాలు నిలిపివేసింది. అప్పటి నుంచి ఏఎంసీల ఖాతాల్లోనే సెస్సు మొత్తాలు ఉండిపోయాయి. వీటిలో 45 శాతం మేర ప్రభుత్వ ఖాతాకు జమ చేసి, మిగిలిన నిధుల్లో ఉద్యోగుల జీతాలు, కార్యాలయ నిర్వహణ ఖర్చులు మినహాయించి మిగిలిన నిధులను అలాగే ఉంచేశారు. ఫలితంగా గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి.

విషయమై మార్కెట్ కమిటీ జిల్లా ఏడీ సురేంద్రబాబును వివరణ కోరగా పదేళ్లుగా నిధులు ఖాతాల్లోనే ఉన్నాయని, ఖర్చు చేసేందుకు తమకు ఎలాంటి అధికారం లేదని.. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాలన్నారు.

**ఏటా రూ.20 కోట్ల సెస్సు వస్తున్నా..**

జిల్లాలోని కమిటీల ద్వారా ఏటా రూ.20 కోట్లు సెస్సు వసూలు చేస్తున్నారు. రాబడి అధికంగా ఉన్నా అభివృద్ధి పనులకు నిధుల వినియోగంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడంతో ఖాతాల్లోనే మూలుగుతున్నాయి. ఒక్క వాకాడు కమిటీలోనే రూ.11 కోట్లు నిల్వ ఉండటం గమనార్హం.

## అమర్చితేనే నియంత్రికలు

చిత్తూరు : నూతన వ్యవసాయ సర్వీసుల కోసం డ్రా చేసి తీసుకెళ్లిన నియంత్రికలను సత్వరమే అమర్చాలి. ఇకపై తీసుకెళ్లిన వాటిని అమర్చిన తర్వాతే మళ్లీ నియంత్రికలు అందజేయనున్నారు. ఈ మేరకు విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. నియంత్రికలు అమర్చడంలో జాప్యం, తప్పిదాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆదేశాల్లో పేర్కొన్నారు.

వైకాపా పాలనలో వ్యవసాయ సర్వీసుల జారీ పూర్తిగా స్తంభించిపోయింది. దీంతో వేల సంఖ్యలో వ్యవసాయ సర్వీసులు పెండింగ్‌లో పడ్డాయి. కూటమి ప్రభుత్వం వ్యవసాయ సర్వీసుల జారీపై ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లాలో సుమారు 3,250 వ్యవసాయ సర్వీసులు పెండింగ్‌లో ఉండగా నాలుగు నెలల కాలంలోనే 1000-1200 సర్వీసులు జారీ చేసి నియంత్రికలు, అనుబంధ పరికరాలు సరఫరా చేశారు. ప్రస్తుతం 2,240 వ్యవసాయ సర్వీసులు పెండింగ్‌లో ఉండగా వీటిని ప్రాధాన్య క్రమంలో జారీ చేస్తున్నారు.



**పొలాల్లోనే దిష్టిబొమ్మల్లా..**

నియంత్రికలు అమర్చడంలో కొందరు క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది తీవ్ర జాప్యం చేస్తున్నారు. జిల్లా గోదాము నుంచి డ్రా చేసి తీసుకెళ్లిన నియంత్రికలు సుమారు 500 పొలాల్లోనే దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఇలా జిల్లాలోని చౌడేపల్లె, పెద్దపంజాణి, కార్వేటినగరం, గంగవరం, వెదురుకుప్పం, బైరెడ్డిపల్లె మండలాల్లో నియంత్రికలు అమర్చక.. రైతులను ముప్పుతిప్పలకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పైరవీలు, మామూళ్లకు ఆశపడి కొందరు అధికారులు, సిబ్బంది ఒక రైతుకు అమర్చాల్సిన నియంత్రికలు, అనుబంధ పరికరాలను మరో రైతుకు ఏర్పాటు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి.. సత్వరమే నియంత్రికలను అమర్చడంతో పాటు వ్యవసాయ సర్వీసుల జారీని మరింత వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

## నూతన పాలకవర్గంపైనే ఆశలు..!

పుంగనూరు : టమాటా మార్కెట్, పశువులు, గొర్రెల సంతతో పేరొందిన పుంగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఈ నెల 22న ప్రమాణ స్వీకారం చేయనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి పాలకవర్గం. మార్కెట్ యార్డులో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఇతర అభివృద్ధి పనులు చేయాల్సి ఉంది. బాధ్యతలు చేపట్టనున్న కమిటీ ప్రస్తుతం నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తుందని రైతులు ఆశలు పెట్టుకున్నారు.

పుంగనూరు మార్కెట్ యార్డుకు జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇతర జిల్లా, రాష్ట్రాల నుంచి వ్యాపారులు వస్తుంటారు. అయితే మార్కెట్



యార్డులో సమస్యలు నెలకొనడంతో రైతులు.. వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా చింతపండు వ్యాపారులకు షెడ్లు నిర్మించాల్సి ఉంది. టమాటా వ్యాపారులకు ప్రస్తుతం 40 షెడ్లు ఉన్నా అదనంగా మరో 30 అవసరం. రాగానిపల్లె రోడ్డులో వాణిజ్య సముదాయాల నిర్మాణం సైతం కార్యరూపం దాల్చడం లేదు.

**నాడు ప్రతిపాదించినా..**

యార్డు ఆవరణలో సీసీ రోడ్లు, కాలువలు, షెడ్ల నిర్మాణానికి వైకాపా ప్రభుత్వంలో రూ.9.3 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అయితే అవి కేవలం దస్త్రాలకే పరిమితం కావడంతో సమస్యలు అలాగే ఉన్నాయి. తాగునీరు, మరుగుదొడ్లు, విశ్రాంతి భవనాలు, ఎలక్ట్రానిక్ వే బ్రిడ్జి, శీతల గిడ్డంగి నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

**కమిటీ ఇదే..**

గౌరవ ఛైర్మన్‌గా స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఛైర్మన్‌గా ఎన్.సమీపతి, వైస్ ఛైర్మన్‌గా పి.వెంకటరమణ, సభ్యులుగా ఎ.శాంతమ్మ, సి.చంద్రమ్మ, ఎన్.జయశ్రీ, బి.సుధాకర్‌రెడ్డి, ఎ.అమరనాథ్ నాయుడు, మసెనన్న, టి.చంద్రమ్మ, అరుణ, సంధ్య, మంజునాథలను నియమించారు. వీరితో పాటు స్థానిక పురపాలక ఛైర్మన్, సింగిల్ విండో ఛైర్మన్, వ్యవసాయశాఖ ఏడీ, జిల్లా మార్కెటింగ్ అధికారులు సభ్యులుగా ఉంటారు.

## ఉల్లి పొలంలోనే కుళ్లి

ఎమ్మిగనూరు : రెండేళ్లుగా ధర లేక కుదేలైన ఉల్లి రైతులను ఈ ఏడాది అధిక వర్షాలు నిండా ముంచాయి. ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల, ఆస్పరి, కోసిగి, పెద్దకడబూరు తదితర మండలాల్లో 12 వేల ఎకరాల్లో ఉల్లి సాగు చేసినట్లు అంచనా. ఎకరానికి రూ.1.50 లక్షల పెట్టుబడి పెట్టారు. అధిక దిగుబడులతోపాటు ధర లభిస్తుందన్న ఆశతో ముందుగా బోర్ల కింద ఉల్లి సాగు చేశారు. 12 వేల ఎకరాలకు రూ.130 కోట్లు పెట్టుబడి పెట్టారు. పంట ప్రస్తుతం చేతికొచ్చింది. నాణ్యమైన గడ్డ మార్కెట్లో క్వింటా గరిష్ఠ ధర రూ.1,200 వరకు అమ్ముడుపోతోంది. గిట్టుబాటు లేకపోవడంతో రైతులు విక్రయించకుండా పొలాల్లోనే ఉంచారు. ఇటీవల కురిసిన వర్షాలకు గడ్డ మొత్తం తడిసి కుళ్లిపోతోంది.“ మూడెకరాలు ఉంది.. ఎకరంలో ఉల్లి వేశా. పెట్టుబడి రూ.1.50 లక్షలు అయింది. చేతికొచ్చిన పంట వర్షానికి తడిసి పోవడంతో క్వింటా రూ.500కు కూడా అడగడం లేదు. పంట అమ్మితే కూలీల ఖర్చు సరిపోతుంది. పెట్టుబడి నష్టపోయానని” కడిమెట్లకు చెందిన వీరకేశ ఆవేదన వ్యక్తం చేశారు.“ ఎకరంలో ఉల్లి వేశా. రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టా. పంట కోసే సమయంలో విడవకుండా వర్షం కురిసి గడ్డలు కుళ్లిపోయాయి. హైదరాబాద్, తాడేపల్లిగూడెం వంటి మార్కెట్లకు అమ్మేందుకు తీసుకెళ్తే రవాణా ఖర్చులు రాని పరిస్థితి. స్థానిక వ్యాపారులకు విక్రయించాలంటే క్వింటా రూ.600లకు అడుగుతున్నారు. వర్షం తీరని నష్టం మిగిల్చిందని” వీరేశ్ వాపోయారు.

## ఆశల మాయలో.. అప్పుల ఊబిలో



అనంతపురం : ‘అనంతపురం గ్రామీణంలోని ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడ్డాడు. కారణాలను ఆరా తీయగా.. ప్రైవేటు వాహనాల డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న ఇతడు తక్కువ సమయంలో డబ్బు సంపాదించాలనుకుని మట్కావైపు వెళ్లాడు. తాను సంపాదించినంతా అందులో పెట్టి ఆడాడు. ఏ రోజూ డబ్బులు గెలుపొందలేదు. ప్రైవేటు అప్పులు చేశాడు. రుణదాతల ఒత్తిడి అధికమైంది. తీర్చే మార్గం కానరాక ఉరి బిగించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.’ ఈ ఘటన మచ్చుకు మాత్రమే. ఈ తరహా ఘటనలు జిల్లా వ్యాప్తంగా రోజు ఎక్కడో ఒకచోట మధ్య, పేద తరగతి ఇళ్లల్లో నిత్యకృత్యంగా మారాయి.

జిల్లాలో మట్కా చాపకింద నీరులా విస్తరిస్తోంది. రూ.కోట్లలో లావాదేవీలు సాగుతున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ.. పేద మధ్యతరగతి వారిని ఆకర్షిస్తూ డబ్బులు దండుకుంటున్నారు. ఈ ఊబిలో పడి పేద, మధ్య తరగతి ప్రజలు ఆస్తులను సైతం పోగొట్టుకుని అప్పుల పాలవుతున్నారు.

**300 వందల బీటర్లు... 20కి పైగా కంపెనీలు**

గుత్తి పురపాలికలో 24 వార్డులుండగా ప్రతి వార్డులోనూ బీటర్లు ఉన్నారు. పట్టణంలో 3 వందలకు పైగా బీటర్లు ఉన్నట్లు అంచనా. ఇరవైకి పైగా కంపెనీల నిర్వాహకులు ఉన్నట్లు సమాచారం. అనంతపురంలో వన్‌టౌన్ పరిధిలో పాతూరు, పరిసర కాలనీల్లో మట్కా మహమ్మారి అధికంగా ఉంది. ఆయా కాలనీల్లో బీటర్లు దినసరి కూలీలను లక్ష్యంగా చేసుకుని వారికి రెట్టింపు డబ్బు వస్తుందని ఎర వేసి మట్కా ముగ్గులోకి లాగుతున్నారు. మద్యం, జూదానికి అలవాటు పడినవారు మట్కాతో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

అనంతపురంలోని అంబేడ్కర్ నగర్, అనంతసాగర్ కాలనీ, విద్యుత్‌నగర్, గుత్తిలోని ఎస్సీ కాలనీలోనూ, తాడిపత్రిరోడ్డులోని ఓ థియేటర్ వద్ద జంగాల కాలనీ, గాంధీనగర్ ,చెర్లోపల్లి, గుత్తి ఆర్ఎస్, బీసీ కాలనీ, కోట, తోళ్లషాపు, బండగేరి తదితర ప్రాంతాల్లో జోరుగా మట్కా సాగుతోంది. మట్కా పేదలు నివాసం ఉంటున్న కాలనీల్లోనే ఎక్కువగా జరుగుతోంది.

**పోలీసు, రాజకీయ అండతో యథేచ్ఛగా..**

అనంతపురం, తాడిపత్రి, గుత్తి, కళ్యాణదుర్గం పట్టణాల్లో పెద్ద ఎత్తున చేపడుతున్న మట్కా నిర్వాహకులకు రాజకీయ నాయకుల అండదండలు పుష్కలంగా ఉన్నట్లు తెలుస్తోంది. అవసరమైనప్పుడల్లా డబ్బులు ఖర్చు చేస్తుండటంతో నాయకులు బీటర్లపై ఎలాంటి దాడులు జరగనివ్వరు. గుత్తిలో నాయకులు, పోలీసుల అండదండలతో మట్కా జూదం 3 పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారనే సమాచారం. మట్కా అంటే గుత్తి గుర్తుకు వస్తుంది. ఇక్కడ యాభై ఏళ్లకు పైబడి మట్కా కొనసాగుతోంది. ఒకప్పుడు బికారులుగా ఉన్నవారు మట్కాను నిర్వహిస్తూ రూ.కోట్లు కూడగట్టుకున్నారు. విలాసవంత జీవితాలను గడుపుతున్నారు. నిర్వాహకులకు కొందరు పోలీసులు సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

## రక్షణ లేని మలుపులు.. గాల్లో ప్రాణాలు!



ముదిగుబ్బ: ఘాట్‌రోడ్డులో వాహనాల డ్రైవింగ్‌పై కనీస అవగాహన లేకపోవడం, అతివేగం కారణంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. కొందరు ప్రాణాలు కోల్పోతుండగా.. మరికొందరు క్షతగాత్రులవుతున్నారు. ముదిగుబ్బ మండలంలోని దొరిగల్లు - కడప జిల్లాలోని లింగాల మండలం సరిహద్దులోని ఘాట్ రోడ్డు 10 కిలోమీటర్లు ఉంది. మొత్తం 38 మలుపులు ఉన్నాయి. అందులో ప్రమాదకర మలుపులు ఐదు ఉన్నాయి. పులివెందుల నుంచి సిమెంటు లోడు లారీలు ముదిగుబ్బ మీదుగా బెంగళూరుకు వెళ్తుంటాయి. అరటి లోడుతో బొలెరో, ఐషర్ వాహనాలు నిత్యం వెళ్తుంటాయి. కూలీలు వాహనాల టాపుపైన కూర్చొని ప్రయాణం చేస్తుంటారు. కొన్ని మలుపుల్లో రక్షణ దిమ్మెలు లేకపోవడం, ఉన్నవి దెబ్బతినడంతో, సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్నారు. వేగాన్ని అదుపు చేయలేక ప్రమాదాలకు గురవుతున్నారు.

**నిర్వహణ అధ్వానం**

ఘాట్‌రోడ్డులో ప్రమాదకర మలుపులు, రక్షణ గోడల స్థితిగతులపై సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలి. రక్షణ చర్యలు అంతంత మాత్రంగానే ఉండటంతో అనేకచోట్ల గోడలు ఛిద్రమయ్యాయి. రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన ఇనుప రెయిలింగ్ కొన్నిచోట్ల పూర్తిగా తొలగిపోయాయి. ఇటువంటి చోట్ల వాహనాలు అదుపుతప్పితే ప్రాణాలు గాల్లో కలిసినట్టే. దాదాపు ఏడేళ్ల నుంచి ఘాట్‌రోడ్డులో ఎటువంటి నిర్వహణ, అభివృద్ధి పనులు చేయలేదు. రెండేళ్ల కిందట ఒంగోలు నుంచి హుబ్బళ్లీకి వెళ్తున్న గ్రానైట్ లోడు లారీ రాత్రివేళల్లో అతివేగంగా వచ్చి మలుపులో అదుపు చేయలేక 30 అడుగుల లోతులో ఉన్న లోయలోకి దూసుకుపోయింది. ఈ ఏడాది జనవరిలో గ్యాస్ లోడుతో పులివెందుల నుంచి వస్తున్న లారీ వేగాన్ని అదుపు చేయలేక రాయిని ఢీకొట్టింది. పులివెందుల నుంచి ముదిగుబ్బకు క్రేన్ తీసుకొస్తుండగా ఘాట్ దిగే క్రమంలో తిరగబడటంతో డ్రైవర్ మృతిచెందాడు. ఇలా అనేక ఘటనలు జరిగాయి.

**రక్షణ చర్యలు చేపడతాం**

**- శివరాముడు, ముదిగుబ్బ టౌన్ సీఐ**

అతివేగం, అవగాహన లోపంతోనే ఘాట్‌లో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. టాపుపై ఎక్కి ప్రమాదకరంగా ప్రయాణం చేయకుండా తనిఖీలు నిర్వహిస్తాం. సంబంధిత అధికారులతో మాట్లాడి ఘాట్ రోడ్డులో రక్షణ చర్యలు చేపట్టి, సూచిక బోర్డులు ఏర్పాటు చేయిస్తాం.


## సామాజిక స్థలం.. ‘స్వాహా’ యత్నం..!

విశాఖపట్నం: జీవీఎంసీ 10వ వార్డు రవీంద్రనగర్‌లో సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలం అది. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం దాని విలువ రూ.1.20కోట్లకుపైగా ఉంటుంది. ఖాళీగా ఉన్న ఆ స్థలంపై కొందరు కన్నేశారు. గతంలో జీవీఎంసీ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలగించారు. గుట్టు చప్పుడు కాకుండా విక్రయించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

**హెచ్చరిక బోర్డు తొలగించి..:** రవీంద్రనగర్ చివరి బస్‌స్టాపు వద్ద పదేళ్ల క్రితం చేపట్టిన కల్యాణ మండపం నిధులు లేక అసంపూర్తిగా నిలిచిపోయింది. దాన్ని పూర్తిచేసి వినియోగంలోకి తీసుకు రావాలని పలువురు ఆలోచన చేశారు. గతేడాది సమావేశం ఏర్పాటు చేసుకుని మహిళా మండలికి కేటాయించిన దాంట్లో మిగిలిన 200 గజాల స్థలాన్ని అమ్మాలని నిర్ణయించారు. అతి తక్కువ ధరకు ఓ వ్యక్తికే అప్పగించాలని చూశారు. విషయం తెలిసిన జీవీఎంసీ అధికారులు సామాజిక అవసరాలకు కేటాయించిన స్థలం ప్రభుత్వానికి చెందుతుందని, క్రయవిక్రయాలు చెల్లవని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. తర్వాత పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు అక్రమార్కుల కన్ను దానిపై పడింది. ఇటీవల ఏకంగా హెచ్చరిక బోర్డును తొలగించి విక్రయించాలని సన్నాహాలు చేస్తున్నారు.

**మహిళా మండలికి...**

పదోవార్డు రవీంద్రనగర్ లేఅవుట్‌లో సామాజిక అవసరాల కోసం గతంలో ఐదు స్థలాలను కేటాయించారు. సుమారు 600 గజాల్లో కల్యాణమండపం నిర్మాణం చేపట్టారు. దానికి ఎదురుగా 250 గజాల్లో ‘సేవాస్ఫూర్తి’ పేరిట



భవనాన్ని నిర్మించారు. మూడో స్థలంలో మహిళా మండలి కార్యకలాపాలు సాగుతున్నాయి. నాలుగో స్థలంలో కళావేదికను నిర్మించారు. ఐదో స్థలం 300 గజాలు ఉండగా 2010లో జీవీఎంసీ నిధులతో 100 గజాల స్థలంలో మహిళా మండలి కోసం సామాజిక భవనాన్ని నిర్మించారు. మిగిలిన 200 గజాల స్థలం ఖాళీగా ఉంది.

**ప్రభుత్వ స్థలాన్ని కాపాడతాం:** సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలాలు ప్రభుత్వానికి చెందినవి. అంగన్‌వాడీ కేంద్రం, సామాజిక భవనం, ఆసుపత్రుల నిర్మాణానికి మాత్రమే వాటిని ఉపయోగించాలి. ఆ స్థలాలను విక్రయించడం చట్టరీత్యా నేరంగానే భావిస్తాం. రవీంద్రనగర్‌లోని స్థలాన్ని పరిశీలించి పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం.

వెంకటరావు, జీవీఎంసీ ఏఈ

## అక్రమాల పప్పులుడకవ్..!

పుత్తూరు : వి.కోట మేజర్ పంచాయతీలో గతంలో రూ.20 లక్షల వరకు బిల్లు కలెక్టర్లు స్వాహా చేశారు. దీన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేయకుండా సొంతానికి వాడుకున్నారు. అది రుజువు కావడంతో ఇద్దరినీ సస్పెండ్ చేశారు. పంచాయతీల్లో నిధులు దుర్వినియోగంపై ప్రభుత్వం దృష్టి సారించింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీల్లో అవకతవకలు జరగకుండా చర్యలు చేపడుతోంది. పంచాయతీల్లో ఖర్చు చేసే ప్రతి పైసాకు పక్కాగా లెక్కలు చూపాల్సిందేనని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. సెప్టెంబరు 1వ తేదీ నుంచి స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారానే కార్యదర్శులు నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఆస్తి, నీటి పన్ను బిల్లులు 100 శాతం ఆన్‌లైన్‌లో చెల్లించే విధానాన్ని అమలు చేసేందుకు శ్రీకారం చుట్టింది. దీంతో పన్నుల నగదు స్వాహాకు అడ్డుకట్టపడనుంది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,411 పంచాయతీలు ఉన్నాయి. 15వ ఆర్థిక సంఘం, ఆస్తి, నీటి పన్ను, లైసెన్సులు, మైనింగ్, రిజిస్ట్రేషన్ సెస్‌ల రూపంలో ఏటా రూ.కోట్లలో నిధులు పంచాయతీల ఖాతాల్లో జమ అవుతున్నాయి. ప్రధానంగా మేజరు పంచాయతీల్లో కొందరు కార్యదర్శులు, పాలకవర్గ సభ్యులు చేతివాటం చూపుతున్నారు. మోటార్లు మరమ్మతులకు గురికాకున్నా.. వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్య



పనులు చేపట్టకనే చేసినట్లు చూపి రూ.లక్షల్లో స్వాహా చేస్తున్నారు. తక్కువకు కొనుగోలు చేసి దస్త్రాల్లో మాత్రం ఎక్కువకు కొన్నట్లు బిల్లులు పెట్టి స్వాహా చేస్తున్న ఉదంతాలు ఉన్నాయి. ఆస్తి పన్ను వసూలు చేసి సొంతానికి వాడుకున్న వారూ ఉన్నారు. కొందరు బయట పడి సస్పెండ్ అవుతున్నారు. వైకాపా హయాంలో ఉమ్మడి జిల్లాలో ఇలా ముగ్గురు కార్యదర్శులు సస్పెండ్ అయ్యారు. మరికొందరు నిధులు సొంతానికి వాడుకుని ఆడిట్, తనిఖీల సమయంలో నగదు జమ చేస్తున్నారు. ఇవి మండల పరిషత్తు అధికారులకు తెలిసినా చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

**అక్రమాలు తెలుసుకునే వీలు**

స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో ప్రతి అంశం నమోదు చేయాలని ఆదేశాలు వచ్చాయి. ఏఏ పంచాయతీల్లో ఎంత ఖర్చు చేస్తున్నారో ఇట్టే తెలుసుకునే వెసులుబాటు ఉంది. పంచాయతీల్లో అక్రమాలు జరిగే అవకాశం ఉండదు.సుధాకర్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి, చిత్తూరు

## దళారులు చెప్పిందే ధర

గూడూరు : ధాన్యం కొనుగోలు కేంద్రాలు పనిచేయకపోవడంతో దళారులు చెప్పిన ధరకే రైతులు రెండో పంట ధాన్యాన్ని విక్రయించుకోవాల్సి వస్తోంది. ఉమ్మడి గూడూరు డివిజన్ పరిధిలోని సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు నియోజకవర్గాల్లో ఎడగారు సీజన్‌లో 45 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. రెండో పంట కింద ఎక్కువ మంది ఏ గ్రేడ్ రకానికి చెందిన 1010 రకం నాటారు. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా గిట్టుబాటు ధర లేదు. ధాన్యం కొనుగోలులో



స్థానిక కొనుగోలు కేంద్రాలు, మార్కెటు కమిటీలు చొరవ చూపకపోవడంతో క్రమంగా ధరలు తగ్గిపోతున్నాయి.

ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం 75 కిలోల ధాన్యం ఏ గ్రేడ్ రకం రూ.1740 వరకు కొనుగోలు చేయాలి. గత నెల మొదటి వారంలో రూ.1,400 వరకు ఉంది. ప్రస్తుతం రూ.1320కు చేరడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మిల్లర్లు, పౌరసరఫరాల శాఖ రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసే పరిస్థితి లేదు. దీంతో మిల్లర్లు, వ్యాపారులకు మధ్యలో దళారులు వచ్చి.. తక్కువ ధరకు ధాన్యం కొని మిల్లర్లకు ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయిస్తున్నారు. బస్తాపై రూ.400 వరకు రైతులు నష్టపోతున్నారు. ప్రస్తుతం నాయుడుపేట, పెళ్లకూరు, చిట్టమూరు, కోట మండలాల్లో కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆర్థిక అవసరాల దృష్ట్యా పొలాల్లోనే రైతులు దళారులకు తక్కువ ధరకు ధాన్యం విక్రయిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కరవు నేలపై.. జలసిరి

చిత్తూరు : జిల్లాలోని కరవు నేల పశ్చిమ ప్రాంతంలో జలసిరి సంతరించు కోనుంది. ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్న అన్నదాతల కల నెరవేరనుంది. గత వైకాపా ప్రభుత్వం హంద్రీ-నీవా కుప్పం బ్రాంచ్ కాలువ పనులను పూర్తిగా పక్కన పెట్టేసింది. కూటమి ప్రభుత్వం హంద్రీ-నీవా కుప్పం బ్రాంచ్ కాలువ లైనింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి వేగంగా చేపట్టింది. ఈ నెలలో హంద్రీ-నీవా కాలువ ద్వారా నీరు విడుదలకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే హంద్రీ-నీవా కుప్పం బ్రాంచ్ కాలువ నుంచి 110 చెరువులను నింపడానికి చర్యలు చేపడుతున్నామని జల వనరుల శాఖ ఎస్ఈ వెంకటేశ్వరరాజు తెలిపారు. కాలువ నుంచి తూముల ద్వారా నేరుగా కుప్పం, రామకుప్పం, శాంతిపురం, గుడుపల్లె, వి.కోట, బైరెడ్డిపల్లె మండలాల్లోని 48 చెరువులకు మళ్లించి నింపుతామన్నారు. ఆ తర్వాత 48 చెరువుల నుంచి అనుసంధాన కాలువ ద్వారా మరో 62 చెరువులను నింపి జలకళ సంతరింపజేయనున్నామని చెప్పారు. బుధవారం వి.కోట మండలంలో చెరువుల అనుసంధాన కాలువ పనులు పరిశీలించామని, వేగంగా పనులు పూర్తిచేయాలని ఇంజినీర్లను ఆదేశించామని ఎస్ఈ పేర్కొన్నారు.

# మృనాల్ నిజంగానే లవ్ లో బ్రేకప్ అయ్యారా.. అతడు ఎవరో తెలుసా?

టీవీ సీరియల్ ద్వారా కెరియర్ ను మొదలుపెట్టి.. ఆ తర్వాత పలు చిత్రాలలో హీరోయిన్ గా నటించిన మృనాల్ ఠాగూర్ తెలుగులో 'సీతారామం' సినిమాతో భారీ పాపులారిటీ సొంతం చేసుకుంది. ప్రముఖ దర్శకుడు హను రాఘవపూడి దర్శకత్వంలో మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ తొలిసారి నేరుగా తెలుగులో చేసిన చిత్రం ఇది. వీరిద్దరికీ ఈ సినిమా మంచి విజయాన్ని అందించింది. అంతేకాదు మృనాల్ ఆ తర్వాత కాలంలో ఎన్నో పాత్రలలో నటించినా.. సీతారామం సినిమాలోని సీత పాత్ర అందించిన గుర్తింపు మరో పాత్ర అందివ్వలేదు అనడంలో సందేహం లేదు. అంతలా సీత పాత్రతో తెలుగు ప్రేక్షకుల హృదయాలను సొంతం చేసుకుంది ఈ ముద్దుగుమ్మ. ఆ తర్వాత తెలుగులో 'హాయ్ నాన్న' అనే సినిమా చేసి మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. అలాగే విజయ్ దేవరకొండ హీరోగా వచ్చిన 'ది ఫ్యామిలీ స్టార్' సినిమాలో నటించింది. కానీ పెద్దగా ఇంపాక్ట్



చూపించలేకపోయింది. ప్రస్తుతం అడివి శేషు హీరోగా నటిస్తున్న 'డెకాయిట్' సినిమాలో హీరోయిన్ గా చేస్తోంది ఈ ముద్దుగుమ్మ. ఇదిలా ఉండగా మృనాల్ ఠాగూర్ ఈ మధ్య ఎక్కువగా వార్తల్లో నిలుస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ పై ఊహించని కామెంట్లు చేసిన ఈమె.. ఆ తర్వాత మరో హీరోయిన్ బిపాషా బసు పై కూడా కామెంట్స్ చేసి వార్తల్లో నిలిచింది. అయితే ఇప్పుడు తన వ్యక్తిగత కారణాలవల్ల వార్తల్లో నిలిచి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈమె టీవీ సీరియల్స్ లో నటిస్తున్నప్పుడే.. ప్రముఖ స్క్రిప్ట్ రైటర్ శరద్ త్రిపాఠి తో రిలేషన్ లో ఉన్నట్లు గత సంబంధాన్ని ఇప్పుడు అభిమానులు కూడా గుర్తు చేసుకుంటున్నారు..నిజానికి గతంలో వీరిద్దరూ సీరియల్స్ లో చేస్తున్నప్పుడే ఒకరికొకరు ఇష్టపడి.. పెళ్లి కూడా చేసుకోవాలనుకున్నారట. కానీ కాలక్రమేనా..వీరి బంధాన్ని ముగించుకున్నట్లు సమాచారం. ఇక శరద్ త్రిపాఠి విషయానికి వస్తే.. కసౌతి జిందగీ కి, స్వరాగిణి, క్యూకీ సాస్ భీ కభీ బహు థీ వంటి టెలివిజన్ షోలకు స్క్రిప్టు రైటర్ గా పనిచేసి మంచి పేరు సొంతం చేసుకున్నారు. ఆ తర్వాత సినిమాలకు కూడా స్క్రిప్ట్ రైటర్ గా పనిచేయడం జరిగింది. అటు స్క్రిప్టులతో పాటు శరత్ పాటలు కూడా రాస్తారు. ఏక్తా కపూర్ తో వృత్తిపరమైన అనుబంధాలను కలిగి ఉన్నా.. ఇప్పుడు ఇద్దరూ కలిసి లేనప్పటికీ.. విడిపోవడం గురించి మాత్రం ఇంకా క్లారిటీగా చెప్పలేదు.దీంతో అభిమానులు వీరి మధ్య అసలు ఏం జరిగిందో అని తెలుసుకోవడానికి తెగ ఆసక్తి కనబరుస్తున్న విషయం తెలిసిందే. మరోవైపు అటు మృణాల్ ఠాగూర్.. ఇటు శరద్ త్రిపాఠి విడిపోయినట్లు కూడా వార్తలు వస్తున్నాయి కానీ దీనిపై కూడా క్లారిటీ లేకపోవడం గమనార్హం. మొత్తానికైతే ఈ జంట విడిపోవడం పై అభిమానులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.. మృణాల్ ఠాకూర్ విషయానికి వస్తే.. తనకు విరాట్ కోహ్లీ అంటే చాలా ఇష్టమని ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తెలిపిన విషయం తెలిసిందే.

# స్పెషల్ సాంగ్.. కన్ఫర్మ్ చేసిన నేహా శెట్టి.. కీలక సన్నివేశాల్లో కూడా!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా రాబోతున్న తాజా మూవీ ఓజీ.. దసరా కానుకగా ఓజీ మూవీ సెప్టెంబర్ 25న థియేటర్లలో విడుదల కాబోతోంది. ఈ సినిమాని చూడడానికి ఇప్పటికే ఎంతోమంది అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ఇప్పటికే ఓజీ మూవీ నుండి కొన్ని సాంగ్స్ తో పాటు ఎన్నో అప్డేట్లు కూడా ఇస్తున్నారు. అయితే గత కొద్దిరోజుల నుండి మూవీకి హైప్ తగ్గుకుంటూ వస్తోంది. ఇలాంటి నేపథ్యంలోనే సినిమాకి భారీ హైప్ ఇచ్చింది డిజె టిల్లు బ్యూటీ నేహా శెట్టి.. త్వరలోనే ఓజీ మూవీతో మీ ముందుకు రాబోతున్నాను అంటూ నేహా శెట్టి మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో పవన్ కళ్యాణ్ అభిమానులకి కిక్కిస్తున్నాయి. మరి ఇంతకీ ఓజీ మూవీ లో నేహా శెట్టి పోషించబోయే పాత్ర ఏంటి అనేది ఇప్పుడు చూద్దాం. సుజీత్ డైరెక్షన్లో డీవీవీ ఎంటర్టైన్మెంట్ బ్యానర్లో డీవీవీ దానయ్య నిర్మిస్తున్న తాజా మూవీ ఓజీ. ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ సరసన హీరోయిన్ గా ప్రియాంక అరుళ్ మోహన్ నటించగా.. ఇమ్రాన్



హష్మీ, శ్రీయా రెడ్డి, ప్రకాష్ రాజ్, అర్జున్ దాస్ లు కీలకపాత్రల్లో నటిస్తున్నారు. అయితే తాజాగా ఈ సినిమా గురించి ఓ క్రేజీ అప్డేట్ ఇచ్చింది హీరోయిన్ నేహ శెట్టి.ఆమె తాజాగా ఓ జ్యువెల్లరీ షాప్ ఓపెనింగ్ లో మాట్లాడుతూ.. "త్వరలోనే నా కొత్త సినిమాలకు సంబంధించిన అఫీషియల్ అనౌన్స్మెంట్లు ఇస్తాను.కానీ అన్నింటి కంటే ముందు ఓజీ మూవీతో మీ ముందుకు రాబోతున్నాను. ఓజీ మూవీలో సర్ప్రైజింగ్ రోల్ లో కనిపిస్తాను. పవన్ కళ్యాణ్ తో నాకు మంచి సన్నివేశాలు ఉన్నాయి" అంటూ చెప్పుకొచ్చింది.

అయితే గత కొద్ది రోజులుగా నేహ శెట్టి ఓజీ మూవీలో ఐటెం సాంగ్ చేస్తుందనే రూమర్లు వినిపించినప్పటికీ మేకర్స్ అఫీషియల్ గా అనౌన్స్ చేయలేదు. కానీ ఇప్పుడు నేహశెట్టి స్వయంగా నేను ఓజీ సినిమాలో మిమ్మల్ని సర్ప్రైజ్ చేస్తాను అని చెప్పడంతో నేహా శెట్టి ఈ సినిమాలో ఐటమ్ సాంగ్ చేయబోతున్నట్టు అందరికీ అర్థమైంది. అయితే సర్దార్ గబ్బర్ సింగ్ సినిమా తర్వాత నుండి పవన్ కళ్యాణ్ నటించిన ఏ సినిమాలో కూడా ఐటెం సాంగ్స్ లేవు. కానీ ఓజీ మూవీలో ఐటెం సాంగ్ ఉండబోతున్నట్టు రూమర్స్ వినిపించడంతోపాటు నేహ శెట్టి చెప్పిన మాటలు పవన్ ఫ్యాన్స్ కి మరింత కిక్కిస్తున్నాయి. ఇప్పటికే ఈ సినిమా నుండి విడుదలైన సువ్వి సువ్వి, ఫైర్ స్మార్ట్, హాంగ్రీ చీతా బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ ఫ్యాన్స్ ని అలరించాయి.




# వాయిదా పడ్డ వెల్కమ్ టు ది జంగిల్ 3.. కొత్త డేట్ ఎప్పుడంటే?




బాలీవుడ్ మూవీ 'వెల్కమ్ టు ది జంగిల్ 3' ఈ సినిమాని జంగిల్ 3 అని కూడా అంటారు. భారీ తారాగణంతో వచ్చిన వెల్కమ్ 1, వెల్కమ్ 2 రెండు సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద మంచి హిట్స్ గా నిలిచాయి. దాంతో వెల్కమ్ 3 మూవీ పై ఎన్నో అంచనాలు ఉన్నాయి.. అలా భారీ తారాగణంతో తెరకెక్కిన ఈ సినిమా సడన్ గా ఆగిపోయింది.దానికి కారణం ఈ ఏడాది జరిగిన పహల్గాం ఉగ్రదాడి, బడ్జెట్ వంటివి.. అయితే గత కొద్ది రోజులుగా షూటింగ్ వాయిదా పడడంతో చాలామంది ఈ సినిమా విడుదల అవుతుందా లేదా అంటూ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా సినిమా విడుదలపై క్రేజీ అప్డేట్ ఇచ్చారు నటుడు పరేష్ రావల్.. తాజాగా ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. జంగిల్ -3 మూవీపై లేటెస్ట్ అప్డేట్ ఇచ్చారు. మరి ఇంతకీ ఆయన ఇచ్చిన అప్డేట్ ఏంటి..? జంగిల్ 3 మూవీ ఎప్పుడు విడుదల కాబోతుంది? అనేది ఇప్పుడు తెలుసుకుందాం.. గత సంవత్సరం ప్రకటించిన వెల్కమ్ ఫ్రాంచైజీ వెల్కమ్ -3 మూవీ అప్డేట్ గురించి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పరేష్ రావల్ మాట్లాడుతూ.. "అభిమానుల అంచనాలకు తగ్గట్టే జంగిల్ -3 ఉంటుంది. అలాగే ఈ సినిమా వచ్చే ఏడాది మార్చ్ లేదా ఏప్రిల్ నాటికి థియేటర్లలో విడుదలయ్యే అవకాశం ఉంది" అంటూ గుడ్ న్యూస్ చెప్పారు.. అంతేకాదు జూన్ నాటికి ఈ సినిమా షూటింగ్ దాదాపు 70% పూర్తయిందని,నవంబర్ లేదా డిసెంబర్లో తిరిగి షూటింగ్ ప్రారంభం కాబోతుందని తెలియజేశారు. పరేష్ రావల్ ఇచ్చిన అప్డేట్ తో అభిమానుల్లో మళ్ళీ కొత్త ఆశలు కలుగుతున్నాయి.. ఈ సినిమా బడ్జెట్ కారణంగా ఆగిపోయిందనే రూమర్లు కూడా వినిపించాయి. కానీ దీనిపై దర్శకుడు, నిర్మాత స్పందించలేదు. అయితే తాజాగా పరేష్ రావల్ ఇచ్చిన అప్డేట్ తో ఈ సినిమా చాలా త్వరగా షూటింగ్ పూర్తి చేసుకొని వచ్చే ఏడాది విడుదల అవుతుందని చెప్పినప్పటికీ అభిమానులు ఈ సినిమా హిట్ పై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే ఈ సినిమాలో గతంలో ఉన్న కొంతమంది నటీనటుల స్థానంలో వేరే వారిని చేర్చడంతో సినిమా హిట్ పై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.. అయితే ఈ విమర్శలన్నీ సినిమాకి హైప్ పెరిగేలా చేస్తున్నాయని చిత్రయూనిట్ భావిస్తుంది. జంగిల్ 3 మూవీ విషయానికొస్తే..అహ్మద్ ఖాన్ దర్శకత్వంలో జ్యోతి దేశ్ పాండే, ఫిరోజ్ ఎ. నడియాద్వాలా నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ మూవీలో అక్షయ్ కుమార్, రవీనాటాండన్, జాక్వెలిన్ ఫెర్నాండేజ్,దిశా పటాని,సునీల్ శెట్టి, జాకీ ష్రాఫ్,పరేష్ రావాల్, అర్షద్ వార్సీ, జానీ లివర్ వంటి భారీ తారాగణం ఉంది.. మరి చూడాలి 2026లో రాబోతున్న జంగిల్ -3 మూవీని అభిమానులు ఆదరిస్తారా లేదా అనేది ముందు ముందు తెలుస్తుంది.

# ఓజీ : వాళ్లని సుజిత్ ఎలా వాడుకున్నాడో..?




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఓజీ సినిమా విషయంలో రోజు రోజుకి హైప్ డబుల్ అవుతుంది. సెప్టెంబర్ 25న రిలీజ్ ప్లాన్ చేసిన ఈ సినిమా రిలీజ్ ఇంకా 11 డేస్ మాత్రమే ఉన్న టైం లో ప్రమోషన్స్ ప్లానింగ్ ఒక రేంజ్ లో ఉండబోతుందని తెలుస్తుంది. ఓజీ సినిమాపై పవర్ స్టార్ ఫ్యాన్స్ అంతా కూడా సూపర్ ఎగ్జైటెడ్ గా ఎదురుచూస్తున్నారు. ఐతే సినిమాలో పవర్ స్టార్ ఒక్కడు ఒక వైపు ఉండగా ఆయనతో పాటు భారీ తారాగణంతో నింపేశాడు సుజిత్.

బాలీవుడ్ రొమాంటిక్ స్టార్.. సినిమాలో విలన్ గా బాలీవుడ్ రొమాంటిక్ స్టార్ ఇమ్రాన్ హష్మిని తీసుకున్నాడు. అతను ఒమి రోల్ లో నటిస్తున్నాడని తెలిసిందే.


ఇప్పటికే ఇమ్రాన్ ఫస్ట్ లుక్ టీజర్ క్రేజీగా అనిపించింది. అతనే కాదు సినిమాలో టాలెంటెడ్ యాక్టర్ అర్జున్ దాస్ కూడా నటిస్తున్నాడు. సినిమాలో అతని రోల్ ఆడియన్స్ ని సర్ ప్రైజ్ చేస్తుందని అంటున్నారు. ఓజీ సినిమాలో హీరోయిన్ గా ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్ గా నటిస్తుంది. పవన్ కళ్యాణ్, ప్రియాంక ఇద్దరి పెయిర్ సినిమాకు ఫ్రెష్ నెస్ తెచ్చింది. ఇప్పటివరకు యువ హీరోల సరసన నటించిన ప్రియాంక కెరీర్ లో ఫస్ట్ టైం ఒక స్టార్ తో ఛాన్స్ అందుకుంది. ఈ సినిమాతో అమ్మడి రేంజ్ పూర్తిగా మారిపోయేలా ఉంది. పవర్ స్టార్ ఓజీ సినిమా ప్రతి అప్డేట్ ఫ్యాన్స్ కి పీక్స్ లో హైప్ ఎక్కిస్తుంది. ఓజీ కోసం డైరెక్టర్ సుజిత్ ఎంత కష్టపడుతున్నాడో మ్యూజిక్ డైరెక్టర్ థమన్ కూడా అదే రేంజ్ లో కష్టపడుతున్నాడు. ఓజీకి ఈ రేంజ్ రావడానికి థమన్ ఇస్తున్న మ్యూజిక్ వల్లే అని చెప్పడంలో సందేహం లేదు.

**ఫస్ట్ గ్లింప్స్ నుంచే సినిమా రేంజ్..** ఓజీ ఫస్ట్ గ్లింప్స్ నుంచే సినిమా రేంజ్ ఇది అని తెలిసేలా చేశాడు థమన్. ఇక రిలీజైన పవర్ స్టోర్మ్, సువ్వి సువ్వి సాంగ్స్ నెక్స్ట్ లెవెల్ అనిపించాయి. పవర్ స్టార్ ఓజీకి అన్ని పాజిటివ్ సైన్స్ గా ఉన్నాయి. ఇక సినిమా వచ్చి సంచలనాలు సృష్టించడమే మిగిలి ఉంది. పవర్ స్టార్ స్టిలిష్ లుక్స్ ఇంకా ఆయన స్వాగ్ సినిమాకు స్పెషల్ ఎట్రాక్షన్ అయ్యేలా ఉన్నాయి. పవన్ కళ్యాణ్ ఓజీ తో మరోసారి ఆయన బాక్సాఫీస్ స్టామినా ప్రూవ్ చేయాలని చూస్తున్నారు.

ఇప్పటికే ఓవర్సీస్ లో బుకింగ్స్ తో రికార్డ్ సృష్టిస్తున్న ఓజీ రిలీజ్ టైం లో ఎలాంటి హంగామా చేస్తుందో చూడాలి. సాహోతో బాలీవుడ్ ఆడియన్స్ని మెప్పించిన సుజిత్ ఆఫ్టర్ లాంగ్ టైం ఓజీ తో వస్తున్నాడు. మరి ఈ సినిమా సుజిత్ మార్క్ చూపిస్తుందా లేదా అన్నది చూడాలి.

# హిందీ సినిమాలు.. రాజాసాబ్ పాప రివర్స్ కౌంటర్

హీరోయిన్ మాళవిక మోహనన్ గురించి అందరికీ తెలిసిందే. మాలీవుడ్ కు చెందిన ఆమె.. ఇప్పటికే తమిళ, మలయాళ భాషల్లో వరుస సినిమాల్లో నటించి తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. శాండల్ వుడ్, బాలీవుడ్ లో కూడా అడుగుపెట్టిన ఆమె.. ఇప్పుడు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ రాజా సాబ్ తో తెలుగులోకి ఎంట్రీ ఇవ్వనుంది. ప్రభాస్, డైరెక్టర్ మారుతి కాంబోలో రాబోతున్న ఆ సినిమా పై ఇప్పటికే భారీ హైప్ నెలకొనగా, మాళవిక లుక్స్ కు సూపర్ రెస్పాన్స్ వచ్చింది. వచ్చే సంక్రాంతికి సినిమా రిలీజ్ కానుండగా.. ఇప్పుడు షూటింగ్ ను శరవేగంగా పూర్తి చేస్తున్నారు మేకర్స్. అదే సమయంలో ఇప్పుడు ఓ ఇంటర్వ్యూలో కీలక కామెంట్స్ చేసింది మాళవిక. బియాండ్ ది క్లౌడ్స్ తో బాలీవుడ్ లో అడుగుపెట్టిన ఆమె.. గత ఏడాది యుధ్రా సినిమాలో నటించారు. కానీ అనుకున్న స్థాయిలో రెస్పాన్స్ అందుకోలేకపోయిన మాళవిక.. ఇప్పుడు మరో సినిమా చేయనున్నారని కొద్ది రోజులుగా వార్తలు వస్తున్నాయి. రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ లో యాక్ట్ చేస్తారని ప్రచారం జరిగింది. అయితే హిందీ చిత్రాల విషయంపై తన అభిప్రాయం వ్యక్తపరిచింది. "నేను ఒక విషయం మీద చాలా క్లారిటీతో ఉంటా. ప్రస్తుతం మలయాళం,



తెలుగు, తమిళంలో అద్భుతమైన సినిమాలు చేస్తున్నాను. కానీ హిందీ చిత్రాలు కేవలం 'పేరు కోసం చేయడం నాకు ఇష్టం లేదు" అంటూ చెప్పుకొచ్చింది మాళవిక. "వాటి నుంచి నాకు ఎటువంటి ఉత్సాహం ఉండదు. చాలా సినిమాల తర్వాత, మీరు ఒక దశకు చేరుకుంటారు. అప్పుడే మీరు ఇలా ఆలోచిస్తారు.. ఈ సినిమాకు నేను ఐదు నెలలు నా జీవితం ఇవ్వాలా?" అని అనుకున్నట్లు తెలిపారు. దీంతో ఇప్పుడు ఆ విషయం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఆమె ఫోకస్ క్లియర్ గా తెలుస్తుందని అంటున్నారు. అందుకే ప్రాజెక్టుల విషయంలో సరైన విధంగా ఆలోచించి, భిన్నమైన సినిమాల ద్వారా మాళవిక మెప్పిస్తున్నారని కామెంట్లు పెడుతున్నారు. ఆమె చేసే ప్రతి రోల్ కూడా ఇంట్రెస్టింగ్ ఉంటుందని చెబుతున్నారు. ప్రతి సినిమా కోసం చాలా హార్డ్ వర్క్ చేస్తున్నట్లు అర్థమవుతుందని అంటున్నారు. మరి ఫ్యూచర్ లో మాళవిక.. బాలీవుడ్ సినిమాల్లో నటిస్తారో లేదో వేచి చూడాలి.

# అనుభవాలు విలువైనవి.. ఆ పాత్రలపై కీలక కామెంట్స్!

బాలీవుడ్ నటి విద్యాబాలన్..ఈ పేరు చెప్పగానే అందరికీ డర్టీ పిక్చర్, కహానీ,షేర్నీ వంటి కొన్ని సినిమాలు కళ్ళ ముందు మెదులుతాయి. సినిమాల్లోకి హీరోయిన్ గా ఎవరైనా ఎంట్రీ ఇవ్వవచ్చు. కానీ ప్రజల మనసు గెలిచిన వాళ్ళే ఇండస్ట్రీలో ఎక్కువ కాలం నిలుస్తారు.అలాంటి వారిలో విద్యాబాలన్ కూడా ఒకరు. విద్యాబాలన్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చి 20 ఏళ్లయినా కూడా ఇంకా చేతినిండా అవకాశాలతో బిజీ బిజీగా గడుపుతోంది.అయితే అలాంటి విద్యాబాలన్ సినిమాల్లోకి వచ్చాక ఎన్ని ఇబ్బందులు పడిందో.. ఎలాంటి కష్టాన్ని అనుభవించిందో.. 20 ఏళ్ల జర్నీలో ఆమె ఎదుర్కొన్న ఆటుపోట్లు ఏంటి ?అనేది ఆమె మాటల్లోనే తెలుసుకుందాం..

**వారి మాటలు విని శరీరాన్ని కష్టపెట్టాను..** విద్యాబాలన్ సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చి 20 ఏళ్లయిన నేపథ్యంలో కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలను బయటపెట్టింది. ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "నేను నా



26 ఏళ్ల వయసులో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చాను. అలా మొదటి సినిమా పరిణీత విడుదలయ్యాక.. నా కెరియర్ మొత్తం మారిపోయింది. ఆ తర్వాత వరుస ఆఫర్స్ క్యూ కట్టాయి. సినిమాల్లోకి వచ్చిన కొత్తలో చాలామంది నా బరువు తగ్గించుకోమని సలహాలు ఇచ్చారు. వాళ్ల కారణంగా నా శరీరాన్ని చాలా కష్టపెట్టాను కూడా. కానీ ఆ తర్వాత అసలు నిజం గ్రహించి ఎవరెన్ని విమర్శలు చేసినా.. ఎవరెన్ని చెప్పినా నేను నాలా ఉండాలని ఫిక్స్ అయ్యాను.

**ఆయన రాకతో జీవితం మొత్తం మారిపోయింది..** అలా సిద్ధార్థ్ కపూర్ నా జీవితంలోకి ఎంట్రీ ఇచ్చాక నా లైఫ్ మొత్తం చేంజ్ అయిపోయింది. ఎందుకంటే అప్పటినుండి నన్ను నేను ప్రేమించుకోవడం మొదలుపెట్టాను.మనల్ని మనం ప్రేమించుకుంటే ఎన్ని విమర్శలు వచ్చినా పట్టించుకోనవసరం లేదు. సినిమాల్లోకి రావాలంటే బ్యాగ్రౌండ్ ఉండాలి. కానీ నేను ఏ బ్యాక్ గ్రౌండ్ లేకుండానే వచ్చాను. కేవలం నటన మీద ఉన్న ఇంట్రెస్ట్ తోనే ఇప్పటివరకు కొనసాగుతున్నాను. అలాగే లేడీ ఓరియంటెడ్ సినిమాలకు నన్ను కేరాఫ్ అడ్రస్ అంటే చాలా బాగా ఆస్వాదిస్తాను. సినిమాల్లోకి వచ్చిన కొత్తలో చాలా ఇబ్బందులు పడ్డాను. కానీ అన్నింటినీ ఓర్చుకొని ముందుకు అడుగులు వేసా. మా అమ్మ ప్రతిసారి నా ప్రవర్తన చూసి నువ్వు నీ వయసు కంటే ఎక్కువ మెచ్యూర్డ్ గా ఉన్నావని పొగుడుతుంది. కానీ నేను దేన్ని కూడా సీరియస్ గా తీసుకోను.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536